అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 11-05-2024

సంపుటి : 10 సంచిక : 81 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఇండియా గెలుపే దేశానికి రక్ష



కార్పొరేట్ల కోసమే మోడీ 'వికసిత్ భారత్'

రాజ్యాంగం, లౌకికవాదంపై తీవ్ర దాడి : ఏచూరి

3లో..

కేజ్రీవాల్‌కు బెయిల్

షరతులతో సుప్రీం మంజూరు

- తీహార్ జైలు నుంచి విడుదలైన ఆప్ అధినేత
- అభివాదం చేసిన ఢిల్లీ సీఎం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రచారం చేసేందుకు వీలు కల్పిస్తూ కేజ్రీవాల్‌కు అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 1 వరకు ఈ బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. జూన్ 2న తిరిగి లొంగిపోవాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కేజ్రీవాల్‌కు మధ్యంతర ఉపశమనం మంజూరు చేయడంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరపున కోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వ్యతిరేకించారు. ఖలిస్తానీ కార్యకలాపాలపై జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధించబడిన అమృత్‌పాల్‌సింగ్ కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యం లో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు తీవ్ర ప్రభావం ...11లో

సుప్రీం తీర్పుపై సీపీఐ(ఎం)హర్షం

ఈడీ, మోడీ సర్కార్ నీచపు ఎత్తుగడలకు చెంపదెబ్బ :

కేజ్రీవాల్‌కు బెయిల్‌ను స్వాగతించిన పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్వాగతించింది. ఇలా బెయిల్‌ను ఇవ్వడం ద్వారా, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కేజ్రీవాల్‌ను అడ్డుకోవాలన్న ప్రయత్నాన్ని కోర్టు భగ్నం చేసిందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్ అరెస్టు విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, మోడీ ప్రభుత్వం పన్నిన నీచపుటెత్తుగడలు ఈ తీర్పుతో ఎండగట్టినట్టైందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మళ్లీ బీజేపీ వస్తే..

హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కే..

వందేండ్లు వెనక్కే..

రిజర్వేషన్లు రద్దు

- కారు షెడ్‌కి పోలే.. తూకానికి పోయింది
- అందుకే కేసీఆర్ బస్సుయాత్ర చేసిండు
- హైదరాబాద్‌లో మతకల్లోలాలకు బీజేపీ యత్నం
- జేపీ దర్గా సాక్షిగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం..
- పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం : మక్తల్, షాద్‌నగర్, గోషామహల్ సభల్లో సీఎం రేవంత్



నవతెలంగాణ- మక్తల్, షాద్‌నగర్, హైదరాబాద్

'బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్‌లు ఉండవు. మరో వందేండ్లు వెనక్కు పోతాం. దేశంలో పెట్టుబడులు రావు.. అభివృద్ధి ఉండదు. హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులు గుజరాత్‌కు తరలించుకుపోవాలనే కుట్ర జరుగుతుంది. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టడమే వారి పని. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒకటే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. షెడ్డుకు పోయిన కారు ఇక తిరిగి రాదని వ్యాఖ్యానించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మక్తల్, షాద్‌నగర్, హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతాల్లో జరిగిన సభల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో అరుణమ్మ గెలిస్తే మళ్లీ మాఫియా రాజ్యం వస్తుందని, ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి ...11లో

కవిత పాత్రపై ఈడీ తొలి చార్జిషీట్



కేసుకు సంబంధించి ఏడో సప్లమెంటరీ

224 పేజీల బ్రీఫ్ నోట్‌తో ప్రత్యేక రిపోర్ట్

అందులో కవిత, మరో నలుగురు

వివరాలు 2లో

మోడీ పనైపోయింది



దేశానికి ప్రధాని కాలేరు

ఈ సారి ఇండియా తుపానే : రాహుల్ గాంధీ

3లో..

సీఎం రేవంత్‌కు ఈసీ నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులు ఏ రేవంత్‌రెడ్డికి కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. 48 గంటల్లో ఆ నోటీసులకు సమాధానం ఇవ్వాలనీ, లేనిపక్షంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు ...11లో

వాళ్లు గెలిస్తే దేశం నాశనమే

బీజేపీని బొంద పెట్టాలి..

- ప్రజాసమస్యలపై పనిచేస్తున్న జహంగీర్‌ను గెలిపించండి : బహిరంగ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మోడీ మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం అవుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం రావణకాష్టంలా మండిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందన్నారు. పొరపాటున కూడా బీజేపీని మళ్లీ అధికారంలోకి రానివ్వొద్దని, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న ఆ పార్టీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ఎర్రజెండా పార్టీలు దేశవ్యాప్తంగా 28 పార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడినట్టు చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 20 కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీని గిట్టుబాటు ధర అడిగినందుకు 765 మంది రైతులని కాల్చి చంపిందన్నారు. వారి ఆగడాలను ప్రశ్నించినందుకు ప్రతిపక్ష నాయకులను జైళ్లకు పంపిస్తుందన్నారు. పేదల సంక్షేమాన్ని మరిచి అదానీ, అంబానీలకు లక్షల కోట్లు దోచిపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులంతా రాజకీయాల్లోకి వచ్చి భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. శతకోటీశ్వరులై చట్టసభలకు పోతున్నారన్నారు. వారు వాళ్ల సంపదను కాపాడుకోవడానికే చూస్తారు తప్ప పేదల గురించి పట్టదని చెప్పారు. అందుకే ఈ ఎన్నికల్లో పేదప్రజల పక్షాన నికరంగా పోరాడే కమ్యూనిస్టులను గెలిపించాలన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది సీపీఐ(ఎం) మాత్రమే అని అన్నారు. నిరంతరం ప్రజాసమస్యలపై పనిచేస్తున్న భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ...11లో

12 మంది మావోయిస్టులు హతం

ఎన్నికల వేళ బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్



మరోసారి రక్తమోడిన అడవితల్లి

న్యూఢిల్లీ / బీజాపూర్ : అడవితల్లి మళ్లీ రక్తమోడింది. భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు చనిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలో పిడియా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఎదురుకాల్పులు జరిగాయి. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ...11లో

మటన్, మంగళసూత్రాలే

మీ ప్రచారాస్త్రాలా?

అభివృద్ధి గురించి ఎందుకు మాట్లాడరు?

కాంగ్రెస్‌ను విమర్శించడం ద్వారానే ఓట్లు అడుగుతున్నారు

టెంపోల్లో డబ్బు తరలిస్తుంటే, బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది ?

తెలంగాణకు ఏమిచ్చారో మోడీ చెప్పాలి :

కాషాయ పార్టీపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఫైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పకుండా మొఘలుల మటన్, హిందువుల మంగళసూత్రాలు, ముస్లిం రిజర్వేషన్లనే ప్రచార అస్త్రాలుగా ఎంచుకుందని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ దేశాన్ని అభివృద్ధి చేయకపోగా...దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చేసిన పనులను చెప్పి ఓట్లు అడిగే ధైర్యంలేని మోడీ...కాంగ్రెస్‌ను విమర్శించడం ద్వారా ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అంబానీ, అదానీలు టెంపోల్లో డబ్బులు ముట్టజెపుతున్నారనీ, తమ పార్టీ వాళ్లు టెంపోల్లో డబ్బులు పంచుతున్నారంటూ ఆయన మరో అబద్ధపు ప్రచారాన్ని తెరపైకి తెచ్చారనీ, డబ్బు తరలిస్తుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలేం చేస్తున్నాయని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఓ ప్రముఖ హోటల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ నేతలు నాసర్ హుస్సేన్, మన్సూర్ అలీ, రాష్ట్ర నాయకులు మధుయాష్కీగౌడ్, జే గీతారెడ్డి, ప్రొటోకాల్ చైర్మెన్ హర్కర వేణుగోపాల్, మీడియా కమిటీ చైర్మెన్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఖర్గే విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణకు వచ్చిన ప్రధాని మోడీ ఈ రాష్ట్రానికి పెద్ద ప్రాజెక్టు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలమేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 'బీజేపీ మాత్రం అభివృద్ధి గురించి చెప్పి ఓట్లు అడగదు. కాంగ్రెస్‌పై నిందలు మోపడం ద్వారా ఆ పార్టీ నేతలు ఓట్లు అడుగుతారు. హస్తం పార్టీ తమకు పోటీయే కాదంటూనే పదేపదే బీజేపీ మాపై విమర్శలు చేస్తున్నది. మా పార్టీకి భయపడుతున్నందునే పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. నల్లధనం వెలికితీస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారు. దాని ప్రయోజనాలను వారి మిత్రులకే అందజేశారు' అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధనవంతుల ఆస్తులు లాక్కుని పేదలకు పంచుతారంటూ మోడీ దుష్ప్రచారం చేస్తున్నారని ...11లో

అంబానీ,అదానీలకే

మోడీ నజరానాలు



- చేనేతపై జీఎస్టీ
- స్కీములు ఎత్తేసిన మొదటి ప్రధాని మోడీయే..

గోదావరి నీళ్లు ఎత్తుకుపోయేందుకు కుట్ర

మేము ఆర్డర్లు ఇచ్చినన్నాళ్లూ చేనేతలకు పని

కాంగ్రెస్ బకాయిలు ఇవ్వదు..పనీ కల్పించదు

సిరిసిల్లలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్

సిద్దిపేట సభతో బస్సు యాత్ర ముగింపు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / సిరిసిల్ల టౌన్/ సిద్దిపేట

'బీజేపీ ఎజెండాలో పేదలు లేరు.. పెద్దపెద్ద గద్దలే ఉన్నాయి. పదేండ్ల పాలనలో పేదల కోసం ఏ ఒక్క పనీ చేయని మోడీ అంబానీ, అదానీల కోసమే పని చేశారు.. చేనేతలపై జీఎస్టీ వేసి, వారి సంక్షేమా న్ని, స్కీములను ఎత్తేసిన మొట్టమొదటి ప్రధాని నరేంద్ర ...11లో

మేం పంపిన డబ్బులు

అక్రమార్కుల జేబుల్లోకి..

ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ దోచుకుంది

- నేడు అదే దారిలో కాంగ్రెస్...
- రిజర్వేషన్లకు మోడీ చౌకీదారు
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగించి ముస్లింలకు కాంగ్రెస్ మేలు చేసే యత్నం
- కులమతాలను రెచ్చగొడుతున్న ఆ పార్టీలను ఓడించండి : నారాయణపేట బీజేపీ జనసభలో ప్రధాని మోడీ

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం నుంచి కోట్లాది రూపాయలు పంపాం.. అవి ప్రజలకు చేరకుండా అక్రమార్కుల జేబులు నిండాయి. దేశంలో ఎస్సీ, ఎస్టీ బీసీ రిజర్వేషన్లను కాపాడటంలో చౌకీదారుగా పని చేస్తా. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయి. విలువలు లేకుండా ఇరువురూ ఒక్కటై బీజేపీ అభ్యర్థులను ఓడించే పనిలో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగించి మైనార్టీలకు మేలు కలిగించే ఆ పార్టీలను చిత్తుగా ఓడించాలి." అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. నారాయణపేట ...11లో



...11లో



భువనగిరి ఖిల్లాలో ఎర్రదండు

సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజల్లోకి.. ఉద్యమ ఫలితాలతో.. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) ఎండీ జహంగీర్‌కు అన్ని వర్గాల మద్దతు

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

విప్లవ పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు కేంద్రమైన భువనగిరి ఖిల్లాలో ఎర్రదండు కదం తొక్కుతోంది. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ప్రచారం సాగుతోంది. ఎర్రజెండా గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా సాధించిన ఫలితాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రజా సమస్యలపై నిర్దిష్టమైన ప్రణాళికలతో సీపీఐ(ఎం) ప్రచారం నిర్వహిస్తోంది. ప్రజల నుంచి పార్టీ అభ్యర్థి జహంగీర్‌కు అపూర్వ ఆదరణ లభిస్తోంది. మిగతా పార్టీల్లోనూ చర్చనీయాంశమవుతోంది.

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కమ్యూనిస్టుల పోరాట చరిత్ర కలిగినవే. నాటి సాయుధ రైతాంగ పోరాటం మొదలు నేటి మూసీ ప్రక్షాళన ఉద్యమాల వరకు ఎన్నో ప్రజా ఉద్యమాలను నడిపిన ఘనత కమ్యూనిస్టులకు దక్కుతుంది. పార్లమెంట్ పరిధిలో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం ఒకప్పుడు కమ్యూనిస్టు ఉద్యమాలకు కంచుకోటలు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు నాయకులు ప్రజా ప్రతినిధులుగానూ ప్రాతినిధ్యం వహించారు. భువనగిరిలో రావినారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, తుంగతుర్తిలో బీఎన్‌రెడ్డి, మల్లు స్వరాజ్యం, నకిరేకల్‌లో ధర్మభిక్షం, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, అత్యధిక కాలం నర్రా రాఘవరెడ్డి, ఆలేరులో ఆరుట్ల కమలాదేవి, జనగామలో ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి ప్రాతినిధ్యం వహించారు. వారు ప్రాతినిధ్యం వహించిన సమయంలో చేసిన అభివృద్ధి నేటికీ పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, భూమి లేని వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోయాయి. భువనగిరి పార్లమెంట్ పరిధిలో కమ్యూనిస్టుల ప్రాబల్యంతో అత్యధికంగా పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేశారు. ఇప్పటికీ ఆ కుటుంబాలు ఎర్రజెండా అభిమానులు గానే.. ఎర్రజెండాకు అండగా నిలబడుతున్నారు.

ప్రజా ఉద్యమాల ఫలితాలతో ప్రజల్లోకి..

గత ఉద్యమాల ఫలితాలను, సమస్యలను ప్రజలకు వివరిస్తూ సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రచారం సాగిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రజల కోసం చేపట్టబోయే పోరాటాలను ప్రజలకు చెబుతూ వారి మద్దతును కూడగడుతున్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అత్యధిక గ్రామాల నుంచి ప్రవహిస్తున్న 'మూసీ' ప్రక్షాళన కోసం ఇటీవల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి జహంగీర్ నేతృత్వంలో ఉద్యమాన్ని చేపట్టారు. ఈ ఉద్యమం ఫలితంగా రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతుల నుంచి సీపీఐ(ఎం)కు మంచి ఆదరణ లభిస్తోంది.

కమ్యూనిస్టుల ఫలితమే.. సాగునీటి ప్రాజెక్టులు

భువనగిరి, నకిరేకల్ ప్రాంతాల్లో సాగు నీటి కోసం ఎన్నో ఏండ్లుగా సతమతమవుతున్న రైతుల పక్షాన సీపీఐ(ఎం) చేపట్టిన ఉద్యమాల ఫలితంగా ఈ ప్రాంతంలో రెండు సాగు నీటి అవసరాల కోసం ధర్మారెడ్డి పల్లి, పిల్లాయిపల్లి కాలువల ను ప్రభుత్వాలు ప్రారంభించాయి. దాంతో వేలాది మంది రైతులకు లబ్ధి చేకూరుతున్నది. ఇలా అనేక ఉద్యమాల ఫలితంగా ప్రజా సమస్యలు పరిష్కరించిన చరిత్ర గల కమ్యూనిస్టులకు అవకాశం ఇస్తే ఉద్యమాలకు మద్దతు ఇచ్చిన వారవుతారని చెప్పడం ప్రజలను ఆలోచింప జేస్తోంది. ఈ ప్రాంత చరిత్రను మరొక్క సారి గుర్తు చేసుకుంటూ ఓటర్లు సీపీఐ(ఎం) అభ్యర్థిని ఆదరిస్తున్నారు. ఘనస్వాగతం పలుకుతున్నారు.



కృష్ణయ్యపై దాడి పట్ల బీసీ సంఘాల ఖండన

నవతెలంగాణ -హైదరాబాద్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంఘాల ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడారు. శ్రీకాళహస్తిలో బీసీల ఆశాజ్యోతి ఆర్.కృష్ణయ్యపై తెలుగుదేశం పార్టీ గుండాలు జరిపిన దాడిని ప్రజలందరూ ఖండించాలన్నారు. కృష్ణయ్యపై దాడిని యావత్ 70 కోట్ల బీసీలపై దాడిగా పరిగణిస్తున్నామని, ఇలాంటి పిరికిపంద రాజకీయాలు చేస్తే ఎవరూ భయపడరని తెలిపారు. దాడి చేసిన వారిని, దాడి చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణయ్య చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడాన్ని తట్టుకోలేకే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మరోసారి ఇలాంటి దాడులకు పాల్పడితే తిరిగి ప్రతిదాడులు చేస్తామని హెచ్చరించారు. 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బహుజన వాదులంతా ఈ దాడిని గుర్తుంచుకొని బీసీ వ్యతిరేకులకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నేతలు వేముల రామకృష్ణ, సుధాకర్, ఉదయ్ నేత, చౌటపల్లి సురేష్, నందగోపాల్, రాందేవ్, చందు, మట్టా జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రిలో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబీకుల ఆందోళన

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రయివేటు ఆస్పత్రిలో మగశిశువుకు జన్మనిచ్చి బాలింత మృతిచెందింది. కాగా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బాలింత మృతిచెందినట్టు కుటుంబీకులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామి డిపల్లి చౌరస్తా వద్ద నున్న ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆలూరు మండలం కల్లెడ గ్రామానికి చెందిన గర్భిణి పిట్ల సుమలతకు సిజేరియన్ చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. ఉమ్మినూరు మింగడంతో బాబును పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లి వచ్చేసరికి రాత్రి 7 గంటల సమయంలో బాలింత మృతిచెందింది. ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వహించారని, మత్తు మందు వికటించి మృతిచెందినట్టు కుటుంబీకులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట పోలీసులు మోహరించారు. మృతురాలి భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. మృతురాలికి నాలుగేండ్ల కొడుకు, మూడేండ్ల కూతురు ఉంది.

గొప్ప సాంకేతిక విప్లవకారుడు ఏఎస్‌రావు

- మాడభూషి శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏఎస్‌రావు దేశం గర్వించదగ్గ గొప్ప సాంకేతిక విప్లవకారుడని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ప్రశంసించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరధి థియేటర్స్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్‌రావు బయో డాక్యుమెంటరీని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ అధ్యక్షతన ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నేడున్న పరిస్థితుల్లో ఏఎస్‌రావు లాంటి గొప్ప మానవతా వాదులను సమాజం గుర్తు చేసుకోవాల్సిన అవసరం పెరిగిందన్నారు. 'ఏఎస్‌రావు అమర్‌రహే అని నినదిద్దాం..ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుందాం' అంటూ సూచించారు. సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఒక వ్యక్తిపై డాక్యుమెంటరీని తీయటం చాలా కష్టంతో కూడుకున్న పని అని తెలిపారు. మనిషి జీవితంలో చాలా పార్శ్వాలుంటాయనీ, వాటిలో అభివృద్ధికరమైన అంశాన్ని తీసుకుని డ్యాక్యుమెంటరీ తీయటం అభినందనీయమని అన్నారు. పురోగమన సిద్ధాంతం చనిపోకూడదన్నారు. దాన్ని సజీవంగా ఉంచటం, నేటి సమాజానికి అందించటం అత్యంత అవసరమని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె ఆనందాచారితో పాటు భరద్వాజ్, వేణుగోపాల్, రవీంద్రగోపాల్, వీకే ప్రేమ్‌చంద్, ఎన్ సోమశేఖర్, జి యాదగిరి రావు, పీటీ చారి, బీడీఎల్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆకలి మనిషికి గొప్ప గురువని చెప్పారు. .అది మనుషులకు ఉంటుంది కానీ..కులాలకు, గోత్రాలకు ఉండదని గుర్తు చేశారు. ఏఎస్‌రావు తన జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డారని చెప్పారు. వాటి నుంచి సమాజంలో ఉన్న అసమానతలను తరచి చూశారన్నారు. ఆ పరిణామాలు ఆయనలో అనేక మార్పులను తీసుకొచ్చాయని తెలిపారు. శ్రామికుల పట్ల ప్రేమను పెంచుకున్నారనీ, వారిని ప్రేమించారని చెప్పారు. అందువల్ల ఏఎస్‌రావు జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం డాక్యుమెంటరీలో నటించిన నటీ నటులను సన్మానించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ-తొర్రూరు

ఎన్‌సీటీఈ ఇచ్చిన వివరణ, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మేరకు టెట్‌పై అడ్డంకులు తొలగినందున ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొర్రూర్‌లో సంఘం నాయకులు ఎ.మురళీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన టీఎస్ యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టెట్‌పై ఎన్‌సీటీఈ ఇచ్చిన వివరణ, టెట్‌తో నిమిత్తం లేకుండా ఎస్జీటీలు, పండిట్‌లు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందిగ్ధత తొలగిందని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికలు ముగియగానే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని



డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురి చేసిన టెట్ అంశాన్ని పరిష్కరించకుండా నిర్లిప్తంగా వ్యవహరించిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అక్టోబర్‌లో బదిలీ అయి రిలీవ్ చేయని ఉపాధ్యాయులను పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలని, మల్టీ జోన్-2లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలని, ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖ పరిధిలోకి తీసుకుని 010 హెడ్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని, విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికే పాఠశాలల్లో విద్యావాలంటీర్లను, పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, ఉచిత విద్యుత్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఏ.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.స్వప్న, జిల్లా కోశాధికారి కె.నాగమల్లయ్య, కార్యదర్శులు ఎ.వెంకన్న, డి.హుస్సేన్, ఎన్.జనార్దన చారి, కె.బిక్షపతి, పి.మంజుల, ఎం.మంజుల, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.వివేక్ పాల్గొన్నారు.

కవిత పాత్రపై ఈడీ తొలి చార్జిషీట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేసింది. కవితతో పాటు ఈ కేసులో సహ నిందితులుగా ఉన్న మరో నలుగురి పాత్రపై ఇందులో పేర్కొంది. ఈ మేరకు శుక్ర వారం రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కె మట్ట దాఖలు చేశారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్, సెక్షన్ 45, 44(1) ప్రకారం ఈ అనుబంధ చార్జిషీట్ ను కోర్టులో సమర్పించారు. అలాగే 224 పేజీలతో సప్లమెంటరీ చార్జిషీట్‌లోని బ్రీఫ్ అంశాలను ప్రత్యేకంగా కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది. కాగా, ఈనెల 7 కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపుపై విచారణ సందర్భంగా... త్వరలో కవిత పాత్రపై చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు ఈడీ న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అందులో భాగంగా చార్జిషీట్ ను సమర్పించారు. కాగా, వచ్చే వారం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై కూడా ఈడీ చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

60 రోజుల్లో చార్జిషీట్

గరిష్టంగా ఏడేండ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో 60 రోజులపాటు అరెస్ట్ చేసిన నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతు న్నారు. అలాగే లిక్కర్ స్కాంలో అరెస్టైన కవితతో పాటు, ఇతరులు నిందితులుగా తేలితే గరిష్టంగా ఏడేండ్లు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే, మనీలాండరింగ్ కేసులో మార్చి 15 న కవితను ఈడీ అరెస్ట్ చేసింది. ఈ నెల 15తో ఆమెను ఈడీ అరెస్ట్ చేసి 60 రోజులు ముగుస్తాయి. దీంతో గడవులోపు ఆమె పాత్ర పై తాజాగా ఈడీ చార్జిషీటు దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపింది. కాగా, ఈడీ కేసులో మే 14 వరకు, సీబీఐ కేసులో మే 20 వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ట్రయల్ కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

ఇప్పటి వరకు 18 మంది అరెస్ట్

ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌తో పాటు మొత్తం 18 మందిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. సంజయ్ సింగ్ ఒక్కరికి మాత్రమే ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ వచ్చింది. అయితే ఈ కేసుకు సంబంధించి నవంబర్ 25, 2022 లో సీబీఐ తొలి చార్జిషీట్ దాఖలు చేయగా... తర్వాతి రోజు ఈడీ చార్జిషీట్ వేసింది. కాగా, ప్రస్తుతం కవితతో పాటు, మరో నలుగురి పేర్లను చేర్చుతూ తాజాగా ఏడో చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించింది. మరో వైపు సౌత్ గ్రూప్‌లో కీలకంగా వ్యవహరించిన శరత్ చంద్రా రెడ్డి, మాగుంట శ్రీనివాస్, ఆయన కుమారుడు రాఘవ రెడ్డి అప్రూవర్లుగా మారడంతో వాళ్లకూ బెయిల్ మంజూరైంది.

కవితస న్నిహితుడిగా దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్న అభిషేక్ బోయినపల్లి అనారోగ్య కారణాలదష్ట్యా మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు.

కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ఈడీకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు ఈనెల 24కు వాయిదా వేసింది. అలాగే కవిత పిటిషన్‌పై తమ స్పందన తెలపాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. లిక్కర్ స్కాంలో రౌస్ అవెన్యూ (ట్రయల్) కోర్టు ఈనెల 6న బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్రమ అరెస్ట్, అనారోగ్య సమస్యలను పేర్కొంటూ ఆమె న్యాయవాది మోహిత్ రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారణ జరిపారు. కవిత తరపు సీనియర్ న్యాయవాదులు విక్రమ్ చౌదరి, నితేష్ రాణా, మోహిత్ రావులు హాజరయ్యారు. ఈడీ తరపున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. కవితను ఈడీ అక్రమంగా అరెస్ట్ చేసిందని, ఈడీ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయాన్ని కవిత న్యాయ వాది విక్రమ్ చౌదరి కోర్టుకు తెలిపారు. ట్రయల్ కోర్టులో తమ వాదనలు సరిగా వినిపించేందుకు అవకాశం దక్కలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బెయిల్ పిటిషన్ పై తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. అయితే ఈ వాదనలను ఈడీ జోహెబ్ హుస్సేన్ ఖండించారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం ఈనెల 24న ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని వెల్లడించింది.

అతివలకు ప్రతిష్టాత్మకం 'చునావ్'

- లోక్‌సభ బరిలో ఆరుగురు
- కొత్తవారితోపాటు సీనియర్ల పోటీ
- ఇప్పటివరకు రాష్ట్రం నుంచి పార్లమెంటుకు ఇద్దరే
- ఈసారి ఎందరో..?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తాజా పార్లమెంటు ఎన్నికలు అతివలకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. దేశంతోపాటు రాష్ట్రంలోనూ 18వ లోక్‌సభ ఎన్నికల బరి విపరీతంగా క్రేజ్ కలిగిఉంది. ప్రపంచమంతా భారత ఎన్నికలవైపు చూస్తున్న క్రమంలో తెలంగాణ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఆరుగురు మహిళలు రంగంలో ఉండటం గమనార్హం. రాష్ట్రంలో నాలుగో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఇతర అభ్యర్థులు ఉన్నా, ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తుండటంతో రాజకీయ విశ్లేషకుల దృష్టి వీరిపై పడింది. వీరిలో ముగ్గురు రాజకీయాలకు కొత్త కాకపోయినా, లోక్‌సభకు పోటీచేయడం మొదటిసారి కావడం తెలిసిందే. మూడు ప్రధాన పార్టీల నుంచి పార్లమెంటుకు మహిళా అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. పురుష అభ్యర్థులతో సమానంగా చెమటోడుస్తున్నారు, తాము కచ్చితంగా గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీరంతా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి పోటీ చేస్తూ ఎన్నికల్లో తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం 17 స్థానాలకు 525 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి పోటీచేస్తున్నవారిలో ఆరుగురు మహిళలు కావడం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్ ఒక్కరు, బీజేపీ నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు.

వీరే..ఆ ఆరుగురు

మల్కాజ్‌గిరి నుంచి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునితా మహేందర్‌రెడ్డి ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరి టికెట్ సాధించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ సీటు అయిన మల్కాజ్‌గిరి నుంచి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి భార్య అయిన సునితారెడ్డిని నిలబెట్టారు. అలాగే వరంగల్ నుంచి మాజీ మంత్రి కడియం శ్రీహరి కూతరు డాక్టర్ కె కావ్య వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు. తను కూడా మందు బీఆర్ఎస్ టికెట్ తీసుకుని అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణమ్మ పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మరోసారి పోటీచేస్తున్నారు. విజయం సాధిస్తాననే నమ్మకంతో ఉన్నారు. ఇక బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ రంగంలో ఉన్నారు. గెలుపు బావుటా ఎగరేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి కొంపెల్లి మాధవీలతను బరిలోకి దించారు. ఆయా పార్టీల నుంచి పోటీచేస్తున్న ఆరుగురు అభ్యర్థులు ప్రచారంలో పోటీపడుతున్నారు. మహిళలను ఆకర్షించేలా ప్రచారం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఇద్దరే

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ ఇద్దరు బీఆర్ఎస్‌కు చెందిన వారే కావడం గమనార్హం. 2014లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఒకరు కాగా, మహబూబాబాద్ నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి రెడ్యానాయక్ కూతురు మాలోతు కవిత మరోకరు. వచ్చే 13వ తేదీ సోమవారం జరిగే ఎన్నికల్లో ఎంత మంది మహిళా అభ్యర్థులు పార్లమెంటుకు వెళతారో జూన్ మూడున తేలనుంది. అంతవరకు వేచిచూడాల్సిందే.

విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ-కల్లూరు

విద్యుద్ఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పొట్రూ శ్రీను (50) తనకున్న పొలంలో పశువుల మేత కోసమని జాడు విత్తనాలు చల్లాడు. దానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్‌కు ఉన్న సర్వీస్ వైరును పట్టుకొని పైకి లేపి కట్టే సమయంలో వైరు తెగి ఉండటంతో చేతికి షాక్ కొట్టింది. దాంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



లేదంటూనే మూడు రాష్ట్రాల్లో కోచ్ ఫ్యాక్టరీలు

కాజీపేటకు మోడీ మొండిచేయి

- చిరకాల కాంక్షను చిదిమేసిన బీజేపీ..

వ్యాగన్‌తో చేతులు దులుపుకున్న కేంద్ర సర్కార్

- వరంగల్‌సభలో పెదవి విప్పని ప్రధాని మోడీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని 2016లో ఆనాటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి మనోజ్‌సింగ్.. ప్రకటన చేసిన అనంతరం మహారాష్ట్ర, గుజరాత్, అసోం రాష్ట్రాల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్రంలో మాత్రం విభజన చట్టంలోని హామీలను ఉల్లంఘించి మరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చి మోడీ చేతులు దులుపుకున్నారు. 44 ఏండ్ల కాజీపేట చిరకాల స్వప్నాన్ని చిదిమేసింది బీజేపీ. ప్రధాని మోడీ గుజరాత్‌లో రూ.20 వేల కోట్లతో ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకొని, కాజీపేటలో మాత్రం రూ.521 కోట్లతో వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్‌పై వర్ణ వివక్ష ఆరోపణలు చేసిన మోడీ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై పెదవి విప్పలేదు. అయితే నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి మాత్రం రాష్ట్రపతి ముర్మును ఆహ్వానించలేదు. కాగా, కష్టకాలంలో బీజేపీకి వరంగల్ ప్రజలు వెన్నంటి ఉన్నారని చెప్పిన ప్రధాని.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రస్తావించకపోవడం ఉమ్మడి వరంగల్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. 44 ఏండ్లుగా ఎన్నో ఉద్యమాలు, రాజకీయాలకతీతంగా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి పోరాటాలు జరిగాయి. రైల్వే కార్మిక సంఘాలు సైతం జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఆందోళనలను నిర్వహించాయి. అలాంటి సుదీర్ఘ పోరాటాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, మోడీ సర్కార్ నిర్వీర్యం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కీలక హామీల్లో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీతోపాటు బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, ఐటీఐఆర్ ఏర్పాటు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట రైల్వే జంక్షన్ ఉత్తర, దక్షిణ భారత దేశాన్ని కలిపే రైల్వే వారధిగా ఉంది. ఈ ప్రాంతంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంతోకాలంగా యువకులు ఆశతో ఎదురుచూశారు. ఆ తర్వాత మోడీ అధికారంలోకి రాగా పార్లమెంటులో ఎన్నో సందర్భాల్లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయం ప్రస్తావించినా, దేశంలో కోచ్ ఫ్యాక్టరీల ఏర్పాటు అవసరం లేదని 2016లో నాటి రైల్వే సహాయ మంత్రి మనోజ్ ప్రకటన చేశారు. ఆ ప్రకటన అనంతరం మహారాష్ట్రలోని లాతూరు, గుజరాత్‌లోని దహోడ, అస్సాంలోని కొకర్‌జహార్‌లలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను మంజూరు చేశారు. దీనిపై తెలంగాణ ప్రజలు ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

కాజీపేటకు మోడీ మొండిచేయి..

పార్లమెంటులోనే ఎన్డీఏ ప్రభుత్వం కోచ్ ఫ్యాక్టరీలు అవసరం లేదని ప్రకటన చేసి కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్‌ను అటకెక్కించి మహారాష్ట్ర, గుజరాత్, అసోంలో ఏర్పాటు చేయడాన్ని ఏమనాలో బీజేపీ నేతలు చెప్పాల్సి ఉంది. ఇదిలావుంటే కాజీపేటలో అవసరం లేని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మూడు రాష్ట్రాల్లో ఎలా ఏర్పాటు చేశారో మరీ ఎన్డీఏ పాలకులు తెలంగాణ ప్రజలకు వివరించాల్సిన అవసరముంది. దీనిపై తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రాంతం పట్ల, ముఖ్యంగా కాజీపేట రైల్వే అభివృద్ధి పట్ల మోడీ ప్రభుత్వం వివక్ష చూపిందన్న భావనలో స్థానికులున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని మోడీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై పెదవి విప్పలేదు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా, ప్రధాని స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాని మోడీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా తన సొంత రాష్ట్రంలో 2022 ఏప్రిల్‌లో రూ.20 వేల కోట్లతో ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం వివక్ష కాకపోతే మరేమనాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రశ్నించారు. ఎన్డీఏ పాలకులకు తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు.

నగరంలో డ్రగ్స్ సరఫరా

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.3లక్షల డ్రగ్స్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు నిందితులను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 లక్షల 11.34 గ్రాముల కొకైన్, 3.66 జీఎంఎస్ డ్రగ్స్‌తోపాటు ద్విచక్రవాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డీసీపీ రష్మి పెరుమాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అబ్దుల్ సాయి శరత్, అబ్దుల్ శ్రావణ్ బేగంపేట్‌లో నివాసముంటున్నారు. 2019లో హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరూ బంజారాహిల్స్‌లో రెస్టారెంట్‌లు ప్రారంభించారు. వీరికి యూసుఫ్‌గూడలో నివాసముంటున్న శ్రీవాస్తవ్ రిషబ్ పరిచయమయ్యాడు ముగ్గురూ మద్యానికి బానిసలుగా మారారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో డ్రగ్స్ సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ముంబయికి చెందిన డ్రగ్స్ సరఫరాదారునితో చేతులు కలిపారు. ముంబయి నుంచి కొరియర్ ద్వారా డ్రగ్స్‌ను తెప్పించు కుంటున్న నిందితులు..నగరంలో కావాల్సిన వారికి, తెలిసిన వారికి సరఫరా చేస్తున్నారు. పోలీసులు గుర్తించకుండా ఎన్వలప్ కవర్‌లో డ్రగ్స్‌ను చేరవేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ వద్ద ప్రత్యేక నిఘా వేసి ముగ్గురిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులను లేక్ పోలీస్‌లకు అప్పగించినట్టు డీసీపీ తెలిపారు.



మోడీ పనైపోయింది..

- దేశానికి ప్రధాని కాలేరు
- ఈసారి ఇండియా తుపానే : రాహుల్

కనౌజ్ (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లో ఇండియా బ్లాక్ తుపాను వస్తోందని, ఈసారి నరేంద్ర మోడీ ప్రధాని పదవిని చేపట్టలేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం వ్యాఖ్యానించారు. "ఈసారి మోడీ ప్రధాని కాలేరని కావాలంటే రాసిస్తా, ఇక అదంతా ముగిసిన అధ్యాయమే." అని కనౌజిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పేర్కొన్నారు. ఈ స్థానం నుండి సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పోటీ చేస్తున్నారు. రాహుల్, అఖిలేశ్‌లతో పాటూ ఆప్ నేత సంజయ్ సింగ్ కూడా ఈ ర్యాలీలో ప్రసంగించారు. ఈసారి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేస్తోంది. విద్వేషాలతో నిండిన బజారులో భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్రలతో పాటుగా ప్రేమ దుకాణాలను ప్రారంభించామని రాహుల్ వ్యాఖ్యానించారు. వ్యాపారవేత్తలు అదానీ, అంబానీలతో కాంగ్రెస్‌కు సంబంధ బంధవ్యాలున్నాయని ఇటీవల మోడీ చేసిన ఆరోపణలను రాహుల్ తిప్పికొట్టారు. గత పదేండ్లలో మోడీ ఒక్కసారి కూడా వారి పేర్లను ప్రస్తావించలేదని, కానీ ఈసారి తనను కాపాడతారనుకుంటూ వారి పేర్లను చెబుతున్నారని అన్నారు. 'ఇండియా బ్లాక్ నన్ను చుట్టుముట్టింది, నేను ఓడిపోతున్నాను, దయచేసి నన్ను రక్షించండి, అదానీ, అంబానీ దయచేసి నన్ను కాపాడండి" అంటూ రాహుల్ ఎద్దేవా చేశారు. వారిద్దరూ మోడీకి అనుంగు మిత్రులని వ్యాఖ్యానించారు. రాహుల్ తమను విమర్శించకుండా ఆపేందుకు నల్ల ధనంతో నిండిన టెంపోలను కాంగ్రెస్ పార్టీ అందుకుందంటూ మోడీ బుధవారం విమర్శించారు. అదానీ ఎ టెంపోలో, ఏ తరహాలో డబ్బు పంపించారో మోడీకే తెలుసునంటూ రాహుల్ ఆ విమర్శలను తిప్పి కొట్టారు. గత సమాజ్‌వాదీ ప్రభుత్వ హయాంలో కనౌజిలో అభివృద్ధి బాగా జరిగిందని అఖిలేశ్ చెప్పారు. హైవేపై ప్రయాణించే ప్రజలకు తెలుసు, అది నిర్మించింది సమాజ్‌వాదీనే అని అన్నారు. రిజర్వేషన్లను ఆపేసేందుకు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని ఆప్ నేత విమర్శించారు.

భారత్‌లో ఎన్నికలైతే.. పాకిస్తాన్‌పై చర్చలెందుకు..?

పదేండ్లలో ఏం చేశారో చెప్పండి..మోడీకి ప్రియాంక గాంధీ సూటి ప్రశ్న

అమేథీ : భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో పాకిస్తాన్ గురించి ఎందుకు చర్చిస్తున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో దేశానికి ఏం చేశారో చెప్పాలని ఆమె ప్రధాని మోడీని సూటిగా ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం రేటు 45 ఏండ్ల గరిష్టానికి చేరిందని అన్నారు. బీజేపీ వాస్తవ సమస్యలతో పాలక సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. అమేథీలో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి కిశోర్‌లాల్ శర్మ ప్రచారం సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ ప్రకటనపై స్పందించారు. ఆ ప్రకటన పాతదని, ఇప్పుడు దాని గురించి ఎందుకు చర్చిస్తున్నారని



ప్రశ్నించారు. భారత్‌లోనా లేదా పాకిస్తాన్ లోనా ఎన్నికలు ఎక్కడ జరుగుతున్నాయని ప్రశ్నిస్తూ.. భారత్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు పాకిస్తాన్ గురించి ఎందుకు మాట్లాడాలని అన్నారు.

ఎన్నికల్లో గెలిచేందుకు హిందూ -ముస్లిం అంశంపై బీజేపీ వ్యాఖ్యలు చేస్తోందని..కానీ ప్రజలు కులం, మతం ప్రాతిపదికన ఎన్నికలు జరగాలని కోరుకోవడం లేదని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని అన్నారు. ధరలు పెరిగిపోవడంతో మార్కెట్లకు వెళ్లిన ప్రజలు అవసరమైన వాటిలో సగం కూడా కొనుగోలు చేయలేక వెనుతిరుగుతున్నారని అన్నారు. రైతులు సరైన జీవనోపాధి లేక బాధపడుతున్నారని తెలిపారు. డీజిల్‌తో పాటు వ్యవసాయానికి వినియోగించే వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని. వాటి గురించి ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. కులం, మతం పేరుతో బీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని, కానీ కాంగ్రెస్ ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు వంటి వాస్తవ అంశాలతో పోటీ చేస్తున్నామని అన్నారు

కేజ్రీవాల్‌కు బెయిల్‌తో ఎన్నికలపై ప్రభావం



- సుప్రీంతీర్పు బీజేపీకి గట్టిదెబ్బే : కేరళ సీఎం పినరయి విజయన్

తిరువనంతపురం : సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తుతం దేశంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు శుక్రవారం సుప్రీంకోర్టు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో సుప్రీంకోర్టు తీర్పు బీజేపీని గట్టి దెబ్బతీసిందని అయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేసేందుకు అన్ని విధాలా యత్నిస్తున్న పై ఈ తీర్పు తీవ్ర ప్రభావం చూపనుందని తెలిపారు. ప్రజల విశ్వాసంతో ఎన్నికల్లో పోటీ చేయడానికి బదులుగా బీజేపీ ప్రతిపక్షాల నోరు మూయించేందుకు మతపరమైన అంశాలతో పాటు అప్రజాస్వామ్య పద్ధతులను వినియోగిస్తోందని మండిపడ్డారు. అటువంటి అప్రజాస్వామ్య పద్ధతులన్నింటినీ సుప్రీంకోర్టు తీర్పు దెబ్బతీసిందని అన్నారు.



ఇండియా గెలుపే దేశానికి రక్ష

కార్పొరేట్లకే మోడీ 'వికసిత్ భారత్'

- రాజ్యాంగం, లౌకికవాదంపై తీవ్ర దాడి
- మోడీ పాలనలో సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- గుంటూరు ఎన్నికల ప్రచార సభలో సీతారాం ఏచూరి, డి రాజా

గుంటూరు : ఇండియా వేదిక గెలుపే దేశానికి రక్ష అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కార్పొరేట్ల కోసమే 'వికసిత్ భారత్' నినాదాన్ని మోడీ ఎత్తుకున్నారని విమర్శించారు. నేడు దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. రాజ్యాంగం, లౌకికవాదంపై తీవ్రమైన దాడి జరుగుతోందని, మోడీ పాలనతో సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని తెలిపారు. బీజేపీని, దాని మిత్రులను ఓడించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు సీపీఐ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు, కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గుంటూరులోని కొత్తపేటలో సీపీఐ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో వారు ప్రసంగించారు. సభకు గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు బీఆర్ స్టేడియం నుంచి సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్, వామపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో ఏచూరి మాట్లాడుతూ క్లిష్టపరిస్థితుల నుంచి దేశాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ విజ్ఞతతో, దేశభక్తితో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బీజేపీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ జతకట్టి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. పార్లమెంటులో బీజేపీ ప్రతిపాదించిన అన్ని ప్రజా, రైతు వ్యతిరేక బిల్లులకూ టీడీపీ, వైసీపీ మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు రాజ్యాంగాన్ని తీసుకురావడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలో వంద కోట్ల మంది వద్ద ఎంత సంపద ఉందో అంత సంపద 22 మంది మోడీ మిత్రుల వద్ద ఉందని వివరించారు. విభజన చట్టం అమలు చేయకుండా రాష్ట్రానికి మోడీ తీరని అన్యాయం చేసినా బీజేపీతో టీడీపీ, వైసీపీ, జనసేన అంటకాగుతున్నాయని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి మూడు విడతల్లో బీజేపీ ఓడిపోతుందని సంకేతాలు రావడంతో మోడీ తన బాణీని మార్చారని, మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. గత 70 ఏండ్లలో ఎప్పుడూ లేనంతా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని తెలిపారు. దాదాపు 42 శాతం మంది పట్టభద్రులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఖాళీగా ఉన్నారన్నారు.

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ బీజేపీని, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. నరేంద్ర మోడీని ప్రశ్నించలేని స్థితిలో టీడీపీ, జనసేన, వైసీపీ ఉండడం వల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తోందని వివరించారు. బీజేపీ హటావో... దేశ్‌కో బచావో నినాదాన్ని దేశ వ్యాప్తంగా ప్రజలు ఈ ఎన్నికల్లో అందుకున్నారన్నారు. ఓటమి భయంతో జాతులు, మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టేలా మోడీ ఉపన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్ గత ఐదేండ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని, ప్రజల ఖాతాలో రూ.2.70 లక్షల కోట్లు జమ చేసినట్లు చెప్తున్నారని, మిగతా రూ.7.30 లక్షల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు.

మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేసి రైతులకు లబ్ది చేకూరుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఇండియా వేదికకు మద్ధతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సిఫారసులు అమలైతే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందన్నారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ.గఫూర్, వై.వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, గుంటూరు తూర్పు అభ్యర్థి షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ అభ్యర్థులు జాన్‌బాబు (గుంటూరు పశ్చిమ), కొరివి వినయ్‌కుమార్ (ప్రత్తిపాడు) తదితరులు పాల్గొన్నారు.

పరుగులు పెట్టి మరీ నామినేషన్

లక్నో : ఎన్నికల వేళ చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటాయి. నామినేషన్ దాఖలుకు గడువు ముగుస్తుండడంతో ఓ బిజెపి అభ్యర్థి పరుగు పరుగున వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. డేరియా నియోజకవర్గానికి ఏడో దశ (జూన్ 1)లో పోలింగ్ జరగనుంది. ఇక్కడి నుంచి బిజెపి అభ్యర్థిగా శశాంక్ మణి త్రిపాఠి గురువారం నామినేషన్ వేశారు. ఆయన తన నియోజకవర్గ ప్రజలతో కలిసి కోలాహలంగా నామినేషన్ వేస్తే వార్తల్లో నిలిచేవారు కాదేమో! ఆయన ప్రచారంలో బిజీగా ఉండి.. గడువు లోపే నామినేషన్ వేద్దామని.. సమయం పావుగంట ఉండటంతో రోడ్డుపై పరుగెత్తుకుంటూ వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రోడ్డుపై పరుగెత్తుకుంటూ వెళ్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై త్రిపాఠి మాట్లాడుతూ.. 'నేను కాలేజీ రోజుల్లో మంచి రన్నర్‌గా పేరు తెచ్చుకున్నాను. అది ఇప్పుడు ఇలా కలిసి రావడం విశేషం.' అన్నారు.

ఎంపీగా గెలిస్తే...!

పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుంది. నెలకు లక్ష రూపాయల జీతం వస్తుంది. రవాణా ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుంది. ఏడాదిలో 34 సార్లు ఎంపీతో పాటు ఆయన భార్యకు ఉచిత విమాన ప్రయాణం. ఫస్ట్‌క్లాస్ ఏసీ కోచ్‌లో రైలు ప్రయాణం ఉచితం. రోడ్డు రవాణా అయితే కి.మీ.కి రూ.16 చొప్పున బిల్లు చెల్లిస్తారు. నియోజకవర్గ కార్యాలయ నిర్వహణ ఖర్చు నెలకు రూ.45 వేలు, పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటే రోజుకు రూ.2 వేలు అదనంగా చెల్లిస్తారు. ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర అవసరాల నిమిత్తం ప్రతి మూడు నెలలకు రూ.75 వేలు అందిస్తారు. అత్యాధునిక వైద్య సదుపాయాలను ఉచితంగా కల్పిస్తారు. పాథాలాజికల్ లాబొరేటరీ సౌకర్యం, ఈసీజీ, దంత, కంటి, చర్మ ఆరోగ్య సేవలు ఉచితంగా లభిస్తాయి. ఎంపిగా ఉన్నంత కాలం డిల్లీలో నివాస వసతిని కల్పిస్తారు. తొలిసారి గెలిచిన వారికి రాష్ట్ర ప్రభుత్వ వసతి గృహాలను కేటాయిస్తారు. 50 వేల యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు వాడుకోవచ్చు. మూడు టెలిఫోన్లను కేటాయిస్తారు. వాటిని ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ఏడాదిలో 50 వేల ఉచిత కాల్స్. స్మార్ట్ ఫోన్ ద్వారా 3జీ ప్యాకేజీలో అదనంగా 1.50 లక్షల కాల్స్ మాట్లాడుకునే వీలుంటుంది. రిటైరైతే నెలకు రూ.50 వేల పింఛన్ వస్తుంది.

మీ ఓటు వేరేవాళ్లు వేసేశారా?..

పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటేయొచ్చు

న్యూఢిల్లీ: మీరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేసరికే మీ ఓటు అప్పటికే వేరేవాళ్లు వేసేశారా? అయితే మీరు మీ ఓటు వేయలేకపోయామని చింతించాల్సిన అవసరం లేదు. మీరు మళ్లీ మీ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఈవీఎం ద్వారా కాకుండా.. పేపర్ బ్యాలెట్ ద్వారా మీరు మీ అభ్యర్థికి ఓటు వేయొచ్చు. మీ ఓటును వేరేవాళ్లు వేశారు అని మీకు తెలిసిన వెంటనే.. ప్రత్యేక ఓటింగ్ కంపార్ట్ మెంట్‌లోకి వెళ్లి.. ఓటరు బ్యాలెట్ పత్రాన్ని తీసుకెళ్లి, ఓటేయ దలచిన అభ్యర్థి ఎన్నికల గుర్తుపై స్వస్తిక్ ముద్రను వేయాలి. మీరు ఓటు ఎవరికి వేశారో బయటకు తెలియకుండా ఆ బ్యాలెట్ పత్రాన్ని మడిచి కంపార్ట్‌మెంట్ బయటకి వచ్చి ప్రిసైడింగ్ అధికారికి అదజేయాలి. ఆ బ్యాలెట్ పత్రాన్ని టెండర్ ఓటుగా ప్రిసైడింగ్ అధికారి మార్క్ చేసి ప్రత్యేక ఎన్వలప్‌లో వేరుగా ఉంచుతారు. టెండర్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు ఫారం- 17 బీలో రికార్డు చేస్తారు. దొంగ ఓటరు అని అభ్యర్థి తరపు ఏజెంట్లకు అనుమానమొస్తే.. రెండు రూపాయలు చెల్లించి సవాల్ చేయవచ్చు. అప్పుడు ఆ ఓటరు గుర్తింపు నిర్ధారించడానికి ప్రిసైడింగ్ అధికారి విచారణ జరుపుతారు. ఓటరు గుర్తింపు నిర్ధారణ జరిగితే ఓటేసెందుకు వారికి అవకాశం కల్పిస్తారు. లేకపోతే సదరు వ్యక్తిని ప్రిసైడింగ్ అధికారి పోలీసులకు అప్పగించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తారు.

సందేశ్‌ఖాలీపై మౌనం.. హిందూత్వే ప్రధానం

- దేవాలయాల సందర్శనకే ప్రాధాన్యం
- బీజేపీ బసిర్హాత్ ఎంపీ అభ్యర్థి రేఖా పాత్ర తీరు

అందుబాటులోకి వీఐపీ కాన్వాయ్ కూడా

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ ఘటనతో వార్తల్లోకెక్కి, బీజేపీ తరపున బరిలోకి దిగేవరకు వచ్చారు రేఖా పాత్ర. సందేశ్‌ఖాలీ నివాసి అయిన ఆమె ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాషాయపార్టీ తరపున బసిర్హాట్ నుంచి పోటీ చేస్తున్నారు. ముఖ్యంగా, సందేశ్‌ఖాలీ మహిళలపై టీఎంసీ నాయకుల లైంగికవేధింపులు, దాడులకు వ్యతిరేకంగా పోరాడిన రేఖా పాత్ర.. ఇప్పుడు మాత్రం పక్కా రాజకీయ నాయకురాలిగా మారిపోయిందనీ, ఆమె వ్యవహార తీరే దీనిని తెలియజేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఎన్నికల్లో గెలవటమే లక్ష్యంగా ఆమె పని చేస్తున్నదనీ, సందేశ్‌ఖాలీ గురించి మాట్లాడటమే మరిచిన ఆమె దేవాలయాల సందర్శలకే ప్రాధాన్యతనిస్తున్నదని అంటున్నారు. బీజేపీ అభ్యర్థిగా ఉన్న ఆమె.. ఆ పార్టీ ఎన్నికల్లో తెరపైకి తీసుకొచ్చే 'హిందూత్వనే పాటిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. కాగా, ఎన్నికల ప్రచారంలో ఆమెతో పాటు సందేశ్‌ఖాలీకి చెందిన మహిళా పార్టీ కార్యకర్తలు ఎవరూ కనిపించటం లేదనీ, ఇప్పుడిదే కాషాయపార్టీకి మింగుడుపడని విషయమని చెప్తున్నారు.

ఆమె తన ప్రచారంలో టీఎంసీ నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, స్థానిక దేవాలయాలను సందర్శించటం వంటివి మాత్రమే చేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బసిర్‌హత్ లోక్‌సభ సెగ్మెంట్‌లో సందేశ్‌ఖాలీతో సహా ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టీఎంసీ 2009 నుంచి ఇక్కడ వరుసగా గెలుపొందింది. ఈసారి టీఎంసీ ప్రస్తుత ఎంపీ నుస్రత్ జహాన్‌ను తొలగించి.. 2009 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన హాజీ నూరుల్ ఇస్లాంను పాత్రను బరిలో దింపింది. బసిర్హాత్‌లో 54 శాతం ముస్లిం జనాభా ఉన్నది.

దాడులు జరగొచ్చన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో



ఆమె ఎన్నికల ప్రచారం కోసం సందేశ్‌ఖాలీలోని తన ఇంటికి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న బసిర్హాట్‌లోని అద్దె నివాసానికి మారింది. ఆమె కాన్వాయ్ కూడా వచ్చి చేరింది. ఈ కాన్వాయ్‌లో మూడు స్కార్పియోలు, రెండు సుమోలున్నాయనీ, ఇదంతా ఒక వీఐపీని తలపించేలా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆమె ప్రచారం ప్రధానంగా హిందూ మెజారిటీ ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని సాగుతున్నదనీ, మూడు ప్రదేశాలలో కనీసం ఐదు దేవాలయాలు, మతపరమైన కేంద్రాలను సందర్శించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆమె ప్రచారాల్లో, పర్యటనల్లో 'జై శ్రారామ్', 'భారత్ మాతా కీ జై' వంటి నినాదాలు మాత్రమే వినిపిస్తున్నాయనీ, సందేశ్‌ఖాలీ అంశం మాత్రం మూలన పడిపోయిందని అంటున్నారు.



ఓటింగ్ శాతాన్ని వెంటనే బహిర్గతం చేయాలి

ఈసీని కోరిన సివిల్ సొసైటీ సభ్యులు, మాజీ బ్యూరోక్రాట్‌లు

న్యూఢిల్లీ : ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలలో మొదటి రెండు దశల్లో జరిగిన ఓటింగ్ శాతం గణాంకాల్లో హెచ్చుతగ్గులపై పౌర సమాజ సభ్యులు, మాజీ బ్యూరోక్రాట్ల బృందం తమ ఆందోళనలను లేవనెత్తింది. భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ)ను తన వెబ్‌సైట్ ద్వారా ఓటింగ్ శాతాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లను ఉద్దేశించి లేఖను రాసింది. మొదటి దశ ఎన్నికలకు సంబంధించి.. ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో పోలింగ్ రోజు (ఏప్రిల్ 19) రాత్రి 7 గంటల నాటికి, అంచనా వేసిన ఓటింగ్ శాతం 60 శాతానికి పైగా ఉన్నదని పేర్కొన్నది. ఏప్రిల్ 30న ఈసీఐ 11 రోజుల తర్వాత ప్రచురించిన ఓటరు ఓటింగ్ డేటా 66.14 శాతం(అంటే 6 శాతం పెరిగింది)గా ఉండటం గమనార్హం. అదేవిధంగా, రెండో దశ పోలింగ్ రోజున (ఏప్రిల్ 26) ప్రెస్ నోట్‌లో రాత్రి 7 గంటల నాటికి సుమారుగా 60.96 శాతం ఓటింగ్ నమోదైందని వెల్లడించగా.. ఇది ఏప్రిల్ 30 నాటి ప్రెస్ నోట్‌లో 66.71 శాతానికి సవరించబడింది. మే 7న జరిగిన మూడో దశ ఎన్నికలకు సంబంధించి మే 8న పోలింగ్ ముగిసిన ఒకరోజు తర్వాత తుది ఓటింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఓటింగ్ శాతం వెల్లడిలో జాప్యం, ఏప్రిల్ 30 నాటి ఈసీఐ ప్రెస్‌నోట్‌లో ఎటువంటి వివరణ లేకుండా ఓటింగ్ శాతాన్ని పెంచి చూపించటం ప్రజల్లో ఆందోళనలు, సందేహాలను పెంచిందని పౌర సమాజ సభ్యులు, మాజీ బ్యూరోక్రాట్లు తమ లేఖలో పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్, న్యాయవాది, హక్కుల కార్యకర్త ప్రశాంత్ భూషణ్, స్వరాజ్ అభియాన్‌కు చెందిన యోగేంద్ర యాదవ్, మాజీ బ్యూరోక్రాట్‌లు ఎం.జి దేవసహాయం, సుందర్ బుర్రా, దేబ్ ముఖర్జీ లేఖలపై సంతకం చేసిన వారిలో ఉన్నారు.

హిల్ స్టేషన్‌లో ఉత్కంఠ

- రాష్ట్ర ప్రభుత్వంపై ఆపరేషన్ ఆకర్ష్ కమలం కుట్రలు
- సంక్షోభం నుంచి బయటపడ్డ కాంగ్రెస్
- హస్తానికి ఆప్, వామపక్షాల మద్దతు
- బీజేపీపై ప్రజా వ్యతిరేకత
- మోడీ సర్కారుపై ఆపిల్ రైతుల ఆగ్రహం
- మండి స్థానంపై సర్వత్రా ఆసక్తి



జె.జగదీష్

వేసవి రాజధాని హిమాచల్‌ప్రదేశ్‌లో రాజకీయం ఆసక్తికరంగా మారింది. కొండలతో విస్తరించి పర్యాటక కేంద్రంగా ఉన్న ఈ రాష్ట్రంలో నాలుగు లోక్‌సభ స్థానాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏడో దశ (జూన్ 1)లో ఇక్కడ పోలింగ్ జరగనుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బీజేఎ ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటుండగా, కాంగ్రెస్‌ను సంక్షోభం వెంటాడుతోంది. గత ఎన్నికల్లో నాలుగు స్థానాలకు నాలుగింటినీ బీజేపీ సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ ఒంటరిగా పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్‌కు ఆప్, వామపక్షాలు మద్దతిస్తున్నాయి. అయితే 2022 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో 68 స్థానాలకుగాను కాంగ్రెస్ 40, బీజేపీ25, ఇతరులు 3 స్థానాల్లో గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాగా ఫిబ్రవరిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయగా, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిచ్చారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ బలం చెరి సమానం (34 ఓట్లు) అయింది. లాటరీ తీయగా.. అందులో బీజేపీకి చెందిన హర్ష్ మహాజన్ పేరు రావడంతో కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఓడిపోయారు.

ప్రధాన అంశాలు

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆపిల్ రైతుల సమస్య ప్రధానమైనది. ఆపిల్‌కు మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. అగ్నిపథ్ పథకంపైన కూడా యువకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య చర్చనీయాంశంగా ఉంది.

బీజేపీ అవిశ్వాసం కుట్రకు చెక్

దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కారుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీజేపీ పార్టీ రెడీ అయింది. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి, రాష్ట్రంలో నెలకొన్న ప్రతిష్టంభనకు కాంగ్రెస్ తెరదించింది. ఖాళీ అయిన ఆ ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మరోవైపు తమపై అనర్హతను సవాల్ చేస్తూ ఆ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తిరిగి ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకుని, బీజేపీలో చేరారు. ఇప్పుడు ఉప ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యేలు బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు.

సంపాదకీయం

కుర్చీ కదులుతోందా..?

నియంతల బలమెప్పుడూ ప్రజల భయంలోనే ఉంటుంది. ఆ భయం వీడి ప్రజలు కన్నెర్ర చేస్తే ఆ కాగితపు పులి కాలిపోతుంది. ఇది చారిత్రక సత్యం. ఇప్పుడు ఆ సత్యం మరోసారి రుజువుకాబోతోందా? ముగిసిన మూడు విడతల పోలింగ్ సరళి అవుననే సంకేతమిస్తోంది. నిన్నటిదాకా ఈ సార్వత్రికంలో సైతం తమకు ఎదురేలేదని చెప్పుకున్న ఏలినవారి స్వరం మారుతోంది. ప్రధాని సహా ఇతర ప్రధాన నేతల ప్రసంగాలన్నీ తమకు ఎదురుగాలి వీస్తున్నదని తెలిసిపోయినట్టుగా సాగుతున్నాయి. వారి అసహనంలో కుర్చీ కదులుతోందన్న భయాందోళనలు కనిపిస్తున్నాయి. బహుశా ఆ భయంతోనే కాబోలు... రాజ్యాంగాన్ని మార్చబోమని, రిజర్వేషన్ల జోలికే రామని స్వయంగా ప్రధానితో సహా పరివారమంతా ప్రకటిస్తోంది. ఇది నమ్మేవారికి కొంత ఊరట కలుగవచ్చేమో గానీ, సంఘ్‌పరివార్ వాగ్దానమేదైనా అది "అశ్వత్థామ హత: కుంజర:" వంటిదే! ఎందుకంటే... వీరి హిందూత్వ భావజాలానికి పురుడు పోసిన పూర్వీకులంతా నాజీలను ఆరాధించినవారే. ఆ నాజీల నమూనాలోనే ఈ దేశాన్ని హిందూరాజ్యంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నవారే. ఇది రహస్యమేమీ కాదు.

వాళ్లు మళ్లీ గెలిస్తే దేశానికి జరిగే ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయలేం. కానీ ఆ ప్రమాదం ఎంత నష్టం చేస్తుందో, సమాజాన్ని అంత చలనంలోకి తెస్తుంది. చీకటిలో చూపు నిశితమవుతుంది. అణచివేతకు సమాధానంగా ప్రతిఘటన పదునెక్కుతుంది. అయితే ఈ సార్వత్రిక ఎన్నికలు ఆ ప్రమాద నివారణకు ఓ సదవకాశం.

కాకపోతే వారు అధికారం కోసం ఎన్ని కట్టుకథలైనా అల్లగలరు. తమ గుజరాతీ దోస్తులైన అంబానీ, అదానీలకు స్వయంగా ఊడిగం చేస్తూ, దేశ సంపదను దోచిపెడుతూ కూడా ఆ నిందను ప్రత్యర్థులపై మోపగలరు. నిత్యజీవిత వెతలు అజెండా మీదికి రాకుండా అసత్యాలకు విద్వేషాలను, ఉద్వేగాలను జోడించి ప్రజలను భావోద్వేగాలలో ముంచెత్తగలరు. కానీ ఇప్పుడా పప్పులేవీ ఉడికేటట్టు లేవు. రాముడి చెట్టుకు ఓటు పిందెలు కాసేలా లేవని తేలిపోయాక.... పూర్తిగా అసత్యాలు, అర్ధసత్యాలు, విభజన విద్వేష రాజకీయాల మీదే కేంద్రీకరించారు. సాక్షాత్తూ ప్రధానమంత్రే ప్రారంభించిన ఈ విష ప్రసంగాల పరంపర అంతకంతకూ తీవ్రమవుతోంది. దేశంలో



పెచ్చరిల్లుతున్న ఈ ధోరణికి రాజకీయార్థిక పునాదులు ఉన్నట్టుగానే, దానికి సమ్మతిని కూడగట్టే ఒక సాంస్కృతిక పరమైన భావజాల నిర్మాణం కూడా చాలాకాలంగా కొనసాగుతున్నది. అది "విశ్వగురువు" అనే పేరుతో విశ్వజనీనం కావాలని చూస్తున్నది. సమాజంలో ఒక చెదలు మాదిరిగా వ్యాపిస్తున్నది. మనుషుల్లో ఓ విచ్ఛిన్నకర మానసిక స్థితిని పాదుకొల్పుతున్నది.

ఈ ఎన్నికల కాలంలో ఆ సాంస్కృతికవాదం మరింత ముదిరి పాకాన పడింది. అది కమలనాథుల మాటల్లో మరింత స్పష్టమవుతున్నది. ఎప్పటిలాగే మోడీ తన "బూచీ" సిద్ధాంతం వల్లించడం మొదలు పెట్టారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలని కాంగ్రెస్ సూత్రప్రాయంగా తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని వక్రీకరిస్తూ... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులు కొల్లగొట్టి ముస్లింలకు ఇస్తుందని మెజారిటీ వర్గంలో ఒక అభద్రతను, భయాన్ని తయారుచేస్తున్నారు. చొరబాటుదారులు, అధిక సంతానం కలవారు అంటూ ఒక వర్గం ప్రజలను లక్ష్యంగా చేసుకుని విభజన రాజకీయాలకు పాల్పడుతున్నారు. అంతే తప్ప ఈ పదేళ్లలో వారు చేసిందేమిటో, తిరిగి అధికారమిస్తే చేయబోయేదేమిటో చెప్పి ఓట్లు అడగలేకపోతున్నారు. తాము ఆర్భాటంగా ప్రకటించిన 'మోడీకీ గ్యారంటీ సంకల్ప పత్రం' గురించిన ప్రస్తావన దాదాపు మానేశారు. ఇదిలా సాగుతుండగానే మూడవ విడత పోలింగ్‌తో దాదాపు సగం స్థానాలకు ఎన్నిక పూర్తయింది. పోలింగ్ శాతం చాలా తక్కువగా నమోదైంది. ఇది సహజంగానే పాలకపక్షానికి ప్రతికూల సంకేతం. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అంచనా వేసిన అధికారపక్షం... ఎదురవబోయే ఓటమిని అధిగమించడానికి ఇంకెన్ని పన్నాగాలకు ఒడిగడుతుందో అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఈ నేపథ్యంలో గెలుపోటములపై పలు ఊహాగానాలు, ఈవీఎంలపై అనుమానాలతోపాటు ఆసక్తికరమైన అభిప్రాయాలనేకం వ్యక్తమవుతున్నాయి. ఇందులో అధికారం పోతుందేమో అని ఆందోళన చెందేవారు కొందరైతే... "వాళ్లు మళ్లీ గెలిస్తే..." అంటూ భయాలను వెల్లడించేవారు చాలామంది. వారి భయాలకు కారణా లున్నా... అలాంటి నిరాశ అవసరం లేనిది. ఈ భయాలన్నీ కొన్ని దశాబ్దాలుగా ప్రజలు చేస్తున్న పోరాటాలు అర్థం కాకపోవడం, వాటిలో భాగం కాకపోవడం మూలంగా కలిగేవి మాత్రమే. వాళ్లు మళ్లీ వస్తే భూమి బద్దలేమీ కాదు. ఒకవేళ అయితే గియితే "ఇదంతా మాకెందుకులే.. మాదాకా వస్తారా.. వచ్చినప్పుడు చూద్దాంలే" అనుకునే మధ్య తరగతి భద్రజీవుల భ్రమలు బద్దలవుతాయి. అలాగని వాళ్లు మళ్లీ గెలిస్తే దేశానికి జరిగే ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయలేం. కానీ ఆ ప్రమాదం ఎంత నష్టం చేస్తుందో, సమాజాన్ని అంత చలనంలోకి తెస్తుంది. చీకటిలో చూపు నిశితమవుతుంది. అణచివేతకు సమాధానంగా ప్రతిఘటన పదునెక్కుతుంది.

అయితే ఈ సార్వత్రిక ఎన్నికలు ఆ ప్రమాద నివారణకు ఓ సదవకాశం.

శ్రీ సూర్యనారాయణా మేలుకో

సురుకు

"ఎవరు మీరు అంతలా మండిపోతున్నారు"
"నేను సూర్యుణ్ణి"
"ఎవరూ, మండుతున్న సూరీడా"
"నేను మండుతున్నందుకే కద నన్ను సూర్యుడంటారు"
"ఏమో బాబూ నీవు మండడం కాదు మమ్మల్ని మాడుస్తున్నావు"
"నేనా.........?!"
"మరి నీవుగాక ఇంకెవరు?"
"నా గుణమే మండడం. అసలు భూమి మీద జీవం ఏర్పడడానికి నేనే కారణం. నానుండి విడిపోయిన చిన్న ముక్కే మీరు నివశిస్తున్న భూమి. అది దూరంగా పోయి మెల్ల మెల్లగా చల్లబడి నీరు ఏర్పడి తరువాత జీవం



ఏర్పడి తన వైవిధ్యాన్ని చూపిస్తోంది తెలుసా"
"మా భూమి గురించి మాకే చెబుతావా....!"
"మరి చెప్పక?"
"సరేలే అలాంటి భూమిని మళ్లీ మండించి, మాడ్చి నీలో కలిపేసుకుందామనేనా నీ ప్లాను"
"ఏమో మరి అది మీ చేతుల్లో ఉంది. అసలు మంచు యుగాలు కూడా ఈ భూమి చూసింది తెలుసా.
అలాంటిది ఇప్పుడు మండుతున్నామంటూ ఏడుస్తున్నారు"
"మరేం చేయాలి చెప్పు"
"ప్రపంచం నిండా చెట్లు, జంతువులు, కొండలు, అడవులు, సముద్రాలు,
నదులు ఉన్నంత కాలం చల్లగానే ఉంది. ఆ తరువాతే...."
"ఆ తరువాత అంటే?"
"చెబుతా చెబుతా, మీ లాంటి మానవులు పరిణామం చెంది ఈ భూమి మీద పుట్టాకనే కదా భూమికి తిప్పలు.
మనిషి ఎక్కడ అడుగు పెడితే అక్కడ సర్వనాశనమని చెబుతుంటారు కదా. కాని నా నమ్మకమంతా మనిషి పైనే.
మంచి పనులు చేసేది కూడా అతనే. అందుకేగా మానవుడే మహనీయుడు అని ఆరుద్ర రాసింది"
"నీకు మా కవులు కూడా తెలుసా?
"ఎందుకు తెలీదు? మండే కవులు మండించే కవులు అందరూ తెలుసు. ఫిరదౌసి తెలుసు, జాషువా తెలుసు, శ్రీశ్రీ తెలుసు, ఇంకా....."
"సరే కాని అలాంటి మానవులుగా మేమేం చేయాలి చెప్పు"
"ఇప్పుడే చెప్పాను కదా చెట్లు, జంతువులు, కొండలు, అడవులు, సముద్రాలు, నదులు ఉన్నంత కాలం చల్లగానే ఉంది అని, వాటిని మళ్లీ భూమిని పాత రూపానికి తీసుకురండి చాలు. అప్పుడు ఈ ఎండాకాలం కూడా మీకు ఆహ్లాదకరంగా ఉంటుంది. అసలు మీరు మానవావతారం ఎత్తక ముందు ఈ భూమి ఎలాగుందో, ఎంత కాలుష్యరహితంగా ఉందో మళ్లీ అలాగ చేయండి చాలు"
అంతేనా?
వంద శాతం అంతే
అలాగే సూర్యుడు గారూ

****

అలాగే సూర్యుడు గారూ...... అలాగే సూర్యుడు గారూ..... అలాగే సూర్యుడు గారూ
"ఏమే ఏదో కలగన్నట్టున్నావు, లే. లేచి పర్యావరణ పరిరక్షణ పై జన విజ్ఞాన వేదిక క్లాసులకు మాతో పాటు రావాలి"
"అది ఆలోచిస్తూ పడుకుంటేనే కల పడిందమ్మా" మొత్తం కల అమ్మకు చెప్పింది
"కలకాదు దాన్ని నిజం చేయాలి, లే లే....."

****

ఇక నిజమైన సూర్యుణ్ణి వదిలేసి ఇంకో సూర్యుడి గురించి తెలుసుకోవాలి మనం. అతనే ఓటేసే సూర్యుడు, ఓటరు. ఈ ఓటరు సూర్యుళ్లందరూ ఇప్పుడు తమ సత్తా చూపడానికి సిద్ధంగా ఉండాలి. ఓటరే సూరీడు. ఓటర్లే మనకు దారి చూపే సూర్యుళ్లు. మన చుట్టుపక్కల వాతావరణమంతా వేడిగా సెగ పంచుతున్న గాలులతో నిండి ఉంది. అలా చేసుకుంటూ పోతే సూర్య ప్రతాపం తెలుస్తుంది. దేశంలో, సమాజంలో కూడా మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని మతాలు, కులాలు, నీతి లేని రాజకీయాలు, బంధు ప్రీతి, మిత్రులంటే పడి చచ్చే ప్రేమతో కలుషితం చేస్తున్నారు. అలాంటి కలుషిత వాతావరణంలో కూడా మనకు వేడి తెలుస్తుంది. దాన్ని కంట్రోలు చేసేది ఈ ఓటరు దేవుళ్ళు.... వాళ్లే సూర్యుళ్ళు. ఎలాగైతే చెట్లు, కొండలు, నదులు, చెరువులు మాయమైనాయో మన మధ్య సోదర ప్రేమ, పరమత సహనం సాధ్యమైనత మేర చెడగొట్టారు. అందుకే ఈ మానసిక సెగలు. దాన్ని మరమ్మత్తు చేయవలసింది ఈ ఓటరు సూర్యుళ్లే. నిజంగా ఈ ఓటరు సూర్యుళ్ళకు అందరూ కలిసి ఉండడమే ఇష్టం. ఏమంటే కొందరు చేసే ప్రచారాన్ని నమ్మి అలా మారారంతే. వాళ్లకు వాస్తవాలు నిదానంగా అర్థమయ్యేలా చెబితే అయ్యో ఇన్నిరోజులు ఇంత అమాయకంగా ఉన్నామా అని కోపం తెచ్చుకొని సూర్యుడిలా ఎర్రటి కండ్లతో ప్రపంచాన్ని చూస్తారు.

శ్రీ సూర్య నారాయణా మేలుకో అంటూ ఉదయాన్నే ఎం.ఎస్.సుబ్బులక్ష్మి పాడిన పాట పెడుతుంటారు టీవీల్లో . ముందే ఎండా కాలం, ఆయన ఎక్కువసేపు నిద్రపోతే మేలు కదా ఎందుకు లేపడం అనిపిస్తుంది కొందరికి. అసలు ఆయనను లేపే పనే లేదు ఎందుకంటే మన భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుందని చిన్నప్పుడే చదూకున్నాం. అలా మనం తిరిగినప్పుడే సూర్యుడొస్తాడు. తరువాత మనచుట్టూ తిరిగే చంద్రుడొస్తాడు. అసలు చంద్రుడి వెన్నెల కూడా సూర్య కిరణాలే కదా...! ఏమైనా ఆ ఓటరు సూర్యుళ్లని మనం మ్మాలి. వాళ్లలో కొందరికి అన్నీ ముందే తెలుసు. మిగతావాళ్లని మేల్కొల్పాలి. మరో ఐదేళ్ళు మనల్ని ఎవరు పాలిస్తారు అన్న విషయంలో మెలకువగా ఉండమని చెప్పాలి. ఎటువంటి మత్తూకూ లోనుకాకుండా, లొంగిపోకుండా ఓటెయ్యమని చెప్పాలి. నిన్ను నువ్వు ఏలుకోవాలంటే మేలుకోమ్మని చెప్పాలి.

- జంధ్యాల రఘుబాబు
సెల్ : 9849753298

బీజేపీ పాలనలో దిగజారిన అట్టడుగు ప్రజల స్థితిగతులు



రామ్ పునియానీ

పద్దెనిమిదవ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భారతదేశం గందరగోళంలో ఉండడం వల్ల ఎన్నికల ఫలితాలపై తీవ్రమైన భయాందోళనలు నెలకొని ఉన్నాయి. మొత్తం 543 స్థానాల్లో 400 పైచిలుకు స్థానాల్లో తాము విజయం సాధిస్తామని పాలక భారతీయ జనతా పార్టీ ధీమా వ్యక్తం చేస్తుండగా, 150 నుంచి 180 స్థానాలకు మించి బీజేపీ విజయం సాధించదని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోని ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి చెపుతున్నది.

1925లో స్థాపించబడిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు బీజేపీ రాజకీయ అనుబంధ సంస్థ. ఆరెస్సెస్ లక్ష్యాలు, దాని ఎజెండా గురించి ఆరెస్సెస్ స్థాపన, దాని మూలాలు చాలా విషయాలు తెలియజేస్తాయి. మహాత్మాగాంధీ నాయకత్వంలో భారత ప్రజానీకం వలస దోపిడీ సంకెళ్లను అధిగమిస్తూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న సమయం అది. దళితులు (అణగారిన, శ్రేణీగత వ్యవస్థలో అట్టడుగు వర్గాలవారు), భూస్వాముల- మతాచార్యుల (బ్రాహ్మణ) కలయికకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తున్న సమయం అది. వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యానికి ముప్పు ఏర్పడిన కారణంగా ఉన్నత శ్రేణి ప్రముఖులంతా ఆరెస్సెస్ స్థాపన కోసం 1925లో ఏకమయ్యారు. లౌకిక, ప్రజాస్వామిక దేశం కోసం జరుగుతున్న జాతీయోద్యమానికి భిన్నమైన రీతిలో హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే ఆరెస్సెస్ వారి లక్ష్యంగా ఉంది. ఆ క్రమంలోనే అది 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి, దాని స్థానంలో 1980లో భారతీయ జనతాపార్టీకి పునర్జన్మనిచ్చింది.

ఆరెస్సెస్‌కు రెండు ఆధార నియమాలున్నాయి: ఒకటి, ముస్లింలు, క్రైస్తవులను 'విదేశీ మతాల'కు చెందిన వారుగా పరిగణించడం. రెండు, కులం, వర్గం, లింగ శ్రేణీగత పుట్టుక పై ఆధారపడిన కాలం నాటి 'స్వర్ణ గతాన్ని' (గోల్డెన్ పాస్ట్) పునరుద్ధరించడం. ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా ఉండడమే నేటి ఆరెస్సెస్ వారి ప్రధాన ఎజెండాగా కనపడుతుంది. అదే విధంగా అది, దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల వారిని, స్వదేశీయులను, మహిళలను పూర్తిగా అణచి వేయడానికి పూనుకుంటున్నది. సమాజంలోని ఈ వర్గాల పట్ల ఆరెస్సెస్ రెండు మార్గాల విధానాన్ని అవలంబిస్తున్నది. ఒకవైపు బీజేపీ మొత్తం విధానాలు ఈ వర్గాలకు హాని కలిగిస్తున్నది. మరోవైపు సమాజంలోని ఈ వర్గాల వారికి సహకరించడానికి వారు కొన్ని సంస్థలను స్థాపిస్తున్నారు. ముస్లిం లకు సంబంధించినంత వరకు, 2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశం మొత్తం జనాభాలో వారు 14.2శాతం ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' నినాదం ఇచ్చినప్పటికీ ముస్లింల అణచివేత చాలా స్పష్టంగా కనపడు తున్నది. ముస్లింలలో ఒక వర్గం వారిని ముఖ్యంగా షియాలు, పాస్మందాలు, సూఫీల మద్దతు కోసం వారు రాష్ట్రీయ



ప్రధాని నరేంద్ర మోడీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' నినాదం ఇచ్చినప్పటికీ ముస్లింల అణచివేత చాలా స్పష్టంగా కనపడుతున్నది. ముస్లింలలో ఒక వర్గం వారిని ముఖ్యంగా షియాలు, పాస్మందాలు, సూఫీల మద్దతు కోసం వారు రాష్ట్రీయ ముస్లిం మంచ్ (ముస్లింలకు జాతీయ వేదిక)ను కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పార్లమెంట్ ఉభయసభల్లో బీజేపీకి 395 మంది ఎంపీలు ఉంటే వారిలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేదు. 57 మంది మంత్రులతో కూడిన మోడీ మంత్రివర్గంలో ఒక్క ముస్లిం మంత్రి లేదు. ముస్లింలపై అఘాయిత్యాలకు సంబంధించి, గత పదేండ్లలో ముస్లింలపై 2019లో ఢిల్లీలో పెద్ద ఎత్తున హింస జరిగింది. ముస్లింలకు పౌరసత్వం ఇవ్వకుండా మినహాయించిన కొత్త పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన నిరసనల తరువాత ఆ హింస చోటు చేసుకుంది. 'హ్యూమన్ రైట్స్ వాచ్' లెక్కల ప్రకారం చంపబడిన 53 మందిలో 38 మంది ముస్లింలే.

ముస్లిం మంచ్ (ముస్లింలకు జాతీయ వేదిక)ను కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పార్లమెంట్ ఉభయసభల్లో బీజేపీకి 395 మంది ఎంపీలు ఉంటే వారిలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేదు. 57 మంది మంత్రులతో కూడిన మోడీ మంత్రివర్గంలో ఒక్క ముస్లిం మంత్రి లేదు. ముస్లింలపై అఘాయిత్యాలకు సంబంధించి, గత పదేండ్లలో ముస్లింలపై 2019లో ఢిల్లీలో పెద్ద ఎత్తున హింస జరిగింది. ముస్లింలకు పౌరసత్వం ఇవ్వకుండా మినహాయించిన కొత్త పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన నిరసనల తరువాత ఆ హింస చోటు చేసుకుంది. 'హ్యూమన్ రైట్స్ వాచ్' లెక్కల ప్రకారం చంపబడిన 53 మందిలో 38 మంది ముస్లింలే.

మొత్తంగా చూస్తే గొడ్డు-ఆవు మాంసం సమస్యపై ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడం భయం, బాధ కలిగిస్తుంది. దాద్రీలో అఖ్లఖ్ హత్య నుండి రైల్లో జరిగిన జునైద్ హత్య వరకు దాదాపు 100 హత్య కేసులు నమోదు అయ్యాయి. "వీటిలో 97శాతం కేసులు, 2014 మేలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే నమోదయ్యాయి. నమోదైన 63 ఆవు సంబంధిత కేసుల్లో దాదాపు 32 కేసులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నమోదయ్యాయని" బిజినెస్ స్టాండర్డ్ వార్తాపత్రిక పేర్కొంది.

"లవ్ జీహాద్", మతాంతర (అమ్మాయి హిందువైతే) వివాహాలను ముస్లిం యువతకు వ్యతిరేకంగా జరిగే హింసకు సాకుగా చూపుతున్నారు. ముస్లింలను లక్ష్యం చేసుకునే సమస్యలు చాలానే ఉన్నాయి. "ముస్లింలకు వ్యతిరేకంగా క్రమపద్ధతిలో వివక్ష చూపే, ప్రభుత్వ విమర్శకులను నిందించే చట్టాల్ని, విధానాల్ని భారతదేశంలో అధికారులు అవలంబిస్తు న్నారు. హిందూ జాతీయవాద భారతీయ జనతాపార్టీ పాలక ప్రభుత్వ పక్షపాత వైఖరి, పోలీస్ వ్యవస్థ, కోర్టులు లాంటి స్వతంత్ర సంస్థల్లోకి ప్రవేశించింది. అది, మైనార్టీ మతస్తులను బెదిరించి, వేధించి, దాడిచేసే విధంగా హిందూత్వ అల్లరి మూకలకు అధికారం ఇస్తున్నది. వీరికి శిక్షల నుండి మినహాయింపు ఉంటుంది.

క్రైస్తవ సమాజం కూడా అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నది. 1999లో పాస్టర్ గ్రాహం స్టీవార్ట్ స్టెయిన్స్‌ను సజీవ దహనం చేసిన ఘటనను, ప్రపంచ అమానుష చర్యల జాబితాకు చెందిన ఘటనగా నాటి భారతరాష్ట్రపతి కే.ఆర్.నారాయణన్ పేర్కొన్నాడు. విశ్రాంత న్యాయమూర్తి ఏ.పీ.మూర్తి నాయకత్వంలోని నేషనల్ పీపుల్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన జ్యూరీ, ఈ కేసు విచారణను చేపట్టింది. "ఈ సంఘటన జాతికి అవమానం, మానవజాతికి విఘాతం" అని షా వ్యాఖ్యానించాడు. ఈ హింసలో దాదాపు 100 మంది క్రైస్తవులు హత్యకు గురయ్యారు. 300 చర్చీలు ధ్వంసం చేయబడ్డాయి.

క్రైస్తవ సమాజం కూడా అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నది. 1999లో పాస్టర్ గ్రాహం స్టీవార్ట్ స్టెయిన్స్‌ను సజీవ దహనం చేసిన ఘటనను, ప్రపంచ అమానుష చర్యల జాబితాకు చెందిన ఘటనగా నాటి భారతరాష్ట్రపతి కే.ఆర్.నారాయణన్ పేర్కొన్నాడు. విశ్రాంత న్యాయమూర్తి ఏ.పీ.మూర్తి నాయకత్వంలోని నేషనల్ పీపుల్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన జ్యూరీ, ఈ కేసు విచారణను చేపట్టింది. "ఈ సంఘటన జాతికి అవమానం, మానవజాతికి విఘాతం" అని షా వ్యాఖ్యానించాడు. ఈ హింసలో దాదాపు 100 మంది క్రైస్తవులు హత్యకు గురయ్యారు. 300 చర్చీలు ధ్వంసం చేయబడ్డాయి.

మిషనరీలు మతమార్పిడి కోసం ప్రయత్నం చేస్తున్నాయనే సాకుతో ప్రార్థనా సమావేశాలపై దాడులు జరుగుతున్న మారుమూల ప్రాంతాల్లో తక్కువ తీవ్రతతో క్రైస్తవ వ్యతిరేక దాడులు కొనసాగుతున్నాయి. "23 జిల్లాల్లో హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. భారతదేశంలో మూడు రాష్ట్రాల్లోని 13 జిల్లాల్ని క్రైస్తవ మతాన్ని ఆచరించడానికి ప్రమాదకరమైన జోన్లుగా గుర్తించారని" ద సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ సంస్థ తెలిపింది. క్రైస్తవులు జీవించడానికి భారతదేశం పదో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా గుర్తించారని 'ఓపెన్ డోర్స్' పేర్కొంది.

"పట్టణ ప్రాంతాల్లో దళితులు, నైపుణ్యం లేని ఉద్యోగాలు, రెక్కల కష్టం చేసే ఉపాధిని పొందుతున్నారు. కేవలం 5శాతం మంది దళితులు మాత్రమే భారతీయ రిజర్వేషన్ చట్టం నుండి ప్రయోజనాలు పొందుతున్నారు. ప్రభుత్వ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు దళితులకు సహాయపడుతుండగా, ప్రభుత్వం వాటిని సరైన రీతిలో పర్యవేక్షించడం లేదు, వాటిలో చాలా వరకు అమలుకు నోచుకోవని" ప్రముఖ విద్యావేత్త సుఖదేవ్ థోరత్ అన్నారు. వారి ఆర్థిక దుస్థితి దయనీయంగా ఉంది. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం 2024 లోక్ సభ ఎన్నికల్లో ప్రతిబింబిస్తుంది. బీజేపీ చేస్తున్న వాగ్దానాలను అణగారిన వర్గాలు సీరియస్‌గా తీసుకోవడం లేదని యూసీఏ న్యూస్ నివేదిక తెలిపింది.

ఈ నేపథ్యంలో మోడీ, కొందరు క్రైస్తవ మత పెద్దల్ని తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. "డిసెంబర్ 25వ తేదీన మోడీ క్రైస్తవ ప్రతినిధులను పరస్పర చర్చల కోసం, వారిని అభినందించడం కోసం ఆహ్వానించాడు. క్రైస్తవ సమాజం చేస్తున్న సామాజిక సేవను ప్రశంసించి, ఏసుక్రీస్తు బోధనలను ఆయన కొనియాడాడని" ఇండియన్ కరెంట్స్ పేర్కొంది. సేవల ద్వారా దళితుల మద్దతు సాధించడానికి బీజేపీ, సామాజిక సామరస్య మంచ్ లాంటి కొన్ని సంస్థల్ని ప్రారంభిస్తున్నది. విధానపరమైన విషయాల్లో వారు అణగారిన వర్గాల కోసం నిశ్చయీకరణ చర్యలను దాట వేస్తున్నారు.

ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ, న్యాయం కోసం పిలుపునిస్తుంటే, భారతీయ జనతాపార్టీ విధాన పరంగా అవకాశం ఉన్న చోట, భారతదేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రధాన సాధనంగా ఉపయోగపడే రిజర్వేషన్లను తొలగిస్తున్నది. గడచిన దశాబ్ద కాలంలో ఈ వర్గాల ఆర్థిక స్థితిగతులు మరింతగా దిగజారాయి.

"పట్టణ ప్రాంతాల్లో దళితులు, నైపుణ్యం లేని ఉద్యోగాలు, రెక్కల కష్టం చేసే ఉపాధిని పొందుతున్నారు. కేవలం 5శాతం మంది దళితులు మాత్రమే భారతీయ రిజర్వేషన్ చట్టం నుండి ప్రయోజనాలు పొందుతున్నారు. ప్రభుత్వ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు దళితులకు సహాయపడుతుండగా, ప్రభుత్వం వాటిని సరైన రీతిలో పర్యవేక్షించడం లేదు, వాటిలో చాలా వరకు అమలుకు నోచుకోవని" ప్రముఖ విద్యావేత్త సుఖదేవ్ థోరత్ అన్నారు. వారి ఆర్థిక దుస్థితి దయనీయంగా ఉంది. ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం 2024 లోక్ సభ ఎన్నికల్లో ప్రతిబింబిస్తుంది. బీజేపీ చేస్తున్న వాగ్దానాలను అణగారిన వర్గాలు సీరియస్‌గా తీసుకోవడం లేదని యూసీఏ న్యూస్ నివేదిక తెలిపింది.

("న్యూస్‌క్లిక్" సౌజన్యంతో)
అనువాదం : బోడపట్ల రవీందర్
సెల్ : 9848412451

ప్రధానీ..! మా ఉపాధి ఏదీ..?



కోట రమేశ్
9618339490

'ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాం' ఇది 2014 సాధారణ ఎన్నికల సమయంలో నరేంద్రమోడీ దేశ యువతకు చేసిన వాగ్దానం. గత పదేండ్లుగా ఆయనే కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తున్నాడు. ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలెక్కడ? అని యువత ప్రశ్నిస్తే, పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగం లాంటిదేనని, దేశ యువతను అవమానించేలా మాట్లాడాడు. కనీసం కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి, నిరుద్యోగ యువతను నడిబజారులో నిలబెట్టాడు. దేశ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ ప్రభుత్వ అతిపెద్ద కర్తవ్యంగా ఉంటుందని చెప్పిన ప్రధాని చేసిందేమిటి? మేకిన్ ఇండియా (భారతదేశంలో తయారు చేయడం), స్కిల్ ఇండియా (భారత దేశంలో నైపుణ్యాన్ని సంతరించుకోవడం), స్టార్ట్ అప్ ఇండియా (భారతదేశంలో పరిశ్రమలు మొదలుపెట్టడం) వీటి ద్వారా భారతదేశాన్ని వెన్నాడుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించి దేశ ఆర్థిక వ్యవస్థ సుభిక్షం చేస్తానని ప్రగల్భాలు పలికాడు. విదేశీ పెట్టుబడులు, ఉద్యోగాలు తెచ్చిపెడతాయని ఆశలు కల్పించాడు. మరీ ఆ వాగ్దానం ఏమైంది? గాల్లో కలిసిపోయింది. ఇప్పుడు ఆయన ఉపాధి కల్పన గురించి మాట్లాడటం లేదు. ఉద్యోగాల్ని యువతే అందిపుచ్చుకోలేదని కొత్త నాటకానికి తెరదీశాడు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలన్ని అటకెక్కాయి. ఇప్పుడు మరోసారి మోసపూరిత వాగ్దానాలతో ఎన్నికల్లో గెలిచేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నాడు.

పదేండ్ల బీజేపీ పాలనలో అంతా నయవంచన, మోసపూరిత నినాదాలు, ప్రచార ఆర్భాటాలే తప్ప యువతకు జరిగిన ప్రయోజనం ఇసుమంత కూడా లేదు. కార్పొరేట్ అనుకూల, నిరుద్యోగ వ్యతిరేక విధానాల మూలంగా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది చదువుకున్నవారు రోడ్డున పడ్డారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువ నిరుద్యోగం పెరిగిపోయిందని అనేక సంస్థల సర్వే రిపోర్టులు పేర్కొన్నాయి. మోడీ ఈ పదేండ్లలో భర్తీ చేసిన ఉద్యోగాలు ఎన్ని? అన్న విషయంలో స్పష్టత లేదు. అసలు ఉద్యోగ నియామకాల సమాచారం కూడా వెల్లడించిన పరిస్థితి లేదు. ఇదే విషయంపై పార్లమెంటులో ప్రధానిని ప్రతిపక్షాలు నిలదీస్తే, సుమారు 7,22,311 ఉద్యోగాలు మాత్రమే వివిధ శాఖల్లో భర్తీ చేసినట్లు స్వయానా కేంద్రమంత్రి పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారు. మరి యువతకు కల్పిస్తామన్న ఉద్యోగాల సంగతేందంటే? అంతా హుష్‌కాకి! అదో ఎన్నికల జుమ్లాగా బీజేపీ నాయకులు మాట్లాడు తున్నారు. శతకోటీశ్వరులకు రూ. లక్షల కోట్లు రాయితీలు ప్రకటించడం మీదున్న ధ్యాస, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో ఏమాత్రం పట్టింపు లేదు. మాట మాట్లాడితే యువతే దేశానికి వెన్నెముక అని చెబుతూ వారినే వెన్నుపోటు పొడిచే చర్యల్ని బీజేపీ శరవేగంగా అమలు చేసింది. త్రివిధ దళాల్లో ఆర్మీ ఉద్యోగ నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికను కాకుండా, నాలుగేండ్ల కాలపరిమితి ఆధారంగా కాంట్రాక్ట్ పద్ధతిలో చేపట్టడంతో యువకులంతా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. యువత ఆగ్రహావేశాల్ని చల్లార్చేందుకు చర్యలు తీసుకోని మోడీసర్కార్ వారిని ఎక్కడికక్కడే అరెస్టులు చేయించింది.

కొన్ని ఉదాహరణలు చూస్తే దేశంలో నిరుద్యోగం ఎంత తాండవిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 60 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. రైల్వేలో లక్ష ఉద్యోగాలు ఖాళీలున్నాయని ప్రకటిస్తే రెండు కోట్ల దరఖాస్తులు వచ్చాయి. 2015లో 368 ఖాళీల కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్యూన్ ఉద్యోగాల కోసం ప్రకటన ఇస్తే 23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది 16 వేల పోస్టులకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తే సుమారు 50 లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. హర్యానాలో కోర్టులో ఉన్న తొమ్మిది ఖాళీలను గాను 18వేల దరఖాస్తులు వచ్చాయి. రాజస్థాన్‌లో 18 పోస్టులకు 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ ఉన్నది బీజేపీ డబుల్ఇంజన్ సర్కార్లేనన్న సంగతి మరవకూడదు. దేశాన్ని కోవిడ్-19 ఎంత విచ్ఛిన్నం చేసిందో తెలిసిందే. సరైన సమయంలో అదుపుచేయలేక కేంద్రం లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు చాలా అవస్తలు పడ్డారు. వలసకార్మికుల జీవనం మరీ దారుణం. చిన్న పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. ప్రజల కొనుగోలు శక్తి మందగించింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం ధరల నియంత్రణకు కూడా చొరవ తీసుకోలేదు. ఇది కూడా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపింది.

ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం అంటూ దేశ ప్రజలపై హిందీ భాషను బలవంతంగా రుద్దే విధానాలు తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో హిందీ భాష వస్తేనే, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెగేసి చెప్పింది. ఇదే కనుక జరిగితే దక్షిణాది రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాదిమంది యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కోల్పోయినట్టే! ఇలా ఒక్కటి కాదు, రెండు కాదు అనేక అంశాల్లో నిరుద్యోగ యువతతో మోడీ ప్రభుత్వం ఆటలాడు కుంటున్నది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవడమొక్కటే కాదు, నిరుద్యోగ జీవితాలతో పదేండ్లుగా చెలగాటమాడుతున్న బీజేపీని ఓడించాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడే పార్టీకి గెలిపించాలి. ఇది ప్రజల బాధ్యతే కాదు, యువత ప్రథమ కర్తవ్యంగా ఉండాలి.



దేశంలో ఉద్యోగాలున్న వారి సంఖ్య 2013లో 44 కోట్లు ఉంటే 2016 నాటికి అది 41 కోట్లకు తగ్గి పోయింది 2017 నాటికి 40 కోట్లకు తగ్గగా 2021 నాటికి మరింతగా 38 కోట్లకు పడిపోయింది ఇదే సమయంలో పనిచేయగలిగిన వారి సంఖ్య 79 కోట్ల నుంచి 106 కోట్లకు పెరిగిపోయిందని అనేకమంది ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ సమీక్షా కేంద్రం (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) విడుదల చేసిన తాజా నివేదికలో ప్రధానంగా 20నుంచి 34 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో ఏడాదికేడాదికి నిరుద్యోగం పెరుగుతున్నట్లు పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లోని మధ్య వయస్కుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనపడుతున్నది. యువతకు నగరాలు, పట్టణాలతోపాటు గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. గ్రామాల్లో ఏదైనా పనిచేద్దామన్నా కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే చర్యలు చేపట్టింది. ఈ పథకానికి సంబంధించి నిధుల్లో కోతలు విధిస్తూనే ఉంది.

గతేడాది 20-24 ఏండ్ల యువతలో (2023) జులై-సెప్టెంబర్ మధ్య 43.65శాతం నిరుద్యోగం ఉండగా, అక్టోబర్ - డిసెంబర్ నాటికి 44.49శాతానికి పెరిగింది. 25-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో నిరుద్యో గం ఇదే కాలంలో 13.35శాతం నుంచి 14.33 శాతానికి పెరిగింది. 25-29 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నమోదైన నిరుద్యోగం అత్యధికం కావడం గమనార్హం. 30-34 సంవత్సరాల మధ్య వయస్కుల లలో నిరుద్యోగ రేటు కూడా 2.06శాతం నుంచి 2.49 శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగంతో పోలిస్తే, గ్రామీణ ప్రాం తాలలో నిరుద్యోగమే అధికంగా ఉన్నదని సిఎంఐఇ తెలిపింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 20-24 ఏండ్ల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయికి (43.79శాతం) చేరింది. 25-29 సంవత్సరాల మధ్య వయ సున్న వారిలో 13.06శాతం, 30-34 ఏండ్ల మధ్య వయస్కు లలో 2.24శాతంగా నమోదైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నవి.

తమ న్యాయమైన, రాజ్యాంగబద్ధ హక్కులైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి నేడు యువత మాట్లాడుతుంటే భావోద్వేగాలు, మతవిద్వేషాలు రెచ్చగొట్టి, సమస్యల నుంచి పక్కదారి పట్టించే ప్రయత్నాలు మోడీ సర్కార్ చేస్తున్నది. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం అంటూ దేశ ప్రజలపై హిందీ భాషను బలవంతంగా రుద్దే విధానాలు తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో హిందీ భాష వస్తేనే, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెగేసి చెప్పింది.

ఇదే కనుక జరిగితే దక్షిణాది రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాదిమంది యువ తకు విద్యా ఉపాధి అవకాశాలు కోల్పోయినట్టే! ఇలా ఒక్కటి కాదు, రెండు కాదు అనేక అంశాల్లో నిరుద్యోగ యువతతో మోడీ ప్రభుత్వం ఆటలాడుకుంటున్నది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవడమొక్కటే కాదు, నిరుద్యోగ జీవితాలతో పదేండ్లుగా చెలగాటమాడుతున్న బీజేపీని ఓడించాలి. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడే పార్టీకి గెలిపించాలి. ఇది ప్రజల బాధ్యతే కాదు, యువత ప్రథమ కర్తవ్యంగా ఉండాలి.



బతకలేక రాజకీయాల్లోకి రాలేదు

- ప్రజలకు సాయం చేద్దామనే వచ్చా
- మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తాను బతకలేక రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు ఏదో ఒక సహాయం చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాలు చేస్తున్నానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలో సాయిగణేశ నగర్‌లోని కందాళ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడారు. ఎన్నికలకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉందని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత కొన్ని రోజులుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు గులాబీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తాము పడుతున్న కష్టాలను తీర్చేది కేసీఆర్ మాత్రమేనని భావిస్తున్నారని వివరించారు.గత ఎన్నికల్లో జరిగిన పొరపాటు సరిదిద్దుకునే సరైన సమయం వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తే తనకు వేసినట్లే అని ప్రజలందరికీ తెలియజేయాలని పార్టీ శ్రేణులకు కందాళ వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త తాళ్లూరి జీవన్ కుమార్, మండలాధ్యక్షుడు బెల్లం వేణు గోపాల్, ఇంటూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి నిలయంలో అన్నదానం

నవతెలంగాణ-బోనకల్

మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల శరణాలయం శాంతి నిలయం నందు మధిర వాస్తవ్యులు, ఎన్ఆర్ఐ ఆవునూరి రాజేంద్రప్రసాద్ సతీమణి ఆవునూరి మాధవి జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం శాంతి నిలయంలోని అనాథ దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. వారి కుమారుడు ఆవునూరి వేధ రుత్వక్ శాంతి నిలయానికి 15వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ జీవితం చాలా చిన్నదని, ఉన్నంతకాలం సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం, మానవత్వంతో జీవించడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ బిజిలీ మాట్లాడుతూ దుబాయ్‌లో ఉంటున్న ఆవునూరి మాధవి తన పుట్టినరోజు వేడుకలను శాంతి నిలయం నందు జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరు మానవత్వంతో ఆలోచించి



శాంతి నిలయంలో ఉన్న దివ్యంగులకు చేయుత అందించాలని కోరారు. శాంతి నిలయంలో నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మార్పు స్వచ్ఛంద సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, సభ్యులు గుడిమెట్ల వెంకట రోహన్, శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ బిజిలీ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవ తెలంగాణ-మధిర

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని అన్నపూర్ణ మెస్ పక్కన విజయవాడ నుంచి వచ్చిన అఖిల (22) గది అద్దెకు తీసుకొని నివాసం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం అఖిల గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మధిర టౌన్ ఎస్ఐ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రఘురాంరెడ్డి గెలుపునకు ప్రచారం

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపునకు శుక్రవారం సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కారేపల్లి మండల ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాల్లో మిత్రపక్షాల కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ మోడల్ ఈవీఎంలో హస్తం గుర్తుపై ఓటు వేయాలని చూపుతూ ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్‌తోనే సామరస్యపూర్వక సమాజం సాధ్యమమని ఓటర్లకు వివరిస్తున్నారు. బీజేపీ పాలనలో పేదల బతుకులు దయనీయంగా మారాయని, ఓట్లకు కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టటమే బీజేపీ విధానమని ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని, బీఆర్ఎస్ బీజేపీ పంచన చేరటం ఖాయమని కాంగ్రెసుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వజ్జా రామారావు, పండగ కొండయ్య, కుర్సం శ్రీను, పూనెం బాబు, చరప వీరస్వామి, టీడీపీ నాయకులు ముక్కపాటి మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరంకుశపాలనకు చరమగీతం పాడాలి

ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు
గంగసాని రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

గత అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీని ఓడించి నిరంకుశపాలనకు చరమగీతం పాడాలని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగసాని రాజేశ్వర్‌రెడ్డి (యుఎస్‌ఏ) తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు లేకుండా చేస్తామని, నిరంకుశ, నియంతృత్వంగా 10 సంవత్సరాలు పరిపాలించిన బిజెపిని పారద్రోలాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు దేశవ్యాప్తంగా 6వేల మంది ప్రవాస భారతీయులు పనిచేయడానికి స్వచ్ఛందంగా వచ్చామని చెప్పారు. రాహూల్ గాంధీ జోడో పాదయాత్రలో ప్రజల విన్నపాలను కాంగ్రెస్



మేనిఫెస్టోగా మార్చిందని, మాట ఇచ్చి మడమ తిప్పని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను, మన ఖమ్మం పార్లమెంటరీ నియోజకర్గ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రవాస భారతీయుల తరపున కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్ చౌదరి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు సామల ప్రదీప్, ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, కొంటెముక్కల రవి (సౌత్ ఆఫ్రికా) తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో అడైవర్స్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్

- 140మందిలో 17మందిని ఎంపిక చేసిన కంపెనీ
- అభినందనలు తెలిపిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన అడైవర్స్ టెక్నాలజీస్ వారు ఈనెల



1న బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు క్యాంపస్ నియామకాలు చేపట్టారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూకు 140మంది విద్యార్థులు పాల్గొనగా 17మందిని ఎంపిక చేసినట్లు శుక్రవారం అడైవర్స్ టెక్నాలజీస్ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ టి ఆదిత్య కుమార్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎండీ పాతిమా తెలియజేశారని సాయిస్ఫూర్తి కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ డీఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సీఎస్ఈ నుంచి 13మంది, ఈసీఈ నుంచి ఒక్కరు, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 17 మంది ఎంపికయినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వేతనం రూ. 21.5వేలు కంపెనీ చెల్లిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు ప్రతిభ ఉన్న విద్యార్థులను క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా తమ కంపెనీల్లో నియమించుకొనేందుకు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. క్యాంపస్ నియామకాల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను రాజ్యసభ సభ్యులు, కళాశాల ఛైర్మెన్, హెటిరో గ్రూపు సంస్థల అధినేత డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, అన్ని ఇంజినీరింగ్ విభాగాల హెచ్ఓడీలు అభినందించారు.

మృతుల కుటుంబాలకు పొంగులేటి పరామర్శ

నవతెలంగాణ- ఖమ్మం



ప్రమాదవశాత్తు మున్నేరు హైవే పిల్లర్ గుంతలో పడి మృతి చెందిన ముగ్గురు పిల్లల కుటుంబ సభ్యులను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. నగరంలోని రామచంద్రయ్య నగర్‌లో నివాసముంటున్న వారి ఇళ్లకు వెళ్లి మృతదేహాలకు నివాళులు అర్పించారు. ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని కంటతడి పెట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.





'అధికారం' వైపే..!





- ఖమ్మం, మానుకోట లోక్‌సభ స్థానాల్లో ఓటర్లు
- రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీదే గెలుపు
- గత ఎన్నికల ఫలితాల్లో ఇదే నిరూపితం
- ఏడేసి అసెంబ్లీ సెగ్మెంట్లున్న ఈ రెండుచోట్లా అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే..!

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో గత ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలే లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధించాయి. ఈ దఫా కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏడేసి అసెంబ్లీ నియోజకవర్గాలున్న ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్, దాని మద్దతుదారులే ఎమ్మెల్యేలుగా ఉన్నారు.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లలో ఒకటి, రెండు సందర్భాలు మినహా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే అదే లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధించింది. ఈసారి ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేటలో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యేలు అయ్యారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ విజయం సాధించింది. అది కూడా లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌నే బలపరుస్తుండటంతో అన్ని అసెంబ్లీ స్థానాలూ 'చేతి'లో ఉన్నట్టే..!. ఇక ఎస్టీ రిజర్వుడైన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోనూ ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో నర్సంపేట మినహా మిగిలిన అన్నీ ఎస్టీ నియోజకవర్గాలే కావడం గమనార్హం. వీటిలో భద్రాచలం మినహా ములుగు, నర్సంపేట (జనరల్), మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. భద్రాచలంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన తెల్లం వెంకట్రావు ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. కాబట్టి ఉన్న అన్ని స్థానాలూ కాంగ్రెస్సేవేనని చెప్పవచ్చు.



కాంగ్రెస్, కమ్యూనిస్టు కంచుకోట ఖమ్మం...

తెలంగాణ లోక్‌సభ స్థానాల్లో 17వదిగా ఉన్న ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రస్తుతం 16 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గానికి 17 సార్లు ఎన్నికలు జరిగాయి. దీనిలో పదిసార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. మూడుసార్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు గెలిచారు. ప్రస్తుత సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం 1996లో ఖమ్మం ఎంపీగా ఎన్నికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1984, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీగా గెలిచారు. 2009లో తెలుగుదేశం నుంచి గెలిచిన ప్రస్తుత ఎంపీ నామ నాగేశ్వరావు 2019లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. ప్రస్తుత రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైఎస్ఆర్‌సీపీ తరపున 2014లో గెలిచారు. ఈ నియోజకవర్గం నుంచి జలగం వెంగళరావు, రంగయ్య నాయుడు, రేణుకాచౌదరి కేంద్ర మంత్రులుగా పనిచేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి క్రితంసారి ఎన్నికల్లో 49.78% ఓట్లతో నామ నాగేశ్వరరావు గెలిచారు. నామకు 5,67,459 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి రేణుకాచౌదరి 3,99,397 (35.04%) ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) తరపున పోటీలో ఉన్న బోడా వెంకట్ 57,102 ఓట్లు సాధించారు. ఓవైపు రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ఉండటం, మరోవైపు నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి 2.80 లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలుపొందటం, సీపీఐ(ఎం), సీపీఐలు కూడా కాంగ్రెస్‌ను బలపరుస్తుండటంతో ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డికి సానుకూలాంశాలుగా ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావు నుంచి ఈయనకు పోటీ ఎదురుకానుంది. గత ఎన్నికల్లో 20,488 ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి కూడా ఆ ఓట్లు సాధిస్తే చాలనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

అధికార పార్టీలకు పెట్టని కోట మానుకోట..

ఎస్టీ రిజర్వుడైన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ అధికార పార్టీలే హవా సాగిస్తున్నాయి. ఈ నియోజకవర్గం 1957 నుంచి 1967 వరకు కొనసాగింది. ఆ తర్వాత రద్దయింది. 2008లో తిరిగి ఏర్పాటు కాగా 2009లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 3,94, 447 (39.59%) ఓట్లతో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాసరావు 3,25, 490



(32.67%)పై విజయం సాధించారు. ఆ తర్వాత ఏర్పాటైన యూపీఏ-2 ప్రభుత్వంలో కేంద్రమంత్రి అయ్యారు. ఆ తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ (3,20,569) చేతిలో బలరాంనాయక్ (2,85,577) ఓటమి పాలయ్యారు. నాటి ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు 30శాతానికి పైగా ఓట్లు సాధించడం గమనార్హం. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలోనూ అధికార మార్పిడి జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో టీఆర్ఎస్ అధికార పగ్గాలు చేపట్టింది. తిరిగి 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎంపీ మాలోత్ కవిత 4,62,109 (46.98%) ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ (3,15,446)పై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన జాటోత్ హుస్సేన్‌నాయక్ 25,487 ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో గత ఎలక్షన్స్‌లో పోటీ చేసిన పాతకాపులే బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలో 15,32,366 ఓట్లు ఉండగా 7,47,836 మంది పురుషులు, 7,84,424 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 6,85,897 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు వచ్చాయి. బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులే భారీ మెజార్టీలతో గెలుపొందారు. భద్రాచలంలో బీఆర్ఎస్ నుంచి నెగ్గిన తెల్లం వెంకట్రావు ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఇలా మొత్తం ఏడేసి అసెంబ్లీ నియోజకవర్గాలున్న ఖమ్మం, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో మొత్తం కూడా కాంగ్రెస్ 'చేతి'లోనే ఉండటంతో లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి సానుకూలంశంగా విశ్లేషకుల అంచనా.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌ని గెలిపించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని
- బిజెపి పాలనలో అచ్చేదిన్ పోయి సచ్చేదిన్
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-ఖమ్మం





సీపీఐ(ఎం) బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ(ఎం) ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్ నుండి కాల్వొడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం పరిరక్షించబడాలన్నా, అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ మౌలిక సూత్రాలు రక్షించబడాలన్నా బిజెపిని ఓడించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మూడోసారి బిజెపి గెలిస్తే అధ్యక్ష తరహా పాలన వస్తుందని, మరోసారి మనం ఎన్నికలు చూడబోమని, ఇందు కోసం ఐక్యంగా బిజెపిని ఓడించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు వంటి వాటితో ప్రజలకు అచ్చేదిన్ పోయి సచ్చేదిన్ వచ్చాయని దీనికి బిజెపిని మోడీని ఓడించడమే ఏకైక మార్గం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, టౌన్ నాయకులు ఎల్లంపల్లి వెంకట్రావు, ఎస్‌కే సైదులు, వజినేపల్లి శ్రీనివాసరావు, పత్తిపాక నాగసులోచన, షేక్ హిమామ్, నాయిని నరసింహారావు, రంగు హనుమంతాచారి, ఎస్‌కే బాబు, వేల్పుల నాగేశ్వరరావు, ఎస్కే మస్తాన్, గణపనేని బడేమియా చౌదరి, పున్నయ్య చౌదరి, దాదేమియా, యమ్మని వెంకటేశ్వర్లు, హెచ్.పేరయ్య, పత్తిపాక శ్రావణ్ కుమార్, రాంబాబు, పంది స్వామి, కృష్ణ, చారి, ఎర్ర మల్లికార్జున, తమ్మినేని రంగారావు, సిద్దల రాజు, మద్ది సత్యం, తీగల ఉపేందర్, కందుల శ్రీధర్, ఆంగోతు లక్ష్మణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : సీపీఐ(ఎం) బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం బైపాస్ రోడ్డు కూరగాయలు మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జరిగిన నాలుగు దశ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం వెనుకబడిందని సర్వేలు రావడంతో మోడీ ఆందోళనకు గురై మంగళసూత్రాలు గురించి హేళన చేస్తున్నాడని విమర్శించారు. అదానీ, అంబానీలకు దేశ సంపద పంచిపెట్టి ఇప్పుడు ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం దొంగే దొంగ అన్నట్లు ఉందని ఆరోపించారు. మూడోవసారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లతో పాటు అన్ని ధరలూ విపరీతంగా పెరిగి దేశంలో సంక్షోభం వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపి పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌శక్తులకు అండగా మోడీ ఉన్నారని తెలిపారు. మతోన్మాదాన్నీ పెంచి పోషిస్తున్న బిజెపిని ఓడించి, రాజ్యాంగాన్ని లౌకిక విధానాలను పరిరక్షించే ఇండియా కూటమి ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామ్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, టి విష్ణు, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, బీరప్ప, జె వెంకన్న బాబు, డి.వీరబాబు, భుక్యా ఉపేందర్, డి.నాగరాజు, నాగేశ్వరరావు, మల్లికార్జున్‌రెడ్డి, హుస్సేన్, ఫకీరు సాహిబ్, బి.ముత్తయ్య, గుమ్మడి బిక్షం, కోయ రమేష్, బిబి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల : మతోన్మాద బిజెపిని ఓడించడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారని, అందులో బాగానే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని బలపరిచి గెలిపించడం ద్వారానే ఉపాధిహామీ చట్టం ద్వారా ప్రజలకు ఉపాధి దొరుకుతుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, వైరా నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా వీరభద్రం తెలిపారు. గురువారం మండల పరిధిలో వివిధ గ్రామాల పర్యటించి సింగరాయపాలెం గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. బిజెపి 10 సంవత్సరాల పరిపాలనలో తెలంగాణ రాష్ట్రానికి ఖమ్మం జిల్లాకు వైరా నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని, హక్కులను తొలగించే ప్రయత్నం చేసిందని విమర్శించారు. కమ్యూనిస్టులు కొట్లాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు దొడ్డపనేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, షేక్ అబ్జల్, సురభి బజారు, ఖాసిం బేగ్, వెంకటి, కాంగ్రెస్ నాయకులు మట్టా వెంకటేశ్వర్లు, కాటేపల్లి సీతారామయ్య, సురభి వెంకటేశ్వర్లు, అనుమోలు ప్రసాద్, సురభి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి : కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని ఉపాధి హామీ కూలీలను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు కోరారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను వారు శుక్రవారం కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా వామపక్షాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. పేద ప్రజలపక్షాన, కార్మికుల, వ్యవసాయ కార్మికుల, కూలీల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు జి.రాజారావు, కండ సత్యం, గుడిమెట్ల బాబు, తడికమళ్ళ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కులమతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీని చిత్తుగా ఓడిద్దాం

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

కులమతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బీజేపీని 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అధ్యక్షతన దళిత వర్గాలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంద కృష్ణమాదిగ బీజేపీకి ఓటెయ్యమని దళిత వర్గాలను కోరడం దురదృష్టకరమన్నారు. కృష్ణమాదిగ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తారతమ్యాలు లేకుండా ఎస్సీ వర్గాలన్నీ కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి అత్యధిక మెజారిటీ తెచ్చి పెట్టేందుకు ఎస్సీ వర్గాలన్నీ కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీకి



మించి ఆధిక్యత సాధించుకుందామన్నారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య మాట్లాడుతూ విషవృక్షం లాంటి బీజేపీకి ఓటెయ్యాల్సిన అవసరం దళిత సమాజానికి లేదన్నారు. ఉన్న రిజర్వేషన్లను బీజేపీ తీసేస్తానంటోదన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి ఓటెయ్యమని కృష్ణమాదిగ కోరడంలో ఆంతర్యం ఏమిటన్నారు. స్వలాభం కోసమే కృష్ణమాదిగ బీజేపీ పంచన చేరారన్నారు. ఇప్పటి వరకు దళిత వర్గాలకు బీజేపీ ఏం చేసిందని ప్రశ్నించారు. దళితులు నాయకులుగా ఎదగకుండా అడ్డుకుంటూ వస్తోందన్నారు. రిజర్వేషన్లు తీసేస్తామంటూ, రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ మంత్రులు బహిరంగ సమావేశాల్లో అనడాన్ని బట్టిచూస్తే కాషాయదారులకు దళితులపై ఎంత అక్కసు ఉందో అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే దళితులు స్వేచ్ఛగా మాట్లాడటానికి, తిరగడానికి కారణమన్నారు. దళిత రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో దళితులకు ఏనాడూ అన్యాయం జరగలేదన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. జాతీయ జెండాను గౌరవించని ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే బీజేపీ పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ చల్లగుళ్ల నరసింహారావు, నాయకులు గాదె చెన్నకేశవరావు, మొహమ్మద్ కమల్‌పాషా, ఐ.శ్రీనివాసరావు, మానుకోట ప్రసాద్, దోమ ఆనంద్, తడికమళ్ల అర్జునరావు, లంక వెంకటేశ్వర్లు, చిల్లిముంత దిలీప్‌కుమార్, జాజ్జారపు నవీన్ పాల్గొన్నారు. ఎన్‌సీసీ జాతీయ, రాష్ట్ర పొలిటికల్ అధ్యక్షులు అలవాల కరుణాకర్, పింగిలి సామేలు పాల్గొన్నారు.

'ఓటుతోనే మన భవిష్యత్'

నవతెలంగాణ-మధిర

ఓటుతోనే మన భవిష్యత్ అని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని క్రిష్ణాపురంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. మన దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనని చెప్పారు.



ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం



శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర ఎన్నికల విధులపై సిబ్బందికి పోలీస్ కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండటంతో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై పోలీస్ సిబ్బందితో వీడియో కన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల్లో తమకు కేటాయించిన విధులను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రలోభాలకు సంబంధించిన ఏమైనా సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రూట్ మొబైల్ పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అప్రమత్తంగా వుండాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటర్లు క్యూ లైనులో ఉండేలా చూసుకోవాలని, నిషేధిత వస్తువులు పోలింగ్ బూత్ లోనికి తీసుకెళ్లకుండా, మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల విధి విధానాలు, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది కేటాయించిన ప్రాంతాల నుండి వెళ్లకుండా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్, ఏఎస్పీ అవినాష్ కుమార్, ఏసీపీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

- కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జీ, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్లో) ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సూక్ష్మంగా ఆరు గ్యారెంటీలు ఇచ్చినప్పటికీ స్థూలంగా 13 గ్యారంటీలు ఇచ్చిందని, వాటిలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీకి పది లక్షలు వర్తింపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఒక్కొక్క నియోజకవర్గానికి 3500 చొప్పున గృహాలు మంజూరు కార్యక్రమాల అమలు చేసిందన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 97 శాతం అంటే, దాదాపు 66 లక్షల మంది రైతులకు 6,319 కోట్ల రూపాయలు రైతు భరోసా సహాయం అందిందన్నారు. తెలంగాణ సంపదనంతా దోసి కెసిఆర్ కుటుంబం తెలంగాణ ప్రజలను నట్టేట ముంచిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ, పచ్చీసు గ్యారెంటీ పేరుతో ప్రజల ముందుకు వచ్చిందని, కచ్చితంగా దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాహుల్ గాంధీ నాయకత్వంలో వస్తుందని, దేశ ప్రధాని రాహుల్ గాంధీ అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు చోటా బాబా, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పోటు అభిలాష్ చౌదరి, రాష్ట్ర ఎరుకల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడ వెంకట్రావు, మహిళా కాంగ్రెస్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు బానోతు వినోద, లీగల్ సెల్ నాయకులు, సీనియర్ న్యాయవాది మోజెస్ క్రిస్టోఫర్, గోరంట్ల శాంతారావు, బీసీ సెల్ జిల్లా సీనియర్ నాయకులు కంచర్ల సైదులు, ఎస్టీ సెల్ ఖమ్మం జిల్లా నాయకులు బానోత్ మంగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నగరంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం(సంజీవరెడ్డి భవనం)లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్‌లు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలోకి ఆకర్షితులు అవుతున్నారని, ఒక్క కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని భావించి భారీగా పార్టీలో చేరుతున్నారన్నారు. అందరం కలసి కట్టుగా పని చేసి ఖమ్మం లోక్ సభ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. 42 వ డివిజన్ కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ మజీద్, పర్వీన్‌లు, 58 వ డివిజన్ నుండి తంగిరాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వత్సవాయి సతీష్, రేగళ్ల కృష్ణ తోపాటు సుమారు 250 మంది యువకులు, రఘునాథపాలెం మండలం బూడిదంపాడు నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి కేలోత్ బాసు, శంకర్ శ్రీను వీరితోపాటు 10 కుటుంబాలు, పరికలబోడు తండా నుండి భన్సిలాల్ ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు చేరారు. ఈ కార్యక్రమంలో చోటా బాబా, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్రంలోని చిన్న చిన్న తండాలను గ్రామాలుగా మార్చి వారి గ్రామాలను వారే పాలించుకునే విధంగా వెసులుబాటు కల్పించిన ఘనత కేసీఆర్ దే అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రఘునాదపాలెం మండలం చింతగుర్తి, కొర్లబోడు తండా, రాంక్య తండా, గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో కూలీలను ఆయన కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రతి గ్రామంలో గ్రామపంచాయతీ భవనాలు, హై-మాస్ట్ లైట్స్, పార్కులు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, సాగు, త్రాగునీరు, పెన్షన్ లు, రైతు బంధు ఇలా అనేక పథకాలు ఇచ్చి వారిని ఆదుకున్నామన్నారు. రఘునాథపాలెం మండలంలో తండాలను గ్రామ పంచయతీలుగా మార్చి గ్రామాలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలను బలోపేతం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. గ్రామాల్లో మళ్లి ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని, చెరువుల్లో, కుంటల్లో, ట్యాంక్‌లలో నీళ్లు ఖాళీ అవుతున్నాయని, కేసీఆర్ కొంచం పక్కకు జరిగితే మళ్ళీ గ్రామాలు వెనుకబడే పరిస్థితికి వచ్చాయన్నారు. కేసీఆర్ ఉన్నపుడు జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ వచ్చిన ఐదేళ్ళలోనే కరువు వచ్చిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు.రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల క్రింద పేదలకు కోట్ల రూపాయలు బాకీ ఉన్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గడచిన నాలుగేళ్లలో ప్రజలకు అందక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారు.. చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడలు వంచి ఇచ్చిన హామీలు నేరవేర్చుకోవాలి అంటే మన బీఆర్ఎస్ అభ్యర్థి నామకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరునాయక్, మాజీ ఏఎంసీ చైర్మెన్ మద్దినేని వెంకటరమణ, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు, హమాలీ, మాజీ ఎంపీపీ శాంత, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, తారా చంద్, సీతారాం, సురేష్, మధ్యా పెంట్య, దేవా, మీటు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నామ గెలుపు కోసం కుమారుడు పృథ్వీతేజ్ ప్రచారం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఈనెల 13న జరుగనున్న పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థిగా పార్లమెంటుకు పోటీ చేస్తున్న నామ నాగేశ్వరావు గెలుపును కాంక్షి స్తూ ఆయన కుమారుడు నామా పృధ్వి తేజ్ మండల నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జమలాపురం, నరసింహపురం, బంజార, కంద్రిక, రేమిడిచర్ల తదితర గ్రామాలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి కర పత్రాలు పంచుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని వారికి వివరించారు. నాలుగు వేల రూపాయల వృద్ధాప్య పెన్షన్ రావడం లేదు మహిళలకు 2500 ఈసారి కాంగ్రెస్ పార్టీ వారి మాటలకు మోసపోకుండా కారు గుర్తుపై ఓటు వేసి నామను భారీ మెజార్టీతో గెలిపిం చాలని అభ్యర్థించారు. తొలుత జమలాపురం శ్రీ వెంక టేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చావ రామకృష్ణ, జెడ్పీటీసీ శీలం కవిత, వైస్ ఎంపీపీ సూరానేని రామకోటేశ్వరరావు, ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, తాళ్లూరి హరీష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు సగ్గుర్తి కిషోర్ బాబు, షేక్ మస్తాన్ వలి, సంక్రాంతి కృష్ణారావు, కొండేపాటి సాంబశివరావు, భాస్కర్ రెడ్డి, బుర్ర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ద్వారానే యాదవులకు గుర్తింపు

- రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి
- అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు మల్లిబాబు యాదవ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం



కాంగ్రెస్ పార్టీ ద్వారానే కురుమ యాదవులకు గుర్తింపు వచ్చిందని, కురుమ యాదవులు కలసి కట్టుగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలని, హస్తం గుర్తుకి ఓటేసి రామ సహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డీసీసీబీ డైరెక్టర్ అఖిల భారత యాదవ మ హాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్ర మైన ఎర్రుపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మొగిలి అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల యాదవ సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి కుటుంబానికి గొర్రెలు ఇస్తానని, పట్టణ ప్రాంతాలలోని కురుమ యాదవులకు పాడి గేదెలు ఇస్తానని హామీ ఇచ్చి గద్దె నెక్కిన కేసీఆర్ కేంద్రం నుంచి వచ్చిన ఎన్సీడీసీ నిధులను వేరే పథకాలకు మళ్లించి తెలంగాణలోని 50 లక్షల మంది ఉన్న కురుమ యాదవులకు దేవుని ప్రసా దం లాగా కేవలం మూడు లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకొని నమ్మక ద్రోహం చేశాడని విమర్శించారు. కురుమ యాదవుల్ని గొర్రెల సంఘాలుగా గుర్తిం చింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని తెలిపారు. దేశంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని అన్నారు. రఘురాంరెడ్డిని గెలిపిం చుకుంటే కేంద్రం నుండి నిధులు తెప్పించు కోవచ్చని, ఎన్ఎల్ఎమ్ లాంటి స్కీములకు కురుమ యాదవులకు ఎలాంటి బ్యాంకు గ్యారంటీ లేకుండా నిధులు మంజూరు చేయించుకోవచ్చు అని అన్నారు. ఈ సమావేశంలో బుర్ర వెంకట నారాయణ, రేఖా నాగరాజు, మెట్టు కృష్ణ, మగినం నాగేశ్వరరావు, బాజీనేని శ్రీను, దుద్దుకూరి తిరుపతిరావు, పోతుమర్తి నాగేశ్వరరావు, రేఖా శ్రీనివాసరావు, వాగదాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడే పార్టీకి మద్దతు

- పలువురు నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా

నవతెలంగాణ-కల్లూరు

గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తూ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కొర్లగూడెం సొసైటీ చైర్మెన్ కీసర వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షులు పాలకుర్తి కృష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షులు పామర్తి కృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి జిల్లా అధ్యక్షులకు రాజీనామా పత్రాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. కార్యకర్తల మనోభావాల మేరకు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు, మా గ్రామ అభివృద్ధికి సహకారం అందించే పార్టీకి మద్దతిస్తామని తెలిపారు. రాజీనామా చేసిన వారిలో నారాయణపురం మాజీ వార్డు సభ్యులు గొల్లమందల రవికాంత్, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, గొల్లమందల రవికాంత్, మారుతి రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు సెడార్ వ్యాలీ స్కూల్ ఆధ్వర్యంలో 'పిల్లల పెంపకం' పై అవగాహన సదస్సు

నవతెలంగాణ-ఖమ్మం

అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 'సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్' వారి ఆధ్వర్యంలో ప్రముఖ క్లీనికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కలిదిండి. కనకదుర్గచే 'పిల్లల పెంపకం' పై తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు 'యాజమాన్యం' శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్క్ స్ట్రీట్ (గొరిల్లా పార్క్) శనివారం సాయంత్రం 6గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. పిల్లలు ఎదిగే క్రమంలో సామాజిక ప్రవర్తనకు కావలసిన శిక్షణ, కుటుంబ. వ్యక్తిగత విషయాలలో తల్లిదండ్రుల , సలహాలు, సూచనలు, విద్యావిషయాలలో సహాయం, సృజనాత్మక, శారీరక ధారుఢ్యం, శ్రమపట్ల గౌరవం, సోషల్ మీడియా, స్క్రీన్ టైం మొదలగు విషయాలలో తగిన సహకారాలు పిల్లలకు అందించడం, బాల్యాన్ని ఒత్తిడి లేకుండా, స్వేచ్ఛాయుతంగా పెంచే విధానాల వంటి పలు విషయాలపై ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్, డాక్టర్ కలిదిండి. కనకదుర్గ చే అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. తల్లిదండ్రులు హాజరై ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం కోరారు.

సీపీఐ(ఎం) నాయకులు భద్రయ్యకు పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మట్టూరి భద్రయ్యని శుక్రవారం సంద్ర వెంకటవీరయ్య మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన మట్టూరి మధుసూదన్‌రావు ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు జడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలేపు రామారావు, దేవరపల్లి భాస్కరరావు, మట్టూరి శ్రీనివాసరావు, మద్దినేని సత్యనారాయణ, చెరుకూరి మోహన్ రావు, మట్టూరి స్టాలిన్ తదితరులు ఉన్నారు.

పేద కళాకారుడికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు దెబ్బ తగిలి ఆర్థిక ఇబ్బందిలో ఉన్న ప్రజా కళాకారుడు సాదు ఇజ్జగిరికి కళాసారధి డాక్టర్ నాగబత్తిని రవి తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. డాక్టర్ నాగబత్తిని రవి తరుపున బోగా గిరి, మిమిక్రి కళాకారుడు సుధాకర్, అజయ్ ముగ్గురు కలసి ఇజ్జగిరి కి సహాయం అందజేశారు. ఏ కళాకారుడు ఇబ్బందిలో ఉన్న నేను ఉన్నాను అంటూ ఆర్థికంగా సహాయం చేసి కష్టాలు తీరుస్తున్న నాగబత్తిని రవికి పలువురు కళాకారులు, కళా సంస్థలు అభినందనలు తెలిపారు.



ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ దాడులపై జిల్లా మంత్రులు స్పందించాలి

- ఆర్ఎంపీ సంఘాల నాయకుల విజ్ఞప్తి

నవతెలంగాణ-ఖమ్మం

గత రెండు రోజులుగా ఖమ్మం నగరంలో ఆర్ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ), టీఎస్ఎంసీలు సంయుక్తంగా చేస్తున్న దాడులపై జిల్లా మంత్రులు స్పందించాలని ఆర్ఎంపీ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మంలో పిల్లలమర్రి సుబ్బారావు అధ్యక్షతన ఆర్ఎంపీడబ్ల్యూఏ, మైనార్టీ, పట్టణ ఐక్యవేదిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాస్ రావు, మైనారిటీ ఆర్ఎంపీల వ్యవస్థాపకుడు నజీర్దున్, అధ్యక్షుడు హసన్, పట్టణ ఐక్య వేదిక అధ్యక్షుడు పిల్లలమర్రి సుబ్బారావు మాట్లాడుతూ తమ కుటుంబాలను పొట్టనింపుకునేందుకు కనీసం మౌళిక వసతులు లేని గ్రామాల్లో గత యాభై సంవత్సరాలుగా పేదప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్న తమపై దాడులు చేస్తూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం సరియైందకాదన్నారు. ఆర్ఎంపీల వ్యవస్థకు నష్టం వాటిల్లే 428 జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. 428 జీవో సవరణ చేసే వరకు దశల వారిగా పోరాటాలు చేస్తామని తెలిపారు.ఆర్ఎంపిల సమస్యలు పరిష్కారం కోసం మూడు సంఘాలు తాత్కాలిక జెఏసి గా ఏర్పాటు చేశామని, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు స్పందించి విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుకు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు నల్లమోతు కోటేశ్వరరావు, మైనారిటీ నాయకులు ప్రధాన కార్యదర్శి జానీమీయా, ఐక్యవేదిక నాయకులు రబ్బానీ, మాధవరెడ్డి, రహీం, గోపాల్, నాగుల్ మీరా, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అవగాహనపై భారీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-మధిర

పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుండి అంబేద్కర్ సెంటర్, వైయస్సార్ చౌరస్తా వరకు శుక్రవారం ఓటర్‌కు ఓటు అవగాహన కార్యక్రమాన్ని తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపాలిటీ సీఏ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ఓటు ప్రాధాన్యతను, ఓటు వేయడంపై అవగాహన, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సేఫివుల్లా, సీఐ మధు , పట్టణ ఎస్ఐ సంధ్య, హెల్త్ అసిస్టెంట్ రేవతి, ఆశ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్ విద్యుత్తు సబ్ స్టేషన్ మరమ్మతులు చేస్తున్నందున ఏదులాపురం, పెద్దతండా, గుర్రాలపాడు, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని సబ్ స్టేషన్ ఏఈ క్రాంతిసింహా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.



కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

- నాయకుల విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్ తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద రోజుకు 400 రూపాయలు ఇవ్వనున్నట్టు తెలిపారు. సమన్యాయం, రైతు న్యాయం, కార్మిక న్యాయం యువ న్యాయం, మహిళా న్యాయం, ఇలా అన్ని రకాల ప్రజలకు మేలు చేకూర్చే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పాపులు, సీనియర్ నాయకులు మారం కరుణాకర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటెముక్కల్ నాగేశ్వర్‌రావు, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

జమ్ము అండ్ కాశ్మీర్ నాయకుల ప్రచారం

నగరంలోని 39వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దోలే లక్ష్మి ప్రసన్న సాయి కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం జమ్ము అండ్ కాశ్మీర్ నాయకులు నస్రీన్ ఖాన్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకిన, డివిజన్ సెక్రటరీ గడ్డం త్రిక్, పట్టణ మైనారిటీ నాయుకులు సయ్యద్ సాదిక్, రవిందర్ రోహిత్, లక్ష్మి, త్రివేణి, ఖాజాభి, జాని తదితరులు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో ప్రచారం

ఖమ్మంలో 9వ డివిజన్లోని కాంగ్రెస్ పార్టీ లోకసభ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డికి మద్దతుగా తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు డివిజన్లోని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు వడ్డేం విజయ్, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గుత్తా సీతయ్య, టీఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి భాస్కరరావు, ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శిలు పారిస్ వెంకన్న, గుండె పిన్ని నాగేశ్వరావు, 9వ డివిజన్ అధ్యక్షుడు కోవెలమూడి జగదీష్, డివిజన్లోని తెలుగుదేశం, కాంగ్రెస్, సీపీఐ(ఎం) కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు కళాజాతాలతో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. లక్ష్మీపురం మాజీ సర్పంచ్ ఓబుల సీతారాంరెడ్డి, ఆయన అనుచరులు, మంగాపురంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు శుక్రవారం డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుజ్జర్లపూడి చింటూ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని మట్టా దయానంద్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. దయానంద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో మంగాపురం గ్రామం బీఆర్ఎస్ అనుకూలంగా ఓటింగ్ వస్తుంది అనుకున్న తరుణంలో గ్రామం నుంచి కాంగ్రెస్ మెజార్టీ రావడం పట్ల శ్రమించి పనిచేసిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న గుజ్జర్లపూడి చింటూను అభినందించారు. ఈ నెల 13న ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : ఇండియా కూటమి సీపీఐ(ఎం) బలపర్చిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పిలుపునిచ్చారు. శుక్రవారం పిండిప్రోలు, వెదుళ్ల చెరువు, రమణ తండా, కేశవాపురం, పాపాయిగూడెం, తెట్టెలపాడు, దమ్మాయిగూడెం ఆయా గ్రామాల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ(ఎం) బలపరిచిన ఇండియా కూటమి అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి కూసుమంచి మండలం స్థానికుడైనందున ఎంపీగా గెలిపిస్తే ఖమ్మం జిల్లాను పాలేరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పాటుపడతాడన్నారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, దొండేటి సుగుణమ్మ, ఖాన్ పార్టీ శ్రీదేవి, ఇప్పల పుష్పవతి, రేపాకుల వెంకన్న, సొంటి వెంకటేశ్వర్లు, దొండేటి నిర్మల్‌రావు, పప్పుల ఉపేందర్, రామనబోయిన రవి, దొడ్డ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పెట్రోల్‌తో దాడి

నవతెలంగాణ-ముదిగొండ

పాత కక్షలు మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై మరొక వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించి తీవ్రగాయాలు చేసిన సంఘటన మండల పరిధిలోని మేడేపల్లిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం...మేడేపల్లి గ్రామానికి చెందిన పోగుల సైదులు, నరసింహారావు అనే వ్యక్తులు అన్నదమ్ములు. ఇరువురు మధ్య గతంలో వివాదాలు చోటు చేసుకోవాగా వారి బాబాయ్ ఉప్పలమ్మ కార్యక్రమానికి భోజనానికి పిలవగా సైదులు నరసింహారావు వెళ్లారు. అక్కడ నరసింహారావు సైదులుపై పెట్రోలు పోసి నిప్పంటించగా ముఖం, నుదుటపై తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని వివరాలు సేకరించి సైదులును చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కల్లుగీత కార్మిక కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో బాణాపురం గ్రామానికి చెందిన మరికంటి నాగేశ్వరరావు అనే కల్లుగీత కార్మికుల కుటుంబానికి ఖమ్మం జాగృత్ ట్రస్ట్ ఫౌండర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్ రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. మరికంటి నాగేశ్వరరావు ఇటీవల తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు తాటిచెట్టు విరిగి కిందపడి మృతి చెందిన విషయం విధితమే. మృతుడు నాగేశ్వరావు భార్య, పిల్లలు ఆర్థిక పరిస్థితి తెలుసుకొని ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్న డాక్టర్ రాజశేఖర్‌గౌడ్‌ను స్థానికులు అభినందించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌సీఓ పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యార్థులకు ఇబ్బందులు
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని మిట్టగూడెం గ్రామంలో గల గిరిజన బాలుర డిగ్రీ గురుకుల కళాశాలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని, విద్యార్థుల సమస్యలపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బి.అభిమన్యు, బి.వీరభద్రం డిమాండ్ చేసారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఓ పక్క డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుంటే ముద్ద గట్టిన పౌష్టిక విలువలు లేని నాసిరకం తిండి తిని విద్యార్థులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజన గురుకులాల అధికారులు కాంట్రాక్టర్ల నుండి పర్సంటేజీలు తీసుకొని విద్యార్థులకు ఎటువంటి నాణ్యమైన వస్తువులు సరఫరా చేస్తున్నారో కనీసం చూడటం లేదన్నారు. జీసీసీ పంపిన బియ్యం బాగోలేవని ప్రిన్సిపాల్ ఆర్‌సీఓకు చెప్పినా కనీసం పట్టించుకోకపోవడం భాదాకరం అన్నారు. కాంట్రాక్టర్లు గురుకులాలకు కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, నిత్యావసర వస్తువులు 3వ గ్రేడ్ క్వాలిటీ సరఫరా చేస్తున్నారని, రోజూ అవసరమైన కోడిగుడ్లు, అరటి పండ్లు, స్నాక్స్ సక్రమంగా సరఫరా చేయడం లేదని వారిపై కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. తక్షణమే ఘటనపై విచారణ జరిపి నాసిరకం నిత్యావసర వస్తువుల సరఫరా చేస్తున్న కాంట్రాక్టలను రద్దు చేయాలని కోరారు. జీసీసీ విద్యార్థులకు పంపే బియ్యం సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకొని పంపాలన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో పలు కుటుంబాలు కాంగ్రెస్లో చేరిక

నవతెలంగాణ-చండ్రుగొండ

మండలంలోని సీతాయిగూడెం గ్రామ పంచాయతీ అధ్యక్షులు కీసరి భద్రయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కాసిని వెంకటేశ్వర్లు, వారి కుటుంబ సభ్యులు, గ్రామ యువత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ జారే కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, శివ, వార్డ్ నంబర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది నిఘా పెంచాలి : తహసీల్దార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

పోలింగ్ తేదీ సమీపించినందున ఎన్నికల నిర్వహణ సిబ్బంది నిఘా పెంచాలని, సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ వి.క్రిష్ణ ప్రసాద్ పోలింగ్ విధులు చేపట్టే సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టార్ అధికారులతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ సమయం ఉదయం 7.00 నుండి సాయంత్రం 4.00 వరకు మాత్రమే అని, ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని, శనివారం సాయంత్రం 4.00 గంటలు నుండి ప్రచారానికి అనుమతులు ఉండవని, మద్యం దుకాణాలు మూసి వేయాలని,అదేవిదంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై నిఘా ఉంచాలని హెచ్చరించారు. పోలింగ్ పూర్తి అయిన తరువాత పోల్ ఈవీఎంలను ఖమ్మంలోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ కాలేజీ వద్దకు తీసుకుని రావాలని సూచించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని ఐదు మండలాల ఎన్నికల నిర్వహణ సెక్టార్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించండి

నవతెలంగాణ-దమ్మపేట

పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీ పార్టీని ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లింగాలపల్లి, గొర్రెగుట్ట, గండుగలపల్లి గ్రామాలలో ఉపాధి కూలీలలను కలిసి రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు పంచుతూ నిర్వహించిన ప్రచారంలో భాగంగా రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్సం ముత్యాలరావు, చాపా ముత్యాలరావు, పండూరి వీరబాబు, వాడే గిరి, ఉపాధి కూలీలు కాక చక్రవర్తి, సోయం సూరమ్మ లక్ష్మి, యశోద, వెంకటమ్మ, పద్మ, సరోజిని, సుశీల, బాలమ్మ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలి

- సీపీఐ(ఎం), కాంగ్రెస్ ఉమ్మడి ప్రచారం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్ష పార్టీలు బలపరిచిన మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సీపీఐ(ఎం) కాంగ్రెస్ పార్టీలో ఆధ్వర్యంలో మహదేవపురం ఉపాధి కూలీలతో పాటు దుమ్ముగూడెం, సీతారాంపురం, బైరాగులపాడు గ్రామాలతో పాటు పలు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పోరిక బలరాం నాయక్ మహబూబాబాద్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశాడన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో హస్తం గుర్తుపై అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఉపాధి కూలీలను ఓటర్లను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, వై.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోడి చంటి, కెల్లా శేఖర్, ఎండి అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు మహబూబాద్ పార్లమెంట్ ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్ కార్యకర్తలతో స్థానిక 22 వార్డులో శుక్రవారం డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి, ఆలేటి కిరణ్ కుమార్, మన్నె మోహన్ రావు, ఆలేటి చిన్ని, ఐలయ్య కాంతం కాంతమ్మ, పోట్ల శ్రీను, మని రాజు, శంకర్, గణేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడిని ఖండించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని బీసి సంఘం తీవ్రంగా ఖండించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాడిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం కమిటీ ముఖ్య సమావేశం జరిగింది. సంఘ కార్యాలయంలో జరిగిన సామావేశంలో నాయకులు మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో భాగంగా బహిరంగ సభలో పాల్గొన్న బీసీల ఆశాజ్యోతి బడుగు బలహీన తాడిత పీడిత బహుజన వర్గాల ఉద్యమ నాయకులు ఆర్.కృష్ణయ్యపై రాళ్లతో దాడి చేసిన వ్యక్తిపై, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మంచి పట్టు కలిగిన బిసి ఉద్యమ శిఖరం పై దాడిని యావత్తు బిసి ప్రజానీకంపై దాడిగా భావిస్తున్నామన్నారు. కృష్ణయ్య పై దాడికి పాల్పడిన గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు మాడిశెట్టి శ్రీనివాస్, జిల్లా నాయకులు బండి రాజు గౌడ్, తూముల శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, కురిమెల్ల శంకర్, భూపతి శ్రీనివాసరావు, గుమలాపురం సత్యనారాయణ, కాసోజు రామాచారి, ఎర్రపాటి కృష్ణ, కటుకూరి రవి, వెంకటేశ్వర్లు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- పోలింగ్ అనంతరం ఈవిఎం యంత్రాల తరలింపుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-పాల్వంచ

లోక్ సభ ఎన్నికల పోలింగ్ పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు లోక్ సభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు శుక్రవారం ముగిసినందున పార్లమెంటు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్‌లను ఎక్స్‌చెంజ్ చేసుకొని, మే 12 నాటికి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నుంచి జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్, నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాల రిపోర్ట్ అందజేయాలని, పోస్టల్ ఓట్ల నమోదు సంబంధిత సమాచారం వివిధ రాజకీయ పక్షాలకు తెలియజేయాలని, పోస్టల్ బ్యాలెట్‌లను పార్లమెంటు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాల స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టంగా తరలించి భద్రపర్చాలని అన్నారు.

ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని, సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు.

పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు వార్త పత్రికలలో జారీ చేసే ప్రకటనలకు తప్పని సరిగా జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయం ముగిసిన తరువాత ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చూడాలని, వాటిపై సీ విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలలో తనిఖీలు ముమ్మరం చేయాలని, ముఖ్యమైన కూడలీలలో, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంచాలని అన్నారు.

పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని, పోలింగ్ బృందాలకు పోలింగ్ సామాగ్రి అందజేసి వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు మే 12 సాయంత్రం నాటికి చేరుకోవాలని అన్నారు.

మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహించాలని, మాక్ పోల్ అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం వివరాల నివేదికను సమర్పించాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వెబ్ క్యాస్టింగ్, సిసి కేమేరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

సెక్టార్ అధికారులు రిజర్వ్ ఈవీఎం యంత్రాలతో సన్నద్ధంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ సమయంలో ఈవీఎం యంత్రాలు మరమ్మత్తుకు గురైతే వెంటనే రీప్లేస్ చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఉండాలని అన్నారు.

పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ వరకు ఈవీఎం యంత్రాల తరలింపు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో ఈవిఎం యంత్రాలను భద్రపరిచి సీల్ చేయాలని అన్నారు.

వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ ప్రియాంక అలా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం నిర్వహించే మాక్ పోల్ నివేదిక, ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం నివేదికలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు.

ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు మధు, దామోదర్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపరెంటెంట్ ధారా ప్రసాద్, సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు

- ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సృష్టిలో అమ్మను మించిన దైవం ఏదీ లేదని ప్రేమను పంచాలన్నా, దండించాలన్నా, దగ్గర తీసుకోవాలన్నా తల్లికి మాత్రమే దయ గుణం కలిగి ఉంటుందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ కార్యాలయంలో వివిధ విభాగాలలో పని చేసే మహిళా ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మహిళలందరికీ అంతర్జాతీయ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ తల్లి ఒడి అనేది వెలకట్టలేనిదని, తండ్రి సంపాదిస్తే తల్లి అనేది ప్రేమను పంచుతుందని మనకు ఏమి కావాలన్నా తల్లిని తప్ప తండ్రిని అడగమన్నారు. ఏ కార్యం ప్రారంభించిన ముందుగా తల్లి దీవెనలు తీసుకుంటామన్నారు. మనకు జన్మనిచ్చిన తల్లిని మన కోసం ప్రయోజకులు కావడానికి ఎంత కష్టపడిందో ఆమె బతికున్నంత వరకు బాగా చూసుకున్నప్పుడే మన జన్మకు సార్థకత లభిస్తుందని ఆయన అన్నారు. అనంతరం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల సమక్షంలో కేకులు కట్ చేశారు.

ఈ కార్యక్రమంలో డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకురాలు ప్రమీల బాయ్, సంధ్య, సులోచన, మాధవి, వివిధ విభాగాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా ...

మిత్రపక్షాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచల పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు బలపరుస్తున్న మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కోరుకుంటూ 500 బైక్‌లతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని భద్రాచల శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ జెండాను ఊపి ప్రారంభించగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీలో ఎస్ఎస్‌యుఐ, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్, ఎలక్ట్రీషన్ యూనియన్‌ల ఆధ్వర్యంలో యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బలరాం నాయక్ గెలుపు భద్రాచలం అభివృద్ధికి మలుపు అంటూ చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి అనే నినాదంతో భద్రాచలం పురవీధులలో నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రతి ప్రాంతంలో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లం వెంకటరావు మాట్లాడుతూ... భద్రాచలం నియోజకవర్గం సంపూర్ణంగా అభివృద్ధి కావాలంటే ఎమ్మెల్యేతో పాటు ఎంపీ కూడా కాంగ్రెస్ పార్టీ వాడై ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని ఆ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా యువత కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని రాహుల్ గాంధీని ప్రధాని చేయడం కోసం యువత ముందుకు వస్తున్నారని స్పష్టం చేశారు.

ఈ బైక్ ర్యాలీలో టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి నున్నే రామకృష్ణ, తోటకూర రవిశంకర్, భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, సీపీఐ(ఎం) నాయకులు వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండశెట్టి కృష్ణమూర్తి, అరికెల తిరుపతిరావు, రత్నం, రమాకాంత్, తాళ్లపల్లి రమేష్ గౌడ్, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, బంటోతుల రాజీవ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాసముల రాము, తాండ్ర నరసింహారావు, నర్రా రాము, నాగేంద్ర, రాగం సుధాకర్, గండేపల్లి హనుమంతరావు, దుద్దుకూరు సాయిబాబా, యూత్ నాయకులు గాడీ విజయ్, ఆకుల వెంకటరమణ, భాను, మహిళా కాంగ్రెస్ నాయకులు రూపా దేవి తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ రాష్ట్ర నాయకులు బందెల నర్సయ్య మృతి

- ఎమ్మెల్యే కూనంనేని నివాళి
- బందెలకు కన్నీటి వీడ్కోలు పలికిన సీపీఐ శ్రేణులు



నవతెలంగాణ-కొత్తగూడెం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బందెల నర్సయ్య (64) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు ఝామున హైద్రాబాదులోని ఓ ప్రైవేటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతదేహాన్ని ఆయన స్వగృహం చుంచుపల్లి మండలం, రుద్రంపూర్ ఏరియాకు తీసుకువచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల నాయకులు బందెల మృత దేహంపై పార్టీ జెండాను, పూలమాలను ఉంచి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతంలో పార్టీ విస్తరణకు ఎనలేని కృషి చేశారన్నారు. సింగరేణి వర్కర్స్ యూనియన్ నాయకుడిగా, ప్రజా నాయకుడిగా, దళిత సంఘం నాయకుడిగా భాధ్యతలు నిర్వహిస్తూ సేవకే అంకితమయ్యాడన్నారు.



అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు బందెలకు కన్నీటి వీడ్కోలు పలికారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, రంగయ్య, సలీం, నరాటి ప్రసాద్, పుల్లారెడ్డి, సారయ్య బ్రహ్మం, వాసిరెడ్డి మురళి, దమ్మాలపాటి శేషయ్య, గనిగళ్ల వీరాస్వామి, దమ్మాలపాటి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పించిన ఎంపీ అభ్యర్థి ఆర్ఆర్ఆర్

ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి విషయం తెలుసుకొని రుద్రంపూర్‌లోని వారి గృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఐఎన్‌టీయుసి నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) శంకర్ నాయక్, ఐఎన్‌టీయుసి కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ. రజాక్, కాలం నాగభూషణం, మాజీ ఎంపిపి సలిగంటి శ్రీనివాస్, జి.వీరాస్వామి, రాజేశ్వరరావు, గోపి కుమార్, సకినాల సమ్మయ్య, మోహన్ రెడ్డి, కుమార్, సంజీవ్, అనుకు రాజ్, రమేష్, సిపి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభం నాటికి వసతి సౌకర్యాలు కల్పించాలి : పీఓ

- ఎల్చిరెడ్డి పల్లి ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్ పైన ఆగ్రహం



నవతెలంగాణ-పినపాక

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించే నాటికి అన్ని వసతీ సౌకర్యాలు సమకూర్చే విధంగా స్పెషలాఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలకు సెలవులు ఇచ్చినప్పటినుండి పాఠశాలను, తరగతి గదులను శుభ్రం చేయకుండా ఉండడంతో సంబంధిత హెచ్ఎం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున ఈ నెల 20వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి కావాలని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కింద పడుకోకుండా డబుల్ కాట్ మంచాలు కట్ చేయించి ప్రతి విద్యార్థి మంచాల మీదే పడుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని వంట గదులు, డబుల్ కాట్ మంచాలు, గోడలకు జరుగుతున్న ప్యాచ్ వర్క్‌లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్/ఉద్యానవన అధికారి అశోక్, ఎల్చిరెడ్డిపల్లి పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిదే గెలుపు...

- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ర్యాలీ
- ఇండియా కూటమిని గెలిపించండి
- మంత్రి తుమ్మల



నవతెలంగాణ-మణుగూరు

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం హనుమాన్ టెంపుల్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో జరిగిన సభలో అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర పన్నుతున్నాయి అన్నారు. ఈడీ, ఇన్కమ్ టాక్స్, సీపీఐ దాడులకు పాల్పడుతుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలో లోపాయ కార ఒప్పందంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. బలరాం నాయక్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న కాలంలో రెండు కోట్ల రూపాయలతో పినపాక నియోజకవర్గం అభివృద్ధి చేశామని అభ్యర్థి తెలిపారు.

పినపాక శాసనసభ్యులు పాయ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మిత్రపక్షాల సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కోడిశాల రాములు , కార్యదర్శివర్గ సభ్యులు ఉపతల నరసింహారావు, మడి నరసింహారావు, లక్ష్మణరావు, రాజు, సరెడ్డి పుల్లారెడ్డి, వాసిరెడ్డి, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రఘురాం రెడ్డి గెలుపు కోసం కూనంనేని ప్రచారం

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-కొత్తగూడెం

ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ స్థానం నుంచి సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్, మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి విజయాన్ని కంకిస్తూ కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. కొత్తగూడెం పట్టణంలోని కూలిలైన్, జీఆర్ బస్తి, హనుమాన్ బస్తి, బూడిదగడ్డ తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, అభ్యర్థితో కలిసి ఇంటింటి ప్రచారంలో కూనంనేని పాల్గొన్నారు. ప్రచారంకోసం వచ్చిన రఘురాం ఒడ్డికి, కూనంనేనికి బస్తీల్లోని మహిళలు పెద్దఎత్తున స్వాగతాలు పలికారు. ఈ సందర్భంగా బస్తి సెంటర్లలో జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, మత రాజకీయాలతో, కార్పొరేట్ విధానాలతో బిజెపి ప్రభుత్వం కాలం వెల్ల దీసిందన్నారు. ఆచరణ సాధ్యంకానీ పథకాలతో, అవినీతితో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, ఎల్ గోపాల కృష్ణ, సిపిఐ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ గెలుపు నల్లేరుపై నడక : ముస్లిం ఐక్యవేదిక

ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెసు అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి, (ఆర్ఆర్ఆర్) గెలుపు తధ్యమని ముస్లీం ఐక్య వేదిక స్పష్టం చేసింది. లక్ష్మీదేవి పల్లి మండలం మధువన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనంలో రామ సహాయం రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ముస్లిం నాయకులు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కేవలం నల్లేరుపై నడక మాత్రమేనని, మెజారిటీ కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని. ముస్లిం సోదరీ సోదరీమణుడు ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీకి వెన్నంటే ఉంటారన్నారు. ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు, రామసహాయం మాట్లాడారు.

గనుల మీద ప్రచారం..

కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్, జీఎం కార్యాలయం నందు ఐ ఎ న్ టీ యు సీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ఆధ్వర్యంలో మిత్రపక్షాలు బలపరుస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి పాల్గొని, వర్క్ షాప్ నందు ఉద్యోగుల పని స్థలాలకు వెళ్లి ఉద్యోగులతో మిషనరీ, పంపులు, ఎలక్ట్రికల్ మోటర్ల సంబంధించిన వివరాలు ఉద్యోగులతో వివరంగా మాట్లాడారు. అలాగే ఎస్అండ్‌పీసీ, ఆర్‌సీహెచ్‌పీ, జీకే ఓసీ స్టోర్స్ నందు ఐఎన్టియుసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, ఉద్యోగులను కలుసుకొని కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డికు భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేయాల్సిందిగా ప్రతి ఒక్క ఉద్యోగిని కలుసుకొని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, డాక్టర్ శంకర్ నాయక్, కోనేరు సత్యనారాయణ (చిన్ని), కాలం నాగభూషణం, గుత్తుల సత్యనారాయణ, బుట్టిక రాజేశ్వరరావు, టీజేఎస్ నాయకులు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.కె. గౌస్, ఫిట్ కార్యదర్శిలు గోపు కుమార్ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వాడల్లో ఎన్నికల ప్రచారం...

మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 6, 7, 11, 12వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి హస్తం గుర్తుకు ఓటేయాలని గోపాల్ రావు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి కనకరాజు, కొప్పారపు వీరబాబు, బాల శౌరి, తాండ్ర నాగబాబు, కౌన్సిలర్ తంగెల లక్ష్మణ్, పల్లపు లక్ష్మణ్, తమ్మ రాఘవ, నిరంజన్ రెడ్డి, దుర్గా రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి..ప్రజా సంక్షేమం

యూత్ కాంగ్రెస్ సభ్యులు ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో క్రియాశీలకం కావాలని కొత్తగూడెం అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం రాజశేఖర్, మాజీ ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు గిరీష్ ముక్తివి కోరారు. శుక్రవారం స్తానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కంది శివ, యువ నాయకుడు వేముల సాయి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాలి :డీఎస్పీ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



పోలీస్ అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రక్రియ శాంతియుత వాతావరణంలో సజావుగా సాగేలా చూడాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా అపరిచిత వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలు తరలించి సమయంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు జాగ్రత్తగా నిర్వహించాలని చూసించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఉపాధి బాట పట్టిన నాయకులు

- పని ప్రదేశాల్లో ప్రచారం
- పోటాపోటీగా మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ

నవతెలంగాణ - అశ్వారావుపేట

ఎన్నికల ప్రచారం శనివారం యుగియనుండడంతో నాయకులు ఎన్ని కళలు ప్రదర్శించాలో అన్నింటిని చాకచక్యంగా ప్రదర్శిస్తున్నారు. ఉపాధి కూలీలే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు కూలీలు కంటే ముందే ఉపాధి పని ప్రదేశాలకు చేరుకుంటున్నారు. ఎన్నికల కరపత్రాలు, నమూనా బ్యాలెట్ వెంట తీసుకెళ్ళి కూలీలకు ఒకరు కొరకు పోటీగా మజ్జిగ, సీతలా పానీయాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 46 వేలు పై చిలుకు ఓటర్లు ఉన్నారు. ప్రతీ పార్టీ, నాయకులు రోజు వారీ ఉపాధి కూలీకి వెళ్ళే 3 వేలు పై చిలుకు ఓటర్లను మాత్రమే ఓట్లు అడుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఒకరు మజ్జిగ ఇస్తే మరొకరు కూల్ డ్రింక్స్ ఇస్తున్నారు. అంటే ఆయా నాయకులు ప్రచారం చేస్తూ ఫొటోలకు ఫోజులు ఇచ్చే ప్రాధాన్యత నిజంగా పార్టీ కోసం, దాని విజయం కోసం ఇవ్వడం లేదేమో అనిపిస్తుందని కూలీలే వ్యాఖ్యానిస్తున్నారు.

భారత రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రయత్నం

నవతెలంగాణ-చంద్రుగొండ

పార్లమెంటు ఎన్నికలలో మతోన్మాద బీజేపీ దాని మిత్రపక్షాలను చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోతు ధర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రుగొండ, తిప్పనపల్లి దాసు తండా, సత్యనారాయణపురం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచార నిమిత్తం గ్రూప్ మీటింగ్లు కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు నిరుపేదలు జీరో ఎకౌంట్లు తెలుసుకుంటే 15 లక్షల ఎకౌంట్లో వేస్తానని నల్లధనాన్ని వెలికి తీస్తానని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ధరలు తగ్గిస్తానని హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయడంలో వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌డి రజాక్, దాసు, బాలు ప్రసాదు, అక్బర్ మల్లేష్ పుల్లయ్య, నాగలక్ష్మి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మలేరియా నిర్ధారణ శిబిరం

- డాక్టర్ లు రాందాస్, మధులిక

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని వినాయక పురం, గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం మలేరియా నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్స్ రాందాస్, మధులికలు తెలిపారు. రెండు ఆసుపత్రుల వైద్యారోగ్య సిబ్బంది సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఉడుంల బండ, పెద్దమిద్దె, రాళ్ళు వాగు, గోగులపుడిలలో మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఏ ఒక్కరికి మలేరియా నిర్ధారణ కాలేదు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వడదెబ్బ కారణంగా జ్వరం వచ్చే అవకాశం ఉందని, వేడి గాలులు, వడగాల్పులు అధికంగా ఉన్న పరిస్థితుల్లో ఉదయం 10 లోపు, సాయంత్రం 4 తర్వాతనే ప్రజలు వారి పనులు నిర్వహించుకోవాలని, అధిక మొత్తంలో నీటిని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ రాజు, హెచ్ఎస్ శ్రీనివాస్, ఎంటీఎస్ విజయారెడ్డి, హెచ్‌ఏ లు రవి, ప్రసాద్, సతీష్, గోపాల్, సత్యనారాయణ, పి.వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గులాబీ పార్టీకి కౌన్సిలర్లు మట్టా, వేములపల్లి రాజీనామా

నవతెలంగాణ-సత్తుపల్లి

బీఆర్ఎస్ పార్టీకి మున్సిపల్ కౌన్సిలర్లు మట్టా ప్రసాద్ (4వ వార్డు), వేములపల్లి పుష్పలత (17వ వార్డు) శుక్రవారం తమ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరితో పాటు మాజీ కౌన్సిలర్ వేములపల్లి మధు, మట్టా ప్రసాద్ అనుచరులు, యూత్ సభ్యులు మట్టా సత్యప్రసాద్, కొంగర రమేష్, మిరియం మధు, కొండపల్లి క్రాంతి రెడ్డి పంతంగి వెంకటేశ్వరరావు, గౌసుద్దీన్ తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి తమ మద్దతు ప్రకటిస్తూ ఆయన విజయానికి కృషి చేస్తామని కౌన్సిలర్ మట్టా ప్రసాద్, మాజీ కౌన్సిలర్ వేములపల్లి మధు శుక్రవారం సాయంత్రం ప్రసాద్ నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు.

బలరాం నాయక్ ను గెలిపించండి : మచ్చ రామారావు

నవతెలంగాణ-చర్ల

ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) బలపరిచిన ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బిఎస్ రామయ్య భవన్లో ఆ పార్టీ నాయకులతో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కమిటీ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీతో ఏర్పడిన పొత్తులలో భాగంగా ప్రతి ఒక్క కార్యకర్త బలరాం నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పునర్ఘాటించారు. మతోన్మాద బిజెపిని గద్దె దించాలని ఏర్పడిన కూటమిలో సీపీఐ(ఎం) ప్రధాన భూమిక పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పొడుపు గంటి సమ్మక్క, బందెల చంటి, పామారు బాలాజీ, వరదల వరలక్ష్మి దొడ్డి హరినాగ వర్మ, పలక సూరమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో దుక్కిటెద్దు మృతి

నవతెలంగాణ- పాల్వంచ రూరల్

మండల పరిధిలోని బిక్కు తండా గ్రామంలో భూక్య స్వాములుకు చెందిన రెండు ఎద్దులు, భూక్య వీరన్నకు చెందిన ఒక ఆవు, ధరావత్ పాపాలాలు పొలంలో మేతకు వెళ్లి తెగిపడిన విద్యుత్ వైర్ తగిలి కరెంటు షాక్ తో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. వరి పొలంలో విద్యుత్ వైర్లు కిందకు ఉండటంతో 10 రోజుల క్రితం వరి కోత కోసేటప్పుడు వరి కోత యంత్రం తగిలి మంటలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. రైతు అనేకసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. తొలకరి వర్షాలు కురిసి వ్యవసాయం ప్రారంభం సమయంలో దుక్కి దున్నే ఎద్దులు చనిపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

భార్యాభర్తల మధ్య వివాదం

- పెట్రోలు పోసుకొని భర్త ఆత్మహత్యాయత్నం
- మంటలు ఆర్పి కాపాడిన పీసీ మనోజ్

నవతెలంగాణ - అశ్వారావుపేట



భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం క్షణికావేశానికి లోనైన భర్త పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో మంటలు ఆర్పి ప్రాణాపాయం నుండి కాపాడిన వైనం శుక్రవారం అశ్వారావుపేట లో చోటు చేసుకుంది. అశ్వారావుపేట పంచాయతీ పరిధిలోని నందమూరి కాలనీలో శుక్రవారం భార్య, భర్తల మధ్య ఘర్షణ జరిగింది. భార్యపై కోపంతో క్షణికావేశానికి గురైన రాహుల్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నంనకు ప్రయత్నించాడు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పీసీ మనోజ్ మంటల్లో చిక్కుకున్న రాహుల్ పై అందుబాటులో ఉన్న ఇసుక పోసి మంటలు ఆర్పాడు. హుటాహుటిన అంబులెన్స్ సహాయంతో హాస్పిటల్‌కు తరలించాడు. తన వృత్తి ధర్మాన్ని నిర్వహించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ మనోజ్‌ను పోలీస్ సిబ్బందితో సహా పలువురు అభినందిస్తున్నారు.

మన్యంలో మళ్లీ మారణ హోమం

బీజాపూర్ అడవుల్లో ఎదురు కాల్పులు

- 13 మంది మావోయిస్టులు మృతి..?
- ఇద్దరు జవాన్లకు గాయాలు
- వరుస ఎన్‌కౌంటర్లతో పారుతున్న రక్తపు టేర్లు

నవతెలంగాణ-చర్ల

గత నెలలో 16 , 24, 29 తారీకులలో జరిగిన వరస ఎన్కౌంటర్ లు మరవక ముందే మళ్లీ మన్యంలో మారణ హెూమం జరిగింది. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి పీడియా దండకారణ్యంలో శుక్రవారం ఉదయం 6 గంటల నుండి రాత్రి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో సుమారు 13 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తుంది. పీడియా దండకారణ్యంలో మావోయిస్టులు తలదాచుకున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఇటు బీజాపూర్ జిల్లా అటు దంతేవాడ, సుక్మా జిల్లాల ఎస్పీలు జితేంద్ర కుమార్ యాదవ్, గౌరవ్ రాయ్, కిరణ్ చౌహన్ పక్కా పథకం ప్రకారం సుమారు 1200 మంది పోలీసులను అడవులను జల్లెడ పట్టెందుకు గురువారం పంపించారు. ఈ క్రమంలో పీడియా గుట్టల వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్న మావోయిస్టులు తారసపడగా లొంగిపొమ్మని ఎంత హెచ్చరించినా లొంగిపోకుండా విచక్షణారహితంగా జవాన్లపై కాల్పులు జరపగా భద్రతా బలగాలు సైతం ఆత్మ రక్షణ కోసం ఎదురుదాడికి దిగగా ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన కాల్పుల్లో హార్డ్ కోర్ మావోయిస్టు కమాండర్ లింగ, పాపారావు సహా పెద్ద నాయకులు ఈ కాల్పుల్లో పాల్గొన్నట్లు తెలుస్తుంది. డీకే ఎస్‌జెడ్‌సి, డివిసిఎం, ఏసిఎం క్యాడర్ గల మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తుంది. ఎస్‌టిఎఫ్ సిబ్బంది ఘటనా స్థలంలో అన్వేషించగా భారీగా మందు సామగ్రి స్వాధీనపరచుకున్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. కాగా ఇద్దరు జవాలకు సైతం తీవ్ర గాయాలైనట్లు తెలుస్తుంది. ఎన్నికల వేళ మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ తగులుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. కాగా బీజేపీ నూతనంగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దగ్గర నుండి ఇప్పటి వరకు సుమారు 90 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికే దిక్సూచి

- నియంతృత్వ పోకడలకు పోతున్న బీజేపీని ఓడించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య
- ఈ సారి బీజేపీ వస్తే దేశ సమఖ్యతకు ముప్పు
- జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-చంద్రుగొండ



ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పోకడలకు పోతున్న బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి ఐలూరి రామ్ రెడ్డి అధ్యక్షతన అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐలయ్య మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ సహాయం రఘురాంరెడ్డి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, పదేండ్ల మోడీ పాలన ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకిక విలువల మీద దాడి చేస్తుందన్నారు. మతం పేరుతో, రాముడు పేరుతో ప్రజల దృష్టిని మరస్తూ, మత ప్రతిపాదికన ప్రజల మధ్య విభజన సృష్టిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ఈసారి మళ్లీ అధికారంలో వస్తే రాజ్యాంగాన్ని రద్దుచేసి మత రాజ్యం సృష్టించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో భువనగిరి స్థానం తప్ప మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ ఈసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే దేశ సమైక్యతకే ముప్పు ఏర్పడుతుందని, ఇంతటి ప్రమాదాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మీదనే ప్రధానమైన దాడిని ఎక్కిపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో కూలిపోతుందని ప్రకటిస్తున్నారు. బీజేపీని దాని మిత్రపక్షాలను గద్దె దించడానికి సీపీఐ(ఎం) బలపరిచిన ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను కార్పోరేటీకరించేందుకు వేగంగా ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, అన్నపురెడ్డిపల్లి మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, మండల కమిటీ సభ్యులు పెద్దిని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా, రామడుగు వెంకటాచారి, కాక సీత, గోగుల తిరుమలరావు, సభ్యులు నాగుల్ మీరా, అబ్దుల్ రెహమాన్, చల్లపల్లి రాజా, ఖమ్మంపాటి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే 72 గంటలు నిఘా మరింత పటిష్టం

నవతెలంగాణ-చర్ల



ఈనెల 13న జరిగే ఎన్నికల నేపథ్యంలో రానున్న 72 గంటల్లో భద్రత మరింత పటిష్టంగా పెంచి ఓటర్లకు నగదు, వస్తువుల పంపిణీని అడ్డుకోవాలని, సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్ కుమార్ గోపాల్ అన్నారు. శుక్రవారం చర్ల మండలంలోని ఎస్ఎస్‌టీ అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్ట్‌లోని రికార్డులను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ 72 గంటల ముందు నుంచి అనుసరించాల్సిన విధివిధానాలపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసినందున, సరిహద్దు చెక్పోస్టులలో పనిచేస్తున్న సిబ్బంది నిఘాను మరింత కట్టిదిట్టం చేయాలని అన్నారు. అభ్యర్థులు చేసే ఖర్చులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారి రికార్డులను పరిశీలిస్తూ ఉండాలని, నగదు, బహుమతుల పంపిణీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు వాటికి సంబంధించి వచ్చే ఫిర్యాదుల పైన స్పందించి పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. అలాగే ఫంక్షన్ హాల్, సామాజిక భవనాలు అతిథి గృహాలు, ధర్మశాలలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. జిల్లా సరిహద్దులలోని అంతర్రాష్ట్ర చెక్పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని, మద్యం తదితర రవాణాను అడ్డుకునేందుకు కట్టుదిట్టంగా వ్యవహరించాలని, తనిఖీల విషయంలో అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు 48 గంటలకు నిశ్శబ్ద సమయంగా పరిగణలోకి తీసుకున్నందున ఎలాంటి ప్రచారాలకు అవకాశం ఇవ్వకూడదని, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన పక్షంలో సర్వే బృందాలు కఠినంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఈ మూడు రోజులు సర్వే బృందాల పనితీరు చాలా పకడ్బందీగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం ప్రదర్శించిన ఆ బృందాలపై ఎన్నికల నియమ నిబంధన ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. చెక్పోస్ట్ ల దగ్గర ప్రతి వాహనాన్ని చెక్ చేసి తప్పనిసరిగా వీడియో కవరేజ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌సీ పరితోస్ పంకజ్, ఏఈఓ వెలుపుల శ్రీనివాస్, లైజనింగ్ ఆఫీసర్ పృథ్వీరాజ్, ఎస్ఎస్‌టి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నాగేశ్వరరావు, ఎస్ఎస్‌టీ సర్వే టీం సభ్యుడు శ్రీనివాస్, సీఐ రాజీవ్ వర్మ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు తీర్చడంలో మా వంతు సహకరిస్తాం..

- ఎన్నికల్లో పాల్గొనాలి : సీఐ
- ససేమిరా అంటున్న పెద్ద వెంకటాపురం ఓటర్లు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



గ్రామ సమస్యలు తీర్చడంలో పోలీస్ శాఖ తరుపున మా వంతు ప్రజలకు అనునిత్యం సహకరిస్తామని, పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయతీ ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని టేకులపల్లి సీఐ టి.సురేష్, ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ కోరారు. గురువారం మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయతీ ప్రజలు పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం పోలీసులు పెద్ద వెంకటాపురం గ్రామంలో ప్రజలతో ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలు రోడ్డు, త్రీ ఫేస్ కరెంట్, తాగునీరు, రెండు పంటలు పండించే విధంగా రైతులకు సాగునీరు, సెల్ టవర్ ఏర్పాటు, అంగన్వాడీ నూతన భవనం ఏర్పాటు.. తదితర వాటిని పరిష్కరించడానికి మీతో పాటు పోలీస్ శాఖ తరుపున జిల్లా అధికారుల దగ్గరకు తీసుకెళ్తామని చెప్పారు. గత దశాబ్దాలుగా నెలకొన్న గ్రామ సమస్యలు ఉన్నఫళంగా రెండు మూడు రోజుల్లో పరిష్కరించబడవని వివరించారు. సమస్యల ఏదైనా దానిని గుర్తించి, ఓ ప్రణాళిక బద్ధంగా చేస్తే పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని భరోసా కల్పించారు. సమస్యలకు పరిష్కరించే అధికారిని కలిసి అడిగితే గ్రామ సమస్యలు ఏవైనా తీరుతాయని ధైర్యం చెప్పారు. గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామం తరుపున దొర, పటేల్, సర్పంచ్, ముఖ్య నాయకులు వస్తే ఐటీడీఏ పీవో దగ్గరకు మా సొంత ఖర్చులతో తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. తప్పకుండా ప్రతిఒక్కరూ పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొని ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

మా పెద్ద వెంకటాపురం గ్రామం పంచాయతీలో 272 కుటుంబాలు, సుమారు 600 ఓటర్లు ఉన్నారని, కానీ గత కొన్ని దశాబ్దాలుగా మా గ్రామ ప్రజలు రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో సరైన వైద్యం అందక అనేక మంది మృత్యువాత పడ్డారని, దాంతో చాలా కుటుంబాలు వీధిన పడ్డాయని గ్రామస్తులు వాపోయారు. అలాగే తాగటానికి సరిపడా మంచినీళ్ళు, రెండు పంటలు పండించే విధంగా సాగు చేసుకునేందుకు నీటి సౌకర్యం లేక కుటుంబ పోషణ భారంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ చేసుకోవడానికి సరైన సాగు భూమి మా ఆదివాసీ గిరిజనులకు లేదంటే స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు మీ పెద్ద వెంకటాపురం గ్రామం ప్రజలు ఎవరైనా సుమారు ఏడున్నర ఎకరాల భూమిని ఫారెస్ట్ శాఖకు ఇస్తే గాని గ్రామానికి త్రీ ఫేస్ కరెంట్ సమస్య పరిష్కారం కాదని చెప్తున్నారని.. గ్రామస్తులు పోలీసులతో గోడును వెలిబుచ్చారు. గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించనంతవరకు ససేమిరా ఈ ఎన్నికల్లో పాల్గొనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బలరామ్ నాయక్ గెలుపును కాంక్షిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ పార్టీల ప్రదర్శన

నవతెలంగాణ-ఇల్లందు



ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి పోరిక బలరామ్ నాయక్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆమ్ బజార్ లో ప్రచారం చేశారు. ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం జరిగిన సభలో కే సారయ్య, అబ్దుల్ నబి, ముద్రగడ వంశీ మాట్లాడారు.

బీజేపీని ఓడిద్దాం..

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు

సీపీఐ(ఎం), సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గుర్తు హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండలం ఉపాధి పని ప్రాంతంలో పుష్కరాల అడివిలో శుక్రవారం పనిచేస్తున్న ఉపాధి కార్మికులతో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పనిని పూర్తిగా తొలగించాలని కుట్ర చేస్తుందని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల్లో పేదరికం తగ్గించమని 25 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుండిపైకి తెచ్చామని చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. రెండో వైపు 81 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని మోడీ ప్రకటించారని ఆయన అన్నారు. పేదరికం తగ్గితే బియ్యం పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో మోడీనే చెప్పాలని ఆయన అన్నారు. దేశంలోనే 100 కోట్ల జనాభా పోషకాహారం తీసుకునే స్థితిలో లేరని ఐక్యరాజ్యసమితి చెబుతుందని ఆయన అన్నారు. బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకులు జహీర్ పాషా, సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు పాపినేని సరోజన, బత్తుల ద్రౌపతి,భుక్య శాంతి, బత్తుల శ్రీను, బోరం లక్ష్మీ కాంత, శివ, గళ్ళ అరుణ బత్తుల రామ దేవి కవిత బోరం పుల్లమ్మ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ రోహిత్ రాజు
- సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్

నవతెంగాణ-కొత్తగూడెం

ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుండి కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. పోలింగ్‌కు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుకోవాలన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పి విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజు, సీఐలు,ఎస్సైలు, సిబ్బంది మొత్తం 200 మంది పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచిన మోడీని ఓడిద్దాం

- టీజేఎస్ రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం, నిమ్మల రాంబాబు

నవతెలంగాణ-పాల్వంచ

కర్మాగారాలను అమ్మి నిరుద్యోగాన్ని పెంచిన మోడీని ఓడిద్దామని టీజేఎస్ రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం, నిమ్మల రాంబాబు పిలుపునిచ్చారు. బహుజన ఐక్య వేదిక కార్యాలయం పాల్వంచలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రధాని మోడీ 10 సంవత్సరాల పాలనలో కర్మాగారాలను ప్రయివేటుకు అమ్మట వల్ల దేశం ఆర్థికంగా వెనుకబడి రూపాయి విలువ పడిపోయి యువతకు ఉద్యోగాలు రాక నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. మోడీ పాలనలో మహిళలను నగ్నంగా ఊరేగించి చంపటం, పేదలకు సంపదను, విద్యా, వైద్యాలను అందకుండా చేసి బానిసలను చేయటం, ఆర్థిక నేరాలు చేసిన వారిని, గూండాలను కేంద్రంలో మంత్రులను చేయటం, మతాలను రెచ్చగొట్టి జనాలను చంపి భయభ్రాంతులను గురి చేశారన్నారు. ఈ సమావేశంలో శ్రీపాద సత్యనారాయణ, నబీ, నిమ్మల రాంబాబు, మంజూర్ ఆలీఖాన్, మూర్తుజా, ఎస్.ఏ రెహమాన్, ఖాజామియ, శనగ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర కల్యాణం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల పరిధిలోని బైరగులపాడు గ్రామంలో వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ భూనిల సమేత సంకటహర వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని కనులారా చూసి తరించేందుకు అశేష భక్త జనం తరలివచ్చింది. కల్యాణాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున 4.30 గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. 10 గంటలకు శ్రీ భూ నీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ తంతును అర్చకులు ఆరుట్ల రాజగోపాలాచార్యులు, భీష్మాచార్యులు, వెంకట నరసింహచార్యులు దగ్గరుండి స్వామి కళ్యాణాన్ని నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, అనంతరం జరిగిన మాంగల్య ధారణ జరిగింది.

పెరిగిన 3,213 ఓట్లు

- నియోజక వర్గం కేంద్రంలోనే అధికం - ఫలితాలుస్తున్న ఎన్నికల సంస్కరణలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

గతేడాది 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుతం 2024 మేలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్లు నమోదులో పెరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజక వర్గంలో 1,55, 961 మంది ఓటర్లు ఉండగా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ నియోజక వర్గంలో 1,59, 174 ఓటర్లు నమోదు అయ్యారు. ఈ అయిదు నెలల్లో 3,213 మంది కొత్తగా తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఈ పెరుగుదల నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలంలో అధికంగా కనిపిస్తుంది. ఈ మండలంలో మిగతా నాలుగు మండలాలు కంటే అధికంగా 1,212 మంది తమ ఓటును నమోదు చేసుకున్నారు.

ఎన్నికల కమీషన్ ఓటర్ నమోదు ప్రక్రియలో తెచ్చిన సంస్కరణలో బాగంగా ప్రతీ మూడు నెలలకు ఒక సారి 18 సంవత్సరాలు పూర్తి అయిన పౌరులు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో ఈ పెరుగుదల కనిపిస్తుంది. గతంలో ఏడాదికి ఒక సారి జనవరిలో మాత్రమే ఓటు నమోదు అవకాశం ఉండేది.

మండలం	అసెంబ్లీ	పార్లమెంట్	పెరుగుదల
ముల్కలపల్లి	27,067	27,855	788
చంద్రుగొండ	23,147	23,565	418
అన్నపురెడ్డిపల్లి	16,555	16,715	161
దమ్మపేట	43,427	44,061	634
అశ్వారావుపేట	45,765	46,977	1,212
మొత్తం	1,55,961	1,59,174	3,213



రామసహాయం రఘురాం రెడ్డిని గెలిపించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇండియా కూటమి అభ్యర్థులను కార్మిక వర్గం అంతా ఓట్లేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేష్ కార్మికులకు పిలుపు నిచ్చారు. కొత్తగూడెం పట్టణంలో కార్మిక పని ప్రాంతాల్లో జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేసి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దేశం, రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం అంతా ఐక్యంగా పోరాటం చేస్తుందన్నారు. కార్మిక, కర్షక పోరాటాలకు మద్దతిచ్చి హక్కులను కాపాడే వారిని గెలిపించేలా కార్మికులు కృషి చేయాలన్నారు. మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఎంఎస్.రావు, రమ, రాజారాం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి గెలుపును కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మండలంలోని అంకంపాలెంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారి వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో



అందిస్తున్న పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ నెల 13వ తేదీన జరుగుచున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గుర్తు హస్తం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి ఎంపీగా రామసహాయం రఘురాం రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. ఎండలో పని చేస్తున్న వారిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలయకు శీతల పానీయాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అంకంపాలెం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కాక రమేష్, వాడే వెంకటరావు, మాజీ సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి, కాక ప్రసాద్, సోయం ముత్యాలరావు, కోంద్రు శ్రావణ్, తాటి రాము, పొట్ట వెంకటరావు, కొంద్రు సాయి, పెనుబల్లి నరేష్, కురం జయంత్, మోకాళ్ళ వితేజ్, వగ్గేల బాలు, కాక దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



హామీలను అమలు చేయని బీజేపీని ఒంటరి చేద్దాం

- సంయుక్త కిసాన్ మోర్చా

నవతెలంగాణ-ఇల్లందు

భారత రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయని బీజేపీని ఒంటరి చేద్దాం..వ్యతిరేకిద్దాం...శిక్షిద్దాం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మే 13న జరుగు పార్లమెంట్ ఎన్నికల్లో రైతాంగం బీజేపీని ఎండగట్టేందుకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేయం) తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడారు. కరోణ కాలంలో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా 13 నెలల పాటు సుదీర్ఘ పోరాటం జరిగిందని, 750 మంది రైతుల ప్రాణాలు బలిదానం చేశారని అన్నారు. ఫలితంగా 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవడంతోపాటు కనీస మద్దతు ధర చట్టం, రుణమాఫీ చేస్తానని విద్యుత్ సవరణ బిల్లులను రైతులతో మాట్లాడకుండా పార్లమెంట్లో పెట్టమని రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తానని ఫజల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా మారుస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో హామీలను అమలు చేయకపోగా వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో ఇండియా కూటమికి ఓటు వేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్రం తరఫున ఏపూరి బ్రహ్మం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయల్ చంద్రశేఖర్ (సీపీఐ ఎంఎల్ ఏఐకేఎస్) నాయకులు గుమ్మడి నరసయ్య, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, ఏఐకెఎస్ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, సైదులు, కాంగ్రెస్ రైతు విభాగ నాయకుడు దేవరకొండ శంకర్, జిల్లా కార్యవర్గం సభ్యులు బుల్లి కొమరయ్య, అంజయ్య, గణపతి, వల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించండి

- ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన గులాబీ శ్రేణులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

13వ తారీఖున జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంటు స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోత్ కవిత గెలుపును కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ



సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణం శాంతినగర్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా గులాబీ జెండాకు పట్టం కట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పోరాడి సాధించాలంటే మహబూబాద్ పార్లమెంటు పరిధిలో మాలోత్ కవిత గెలవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు ఆకోజు సునీల్ కుమార్, డిసిరి శ్రీనివాస్, కాపుల సూరిబాబు, పట్టాభి, నర్సింహులు, సీతామహాలక్ష్మీ, రమాదేవి, శివ, అప్పారావు, దానియేలు ప్రదీప్, నర్సమ్మ, పూజల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నామా గెలుపును కాంక్షిస్తూ బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

దమ్మపేట : బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ప్రచారం చేపట్టారు. మండలంలోని ముష్టిబండ, వడ్లగూడెం, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలుసుకున్న వారు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన



మోసాలను వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 1వ నెంబర్ గల ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త సోయం వీరభద్రం, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు, మాజీ సొసైటీ చైర్మెన్ రావు జోగేశ్వరరావు, మాజీ సర్పంచ బత్తిన తిరుపతిరావు, సోయం రాజబాబు, సుబ్బారావు, రవీంద్ర, నరేంద్ర, ప్రసాదు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించాలి

దుమ్ముగూడెం : ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికలలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాక్షిస్తూ శుక్రవారం పెద్దనల్లబల్లి గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో 6 గ్యారంటీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీటీసీ తునికి సీత, మడకం భూపతి, తునికి కామేష్, నక్క శిలువకుమార్, క్రిష్ణ, దాస్, నిరీక్షణరావు, అర్జున్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మకండి

- బీఆర్ఎస్ అభ్యర్థి కవితను గెలిపించండి

నవతెలంగాణ-మణుగూరు



కాంగ్రెస్ పార్టీ అలవి గాని వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లో పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత గెలిపించాలని జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ 18వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. 6 గ్యారంటీలు అమలు చేయలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేస్తుందన్నారు. ప్రజలను మోసం చేసి పబ్బం గడుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోలేటి భవాని శంకర్, మణుగూరు జడ్పిటిసి పోశం నరసింహారావు, పట్టణ అధ్యక్షులు అడప అప్పారావు, పీఏసీఎస్ చైర్మెన్ కుర్రి నాగేశ్వరరావు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పాటల్లేవ్..! మాటల్లేవ్..!!

- నేటితో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి తెర
- ఖమ్మంలో సాయంత్రం 6, భద్రాద్రిలో 4 గంటలకు క్లోజ్
- సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌కు వీలుగా వీడియోలు
- రాజకీయ వ్యూహాల్లో పార్టీలు...పంపిణీకి ఏర్పాట్లు
- ఓటుకు రూ.500 చొప్పున
- ఇప్పటికే మొదలైన పంపకాలు

'పట్టుకో కాంగిరేసు జెండా...ఎట్టుకో నీ గుండెల నిండా.. జగమే జై కొట్టిన జెండా..జనమే జై కొట్టిన జెండా...' అంటూ హెూరెత్తిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల పాటలకు.. 'మాయదారి కాంగిరేసురో రాజన్న...మన బతుకుల మన్నుపోసెరో రాజన్న...మళ్లీ మొదటికొచ్చినాది తెలంగానమూ..' అంటూ వినిపించిన బీఆర్ఎస్ గేయాలకు...నేతల విమర్శలు, ప్రతివిమర్శల ఉపన్యాసాలకు శనివారం సాయంత్రానికి తెరపడనుంది.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి





మార్చి 19వ తేదీన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ రోజు నుంచి మొదలైన పార్లమెంట్ ఎన్నికల సందడి మరో రెండు రోజుల్లో ముగియనుంది. దాదాపు నెలన్నర రోజులుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మం జిల్లాలో, మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 గంటలకు ముగియనుంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి ఎన్నికల ప్రచార హెూరు ఊపందుకుంది. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని ప్రకటించడంలో కాంగ్రెస్ తాత్సారం చేసింది. నామినేషన్ల ముగింపునకు ముందురోజు ఏప్రిల్ 24వ తేదీన ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. 25వ తేదీ నామినేషన్ల ఘట్టానికి చివరి రోజు ఆయన నామపత్రాలు సమర్పించిన మరుక్షణం నుంచే ప్రచారం ప్రారంభించారు. బీజేపీ, బీఆర్ఎస్ ముందుగానే తాండ్ర వినోద్‌కుమార్, నామ నాగేశ్వరరావును అభ్యర్థులుగా ప్రకటించడంతో మార్చి చివరి వారం నుంచే వారు ప్రచారం మొదలు పెట్టారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి ప్రచారం ముమ్మరం చేశారు. కాంగ్రెస్ సీపీఐ(ఎం), సీపీఐ, జనసేన మద్దతు తీసుకోవడంలోనూ ఆలస్యమైంది. ఏప్రిల్‌లో 20వ తేదీ నాటికి వీరి మద్దతుపై స్పష్టత వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే నాటికే బీఆర్ఎస్, బీజేపీ ఖమ్మం లోక్‌సభ పరిధిలో దాదాపు రెండు విడతల ప్రచారాన్ని పూర్తి చేశాయి.

లేటుగా మొదలైనా లేటెస్టుగా కాంగ్రెస్...

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం లేటుగా మొదలైనా లేటెస్టుగా సాగుతోంది. ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి ప్రచార బాధ్యతను భుజస్కంధాలపై వేసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. వీరికి సీపీఐ(ఎం) నుంచి రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, రెండు జిల్లాల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, సీపీఐ నుంచి రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, సాబీర్‌పాషా, పోటు ప్రసాద్ తోడయ్యారు. వీరితో పాటు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, టీడీపీలోని మెజార్టీ గ్రూపులు కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి పూర్తి బాధ్యతలు తీసుకొని ఎన్నికల ప్రచారంలో విరివిగా పాల్గంటున్నారు. వేర్వేరు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నప్పటికీ మంత్రులు తుమ్మల, భట్టి సైతం సొంత నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. వీరితో పాటు వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ సైతం ప్రచారంలో తీవ్రంగా నిమగ్నమయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని కొత్తగూడెం నియోజకవర్గంలో ఈనెల 4వ తేదీన నిర్వహించిన జనజాతర సభ ఊపు తీసుకు వచ్చింది. 7వ తేదీన అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి వియ్యంకుడు, సినీ హీరో దగ్గుబాటి వెంకటేశ్ ఖమ్మంలో నిర్వహించిన రోడ్‌షో, కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశం హైలెట్‌గా నిలిచాయి. ఇక అన్నింటికీ మించి 'మా మామ మంచోడు..కోడళ్లైన మమ్మల్నే ఎంతో ప్రేమగా చూసుకుంటారు...ఆయన్ను గెలిపిస్తే మిమ్మల్ని మాకన్నా బాగా చూస్తారు..' అంటూ మంత్రి పొంగులేటి కూతురు సప్నిరెడ్డి, వెంకటేశ్ కూతురు ఆశ్రితరెడ్డి, అలాగే చిన్నకుమారుడు అర్జున్‌రెడ్డి నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు మంచి స్పందన వస్తోంది.

శ్రమిస్తున్న సీపీఐ(ఎం)...

ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన సీపీఐ(ఎం) ఆ పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తోంది. కాంగ్రెస్ నేతలతో కలిసి, విడిగానూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఎంత అవసరమో సీపీఐ(ఎం) నేతలు వివరిస్తున్నారు. పార్టీ రెండు జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులతో పాటు జిల్లా కమిటీ సభ్యులు, గ్రామశాఖల వరకు బీజేపీ ప్రమాదాన్ని గుర్తెరిగి కాంగ్రెస్ గెలుపును భుజస్కంధాలపై ఎత్తుకున్నారు. గతనెల 29వ తేదీన ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, కార్యాచరణ చేపట్టారు.

వియ్యంకునికి అన్నీ తామై...

వియ్యంకునికి అన్నీ తామై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి అలుపెరుగకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. చెరొక నియోజకవర్గానికి వెళ్లి అక్కడి ఎమ్మెల్యేలతో కలిసి ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. మధ్యలో ప్రసాద్‌రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి సైతం ప్రచారం నిర్వహించారు. రఘురాంరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం ఆలస్యమయ్యే సరికి ఉన్న కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పొంగులేటి కుటుంబం, ఆయన అనుచరులు, యావత్ కాంగ్రెస్ శ్రేణులు చేమటోడుస్తున్నారు. టీడీపీ, సీపీఐ(ఎంఎల్) మద్దతు కూటగట్టడంలోనూ పొంగులేటి సక్సెస్ అయ్యారు.

ప్రచారంలో 'కారు'..జోరు...

ప్రచారంలో 'కారు' జోరు చూపింది. అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు పేరు రెండు నెలల ముందే ఖరారు కావడంతో ఆ పార్టీ శ్రేణులు వెంటనే కార్యాచరణ మొదలు పెట్టాయి. ఎంపీ గాయిత్రి రవి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, బాణోత్ మదన్‌లాల్, చంద్రావతి, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ తదితరులు ఎన్నికల ప్రచారంలో విరివిగా పాల్గొంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు భారీగా ఉన్నా మొక్కవోని విశ్వాసంతో నామ ఎక్కడ కూడా ఆ లోటు కనిపించకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతనెల 29న ఖమ్మం, 30న కొత్తగూడెంలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లకూ స్పందన బాగా రావడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. నామ నాగేశ్వరరావు నామినేషన్ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఎంపీగా తన సక్సెస్ అంశాలను నామ ప్రజల్లోకి బాగా తీసుకెళ్లగలిగారు.

'కమలం'...విఫలం...

ఇక బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఎన్నికల ప్రచారానికి ఆశించిన స్పందన రాలేదు. డబ్బులు భారీగా ఖర్చు పెట్టినా...తగిన ప్రచారం రాకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. గౌరవప్రదమైన ఓట్లైనా సాధించడం సాధ్యకాదేమోనన్న భయాందోళనతో ఆంధ్రప్రదేశ్‌లో పొత్తును సాకుగా చూపి టీడీపీలోని ఓ గ్రూపును తమ వైపు తిప్పుకుంటోంది. సోషల్‌మీడియా, మీడియాల్లో హెూరెత్తిస్తున్నా...జనం నుంచి స్పందన మాత్రం లేకపోవడంతో ఆ పార్టీలో నిస్తేజం అలుముకుంది.

సోషల్ మీడియా వీడియోలు..డబ్బుల పంపిణీకి ఏర్పాట్లు...

నేటితో ఎన్నికల ప్రచారం ముగుస్తుండటంతో మరో రెండురోజుల కోసం సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకునేందుకు అభ్యర్థులు, నేతలు సన్నద్ధమయ్యారు. ఇక పంపకాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేసేందుకు సన్నద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల పంపకాలు మొదలయ్యాయని సమాచారం. ఖమ్మం లోక్‌సభ పరిధిలో 16.32 లక్షల ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎందరికి పంపిణీ చేయాలి...తదనుగుణమైన ప్రణాళికలపై ఆయా పార్టీల నేతలు ప్రత్యేకంగా రెండు, మూడురోజులుగా సమావేశమై చర్చిస్తున్నారు.

అబద్ధపు హామీలతో మళ్లీ మోసపోకండి

- వంద రోజుల్లోనే రాష్ట్రాన్ని నాశనం చేశారు
- ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఏ పని చేయకూడదట
- ఇది బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నదా కార్నర్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ-కల్లూరు



బీఆర్ఎస్ పార్టీని గద్దించటం కోసం కాంగ్రెస్ పార్టీ ఒక పథకం ప్రకారం అమలకు సాధ్యం కానీ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ వంద రోజుల్లోనే తేటతెల్లమైందని మళ్లీ ఒకసారి మోసపోకుండా బీఆర్ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావుకు ఓటు వేసి కాంగ్రెస్కు గుణపాఠం చెప్పాలని వక్తలు నాయకులు కోరారు. శుక్రవారం రాత్రి టిఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభ లో భాగంగా కల్లూరు పట్టణంలో రోడ్ షో నిర్వహించి పట్టణ సెంటర్లో కార్నర్ సమావేశం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఉద్దిరాజు రవిచంద్ర, అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వెంకట వీరయ్య మాట్లాడుతూ డిసెంబర్ 9వ తారీఖు నాడు రైతుబంధు 15 వేల రూపాయలు చొప్పున రైతు ఖాతాలో రైతుబంధు వేస్తామని ఇచ్చిన హామీ నేటి వరకు సంపూర్ణంగా ఇవ్వలేకపోగా కెసిఆర్ ఇచ్చిన 10వేలు ఇవ్వటం అబద్ధపు హామీలకు ఇదే సాక్ష్యం అన్నారు. కెసిఆర్ 72 వేల కోట్ల రూపాయలు ఒకేసారి రైతుబంధువుగా ఇచ్చిన ఘనత కెసిఆర్ ది అన్నారు. పేదింటి ఆడబిడ్డకు పెళ్లికి కళ్యాణ లక్ష్మి తోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఉన్నదానికే మంగళం పాడారని ఎద్దేవా చేశారు. మహిళకు నెలకి 2500 చొప్పున ఖాతాలో వేస్తామన్నారు అవి ఎక్కడ అని ప్రశ్నించారు. రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు ఇస్తామన్నారు నేటికీ దాని ఊసే లేదు అన్నారు. కెసిఆర్ ప్రాజెక్టు కట్టటంతో రైతులు లక్షల మెట్రిక్ ధాన్యం పండిస్తే రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రైతును ఆదుకున్న సర్కార్ కేసీఆర్ అన్నారు. వ్యవసాయం చేసి కలిసి రాక చేసిన అప్పులు తీరక ఆత్మహత్యకు పాల్పడుతుంటే రైతుకు రైతుబంధు ఇచ్చి ఆదుకున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కాకముందే ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఏమి చేయకూడదని ఆదేశించడం ఎంత విడ్డూరం అని ఎద్దేవా చేశారు. 15 సంవత్సరాలు పాటు తాను ఎమ్మెల్యేగా ఉండి ఏనాడు ఎవరి మీద కేసు పెట్టడం కానీ ఎవరు ఇల్లు కట్టిన గాని తనకు తెలిసేది కాదని అనేది నేడు ఎమ్మెల్యే చెప్తేనే ఇల్లు కట్టుకునే పరిస్థితి ఏర్పడిందని సండ్ర ఆరోపించారు. కార్యకర్తల మీద ఒత్తిడి తీసుకొచ్చి టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినంత మాత్రాన వారి మనసులో ఉన్న అభిమానం ఎక్కడికి పోదని ఎవరి ఒత్తిడి వల్ల రాజీనామా చేస్తున్నారో తమకు తెలుసని, ఇవి ఎన్నో రోజు సాగవని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. టిఆర్ఎస్ పార్టీ కి అదకా సంఖ్యలో ఎంపీ సీట్లు గెలిస్తే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు పోరాడుతామని,అందుకు మీ సహకారం మీ అమూల్యమైన ఓటు టిఆర్ఎస్కు వేస్తే హామీలన్నీ అమలు చేయించే బాధ్యత మాదేనని స్పష్టం చేశారు. 13వ తేదీన జరిగే పోలింగ్లో ఒకటవ నెంబరు నామ నాగేశ్వరరావు పేరు మీద ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తో శిత కల్లూరు ప్రారంభం నుండి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, డిసిసిబి డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, కాటమనేని వెంకటేశ్వరరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు మండలం నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ అభిమానులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

బలరాం గెలుపు కోరుతూ టీడీపీ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపును కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి శుక్రవారం తెలుగుదేశం పార్టీ



ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణం శాంతినగర్ కాలనీలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ... భద్రాచలం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాధ్యమవుతుందని భావించి రాష్ట్ర మంత్రి తుమ్మల, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య పై ఉన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి టీడీపీ స్థానిక మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్కె అజీమ్, కంభంపాటి సురేష్ కుమార్, కుంచాల రాజా రామ్, తాళ్లూరి చిట్టిబాబు, కూడా చంటి అబినేని శ్రీనివాసరావు, రావులపల్లి మాధవరావు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ కుటుంబానికి ఆర్థిక సాయం

- తోటి కార్మికుడికి అండగా నిలిచిన శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం పట్టణంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న కార్పెంటర్ కార్మికుడైన ఎడారి బాబురావు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్థిక సోమత లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భద్రాచలం శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్ నాయకులు విషయం తెలుసుకొని బాబురావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5900 ఆర్థిక సహాయాన్ని అధ్యక్షులు మధుసూదనాచారి చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి అప్పారి రాము మాట్లాడుతూ బాబురావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్‌లో ఏ ఏ కార్మికుడికి ఇబ్బంది కలిగిన తోటి కార్మికులందరూ అండగా నిలుస్తున్నారని అన్నారు. బాబురావు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని తెలియగానే స్పందించి ఆర్థిక సాయం చేసిన తోటి కార్మికులందరికీ విప్లవ అభినందనలు తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడటమే కాక తోటి కార్మికులకి ఒకరికి ఒకరుగా అండగా నిలిచేందుకు యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. యూనియన్‌లో ప్రతి సభ్యుడు వెల్ఫేర్ బోర్డు ఇన్సూరెన్స్ చేపించుకోవాలని కోరారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అనుగోజు నరసింహాచారి మాట్లాడుతూ ప్రతి కార్పెంటర్ సభ్యుడు సభ్యత్వం తీసుకోవాలని అలాగే బాబురావు త్వరగా కోలుకోవాలని బాబురావు కుటుంబానికి కార్పెంటర్ యూనియన్ ఎప్పుడు అండగా ఉంటాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎలా సత్యనారాయణ కోశాధికారి కడార్ల రాము, కమిటీ నెంబర్ ఎస్కె షరీఫ్, కాకరపర్తి త్రిమూర్తులు, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మాల్దీవుల జాతీయ భద్రత కోసమే...

- భారత సైన్యం ఉపసంహరణ : నిపుణులు

న్యూఢిల్లీ, మాలే : మాల్దీవుల నుంచి భారత దళాల ఉపసంహరణ గురువారంతో పూర్తయింది. ఈ ఉపసంహరణ అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా జరిగిందని ఈ రంగానికి చెందిన నిపుణులు స్పష్టం చేశారు. అలాగే భారత సైన్యం ఉపసంహరణ కోసం మాల్దీవులు చేసిన అభ్యర్థన వెనుక ఆ దేశ ప్రజల మనోభావాలు, జాతీయ భద్రత, గౌరవం వంటి అవసరాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. అలాగే, చైనా అనుకూల విధానం కారణంగానే ఈ ఉపసంహరణకు మాల్దీవుల అధ్యక్షులు పిలుపునిచ్చారనే ప్రచారాన్ని కూడా నిపుణులు తీవ్రంగా ఖండించారు. మాల్దీవులు స్వతంత్ర సార్వభౌమ దేశం కాదని, భారతదేశ ప్రభావ పరిధిలో భాగమని భావించడం వలనే ఇటువంటి ప్రచారం జరిగిందని నిపుణులు చెప్పారు. మాల్దీవులు సార్వభౌమాధికారం కలిగిన దేశమని, అంతర్జాతీయ చట్టాలు-నిబంధనలు ప్రకారం భారత్ తన దళాలను ఉపసంహరించుకోవాలని సిచువాన్ ఇంటర్నేషనల్ స్టడీస్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ప్రొఫెసర్ లాంగ్ జింగ్‌చుప్ అన్నారు. భారతదేశం తన దళాలను ఉపసంహరించుకోకపోతే మాల్దీవుల అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. భారత దళాల ఉపసంహరణ అనే అభ్యర్ధన 'చైనా అనుకూల విధానం', 'మాల్దీవుల అనుకూల విధానం' అని చెప్పారు. స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా మాల్దీవులకు ప్రపంచంలోని అన్ని దేశాలతోనూ సంబంధాలను అభివృద్ధి చేసుకునే హక్కు, ఆవశ్యకత ఉందని అన్నారు. 'మాల్దీవులపై ఆధిపత్యం కోసం ప్రయత్నించడం కంటే, ఇతర దేశాలతో న్యాయంగా, గౌరవంగా వ్యవహరించడానికి భారత్ ప్రాధన్యత ఇవ్వడం చాలా కీలకం' అని లాంగ్ తెలిపారు.

పనామా బ్యాంకర్ కన్నుమూత

పనామా సిటీ : పనామా బ్యాంకర్, ప్రస్తుతం పనిచేయకుండా పోయిన న్యాయ సంస్థ మొజాక్ ఫోన్సెకా సీనియర్ భాగస్వామి రామన్ ఫోన్సెకా పనామా సిటీ ఆస్పత్రిలో గురువారం మరణించారని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు. ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి వివరాలు తెలియచేయలేదు. కానీ విచారణకు హాజరు కాలేనంత రీతిలో ఆయన పరిస్థితి వుందని అంతకుముందు ఆయన లీగల్ టీమ్ సభ్యుడు వ్యాఖ్యానించారు. పనామా మాజీ అధ్యక్షుడు రికార్డో మార్టినెల్లి తన స్నేహితుడు ఫోన్సెకా మంచి మనిషని వ్యాఖ్యానించారు. న్యాయవాది, రచయిత, రాజకీయ నేత అని పేర్కొన్నారు.సంచలనం కలిగించిన పనామా పేపర్స్ కుంభకోణంలో ఈ సంస్థ రికార్డులే లీకయ్యాయి. మొజాక్ ఫోన్సెకా సంస్థ నుండి తస్కరించిన కోటీ 10లక్షలకు పైగా డాక్యుమెంట్లు 2016 ఏప్రిల్‌లో అంతర్జాతీయ దర్యాప్తులకు ఒక ప్రాతిపదికను కల్పించాయి. 170 దేశాల్లోని లక్షా 30వేల మంది వ్యక్తులను ఇబ్బందికర పరిస్థితుల్లోకి కెట్టాయి. వీరిలో ఫోర్బ్స్ జాబితాలోని 20మంది శతకోటీశ్వరులు, అనేకమంది హాలివుడ్ నటులు, అథ్లెట్లు, రాజకీయ నేతలు వున్నారు. ఫోన్సెకా, ఆయన వ్యాపార భాగస్వామి జుర్గెన్ మొజాక్‌లు మాత్రం తమ వ్యాపారం చట్టబద్ధమైనదని చెప్పుకున్నారు. ఈ సంస్థ పేరు ప్రతిష్ఠలకు కోలుకోలేని రీతిలో దెబ్బ తగలడంతో 2018లో ఇది మూతబడింది.

పోలింగ్ శాతం వెల్లడిలో ..

- జాప్యాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంలో పిటీషన్

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో తొలి మూడు దశలకు సంబంధించిన తుది పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో జాప్యాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటీషన్ దాఖలయింది. న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నెహ రతి, చార్లీ డిసౌజలకు చెందిన అసోసియేషన్ ఫర్ డెమెక్రటిక్ వేసిన ఈ పిటీషన్ పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో జాప్యాన్ని ప్రశ్నించడంతోపాటు ఎన్నికల కమిషన్ ప్రారంభంలో ప్రకటించిన శాతాలతో పోలిస్తే తుది శాతాలు భారీగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నికల కమిషన్ ఇచ్చిన సమాచారంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపింది.

ప్రస్తుత ఎన్నికల్లో ప్రతీ దశ ఓటింగ్ తరువాత పోలింగ్ స్టేషన్లలో నమోదైన పోలింగ్ శాతం కాపీలను స్కాన్ చేసి ఇసి అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కూడా ఈ పిటీషన్ సుప్రీంకోర్టును కోరింది. అంతేకాకుండా, నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల సంఖ్యను, నమోదైన పోలింగ్ శాతాన్ని కూడా ప్రచురించాలని కోరింది. ఏప్రిల్ 19న తొలి దశ జరగ్గా 11 రోజుల తరువాత, ఏప్రిల్ 26న రెండో దశ జరగ్గా నాలుగు రోజుల తరువాత ఇసి తుది పోలింగ్ శాతాన్ని ప్రకటించిందని పిటీషన్ కోర్టుకు తెలిపింది. అలాగే పోలింగ్ రోజున ప్రకటించిన ప్రాథమిక పోలింగ్ శాతం కంటే తుది పోలింగ్ శాతం ఏకంగా 6 శాతం వరకూ పెరిగిందని తెలిపింది.

నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో..

- ఇద్దరిని దోషులుగా నిర్ధారించిన కోర్టు : మరో ముగ్గురు నిర్దోషులుగా విడుదల

పూనె : హేతువాది నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో ఇద్దరు నిందితులను దోషులుగా పూనె కోర్టు నిర్ధారించింది. వీరికి యావజ్జీవ శిక్ష విధించడంతో పాటూ రూ.5లక్షల జరిమానా కూడా విధించింది. మరో ముగ్గురు నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టింది. విడుదలైన వారిలో డాక్టర్ వీరేంద్ర సింగ్ తవాడె, విక్రమ్ భావె, సంజీవ్ పునాల్కర్‌లు వున్నారు.

నరేంద్ర దబోల్కర్ కుమారుడు డాక్టర్ హమీద్ దబోల్కర్ ఈ తీర్పుపై వ్యాఖ్యానిస్తూ, నిర్దోషులుగా విడుదలైన నిందితులు అలా వుండకూడదని అన్నారు. కాల్పులు జరిపిన నిందితులను పట్టుకున్నారు, కానీ ఈ హేయమైన కార్యకలాపాల వెనుక గల సూత్రధారులను కూడా శిక్షించాల్సిన అవసరం వుందని అన్నారు. వారిని విడిచిపెట్టకూడదని అన్నారు. న్యాయం కోసం ఈ విషయాన్ని సుప్రీం కోర్టుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పారు. తదనంతర కాలంలో గోవింద్ పన్సారే, ఎం.ఎం.కల్బుర్గి, గౌరి లంకేష్ హత్యలతో ఈ కేసులన్నింటిలోనూ ప్రమాదకరమైన సంబంధాలు బయటపడ్డాయి, అంటే అనేక కేసులకు సంబంధించి విస్తృతమైన కుట్ర వుందని అర్థమవుతోంది. ఈ కేసులన్నింటిలోనూ ఒక ఉమ్మడి అంశం ఏమిటంటే దర్యాప్తు సంస్థలు చెబుతున్న విషయాలన్నీ ఒకేలా వుండడం, ఈ కేసులన్నింటిలోనూ కుట్రదారుడు పట్టుబడేవరకు హేతుబద్ధంగా ఆలోచించేవారి భద్రత ప్రమాదంలోనే వుంటుంది. పథకం ప్రకారం జరుగుతున్న ఈ హత్యలకు జవాబుదారీతనం కోసం పట్టుబడతామని, సూత్రధారులను విచారించాలని ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

2013 ఆగస్టు 20న ఓంకారేశ్వర్ బ్రిడ్జిపై మార్నింగ్ వాక్ చేస్తుండగా, నరేంద్ర దబోల్కర్‌ను కాల్చి చంపారు. ఈ కేసులో ఐదుగురిని నిందితులుగా పేర్కొన్నారు. తొలుత పూనే పోలీసులు ఈ కేసు దర్యాప్తును చేపట్టారు. తర్వాత బాంబే హైకోర్టు ఆదేశాలతో 2014లో సిబిఐ తీసుకుంది. హిందూమితవాద సంస్థ సనాతన సంస్థతో సంబంధమున్న ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ వీరేంద్ర సింగ్ తవాడెను అరెస్టు చేసింది.

దబోల్కర్ హత్య తర్వాత నాలుగేళ్ళలో మరో ముగ్గురు హేతువాదుల హత్యలు కూడా జరిగాయి. కమ్యూనిస్టు నేత గోవింద్ పన్సారె (కొల్హాపూర్, 2015 ఫిబ్రవరి), కన్నడ మేధావి, రచయిత ఎం.ఎం.కాల్బుర్గి (ధార్వాడ్, 2015 ఆగస్టు), జర్నలిస్టు గౌరీ లంకేశ్ (బెంగళూరు, 2017 సెప్టెంబరు).

నేడు టీఎస్ఆర్జేసీ పరీక్ష ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం గతనెల 21న నిర్వహించిన టీఎస్ఆర్జేసీ సెట్ రాతపరీక్ష ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్ఆర్జేసీ ప్రవేశ పరీక్ష మార్కులు శనివారం http://tsrjdc.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్ నెంబర్ నమోదు చేసి మార్కులను తెలుసుకోవాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఎంపికైన విద్యార్థులకు సమాచారం రెండు, మూడు రోజుల్లో తెలియజేస్తామని వివరించారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీలో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశం కోసం పదో తరగతి పరీక్షలకు హాజరైన రాష్ట్రంలోని 73,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేసిన విషయం చేసిన విషయం తెలిసిందే. వారిలో గతనెల 21న నిర్వహించిన రాతపరీక్షకు 61,442 (84 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు.

కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్ దోచుకోవడమే

- ఆ పార్టీవి ఓటు బ్యాంకు రాజకీయాలు
- ఆర్ఆర్ ట్యాక్సే కాదు రజాకార్ ట్యాక్స్ కూడా ఉంది : ఎల్బీ స్టేడియం బహిరంగ సభలో ప్రధాని మోడీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అవినీతి పేరిట దేశాన్ని దోచుకున్న ట్రాక్ రికార్డు కాంగ్రెస్ పార్టీదని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసి ఇక్కడ మతపర రిజర్వేషన్లు అమలు చేస్తున్నారనీ, దాన్ని దేశవ్యాప్తం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హైదరాబాద్‌లో ఆ పార్టీ బలమైన అభ్యర్థిని నిలపలేదని విమర్శించారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంను కాదని బీజేపీని గెలిపిద్దామనే నిర్ణయానికొచ్చారన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూరనర్సయ్య గౌడ్ గెలుపు కోరుతూ ప్రచార సభను నిర్వహించారు. దీనికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఆ సభలో మోడీ మాట్లాడుతూ..జూన్ నాలుగో తేదీన 140 కోట్ల ప్రజల సంకల్పంతో దేశం గెలువబోతున్నదన్నారు. సీఏఏ, యూసీసీ, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాఖ్, ఆత్మనిర్భర్ భారత్ విరోధులకు ఓటమి తప్పదని స్పష్టం చేశారు. తమ పాలనలో ప్రపంచంలోనే భారత్ ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందనీ, టెక్నాలజీలో ముందు వరుసలో ఉందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో దిల్‌సుఖ్‌నగర్‌లో వరుస బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి బాంబు పేలుళ్ల వినిపిస్తున్నాయా? వాటిని ఆపింది ఎవరు అంటూ సభికుల్ని ప్రశ్నించారు. దేశ ప్రజలంతా బీజేపీకి ఓటేసి ఆ దాడులను అడ్డుకున్నారన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో మధ్యతరగతి సంక్షేమం గురించే లేదని విమర్శించారు. రామ మందిరం కట్టడం తప్పా? పూజ చేయడం తప్పా? అని ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో ఎంఐఎం దోస్తానా చేయడం వల్ల హైదరాబాద్‌కు ముక్తి లభించలేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించట్లేదనటం అవాస్తవమన్నారు. తెలంగాణకు నాలుగు వందేభారత్ రైళ్లు ఇచ్చామనీ,



రామగుండంలో ఫర్టిలైజర్ పరిశ్రమ, సమ్మక్క సారలమ్మ యూనివర్సిటీ ఏర్పాటు చేశామనీ, జాతీయ రహదారులను ఇచ్చామని వివరించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టేననీ, కాంగ్రెస్‌కు వేస్తే ఓటు వృథా చేసుకున్నట్టేనని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధిక సీట్లను గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సొల్యూషన్ సిటీ అనీ, ఇక్కడ ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఆస్తులపై వారసులకు హక్కు లేకుండా చేయాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. దేశాన్ని విదేశీ కండ్లద్దాల్లో చూసే కాంగ్రెస్‌కు ఐడియా ఆఫ్ ఇండియా అనేదానిపై కనీసం అంచనా కూడా లేదన్నారు. ఒకరు ఢిల్లీలో, మరొకరు ఇక్కడ ఉంటూ ఆర్ఆర్ ట్యాక్స్‌తో తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్నారని విమర్శించారు. వారికి రజాకార్ ట్యాక్స్ కూడా తోడైందనీ, అది ఎలా వసూలు చేస్తారనేది పాతబస్తీకెళ్తే తెలుస్తుందని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..తమకు రాహుల్‌గాంధీ, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు అవసరం లేదనీ, ప్రజలిచ్చే సర్టిఫికెట్లు కావాలని చెప్పారు. అబద్దాలు, అసత్య ప్రచారాలతో కాకుండా ఇచ్చిన హామీలను ముందు పెట్టి ఓట్లు అడగాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. మోడీ లేని భారతాన్ని చూడలేమన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ..బీజేపీ పాలిస్తున్న ఏ రాష్ట్రంలోనూ రిజర్వేషన్లు తీసేయలేదనీ, రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తున్నదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా వచ్చే అవకాశము కూడా లేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ నీటి, కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందనీ, ఏ చిన్న అవసరానికైనా సీఎం పెద్దన్నదగ్గరకు పోయి అడగాల్సిందేనని చెప్పారు. దేశం మొత్తం మోడీ హవా నడుస్తోందన్నారు. హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత మాట్లాడుతూ..ట్రిపుల్ తలాఖ్ తొలగించి ముస్లిం మహిళల గౌరవం పెంచిన ఘనత మోడీదని కొనియాడారు. మోడీ ప్రభుత్వం అభివృద్ధిలో పది అడుగులు ముందుకేస్తే..కొందరు యువతను తప్పుదోవ పట్టిస్తూ వంద అడుగులు వెనక్కి లాగాలని చూస్తున్నారని ఆరోపించారు. భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ..మోడీ మళ్లీ ప్రధాని అవుతారనీ, రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దు కావని చెప్పారు. మోడీ అంటే ట్రీడీ అన్నారు. సభలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుభాశ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తుంగెడలో 'పోడు' కొట్లాట

- అటవీ శాఖ అధికారులు, గ్రామస్తుల మధ్య తోపులాట
- అటవీ అధికారులకు స్వల్ప గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు



నవతెలంగాణ-రెబ్బెన

కుమురంభీం -ఆసిఫాబాద్ మండలం తుంగెడ గ్రామంలో శుక్రవారం అటవీ అధికారులు, గ్రామస్తుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో అటవీ అధికారులు గాయపడ్డారు. తుంగెడ గ్రామ సమీపంలో గతంలో అటవీ అధికారులు ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. దీనికి ఆనుకొని ఉన్న ఆరు హెక్టార్ల భూమి తమదేనని, పూర్వీకుల నుంచి ఈ భూమి ఉందని, దానికి సంబంధించిన పట్టాలు ఉన్నాయంటూ గ్రామానికి చెందిన కొంతమంది సాగు చేయడానికి గతేడాది ప్రయత్నం చేశారు. ఆ సమయంలో తహసీల్దార్ సాయంతో అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. రైతుల వద్ద ఉన్న పట్టాలు సరైనవి కావని, నిర్ధారణ కావడానికి జాయింట్ సర్వే చేయాల్సి ఉంటుందని అప్పటి తహసీల్దార్ చెప్పడంతో రైతులు సద్దుమణిగారు. నెల రోజుల కిందట రైతులు భూమిలో సాగు చేసే ప్రయత్నం చేయడంతో పంచాయితీ ప్రారంభమైంది. అటవీ అధికారులు అక్కడే టెంటు వేసుకుని వారిని అడ్డుకున్నారు. అప్పటి నుంచి గ్రామస్తులు పోడుకు ప్రయత్నించడం.. అధికారులు వారిని నిలువరించడం జరుగుతూ వస్తోంది. మూడ్రోజుల నుంచి అటవీ సిబ్బంది పెద్ద మొత్తంలో అదే భూమి వద్ద పహారా నిర్వహిస్తుండగా శుక్రవారం గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు, గ్రామస్తులకు తోపులాట జరగడంతో ఐదుగురు అధికారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అటవీ అధికారులు పది మంది గ్రామస్తులపై ఫిర్యాదు చేయగా, గ్రామస్తులు బీట్ అధికారిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదులో పోలీసులు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు.


అధికారులపై దాడి సరైంది కాదు
నీరజ్‌కుమార్ ఫిబ్రెవాల్, జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రజలకు మంచి చేసే అడవిని కాపాడటానికి అటవీ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ సూచనల మేరకే పని చేయాల్సి ఉంటుంది. అలాంటి అధికారులపై ప్రజలు దాడి చేయడం సరైంది కాదు. తుంగెడ పోడు సాగు దారులకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహిస్తున్నాం. గతంలో నిర్వహించిన సర్వేలో రైతులకు ఉన్న పట్టాలు సరైనవి కావని రెవెన్యూ అధికారులు తేల్చేశారు. అయినప్పటికీ రైతుల కోరిక మేరకు జాయింట్ సర్వే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

డ్రైవర్ నిద్రమత్తుకు ముగ్గురు కార్మికులు మృతి - 33మందికి గాయాలు

లఖింపూర్ (పిలిభిత్) : డ్రైవర్ నిద్రమత్తు ముగ్గురు కార్మికులను బలి తీసుకుంది. ఇటుకబట్టీలో పనిచేసే కూలీలు పిలిభిత్‌లో శుక్రవారం తెల్లవారుజామున మొరాదాబాద్ నుండి లఖింపూర్ ఖేరీకి వాహనంలో వెళుతుండగా, అస్సాం హైవేపై బిజ్నోర్ గ్రామ సమీపంలో డిసిఎం డ్రైవర్ నిద్రపోయాడు. దీంతో డిసిఎం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మతి చెందారు. 33 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను డిసిఎం నుంచి బయటకు తీసి జిల్లా ఆస్పత్రికి తరలించారు. డిసిఎంలో తీవ్రంగా ఇరుక్కున్న డ్రైవర్‌ను మూడున్నర గంటలపాటు శ్రమించిన తర్వాత బయటకు తీయగలిగారు. అతడి పరిస్థితి విషమించడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ధ్వంసమైన వాహనాన్ని పోలీసులు బయటకు తీశారు. ప్రమాదం జరిగిన తర్వాత హైవేకి ఇరువైపులా వాహనాలు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న డీఎం, ఎస్పీలు కూడా వైద్య కళాశాలకు చేరుకున్నారు. క్షతగాత్రుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డీసీఎంలో దాదాపు 50 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏపీలో వెంటనే అక్రమ ఇసుక తవ్వకాలను ఆపండి : సుప్రీం



న్యూఢిల్లీ : ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే ఆపేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వెంటనే మైనింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లి అక్కడి పనులను ఆపాలని చెప్పింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను సుప్రీం తోసిపుచ్చింది. " మీ చర్యలు అన్ని కాగితాలపైనే ఉన్నాయని, క్షేత్రస్థాయిలో కనిపించవు " అని జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా ఆగ్రహం వ్యక్తం చేశారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

- ప్రచారం నేటి సాయంత్రం 6 గంటలతో సమాప్తం
- సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ : ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోలింగ్‌కు 72 గంటల ముందునుంచి అన్ని బస్తీల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రాత్రివేళల్లో మురికివాడలు, బస్తీలు, సున్నిత ప్రాంతాల్లో తనిఖీలు చేయాలనీ, డబ్బు, మద్యం, బహుమతులు, ఇతర వస్తువుల పంపిణీ జరక్కుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీముల్ని ఏర్పాటు చేసి, అంతరాష్ట్ర, సరిహద్దు రాష్ట్రాల వద్ద చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారులు సోషల్ మీడియాపై దృష్టి సారించాలనీ, తప్పుడు సమాచారం ప్రచారంలోకి వస్తే తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు రాకుండా ఈసీఐఎల్ ఇంజినీర్లు పర్యవేక్షించాలన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఏర్పాట్లు కూడా పూర్తి చేయాలని చెప్పారు. ఇక్కడ పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. లోక్‌సభ స్థానాల్లో ఈనెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటలకల్లా రాజకీయపార్టీలు ప్రచారాన్ని ముగించాలని చెప్పారు.

సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం 11వ తేదీ సాయంత్రం 4 గంటలకే ఎన్నికల ప్రచారం ముగించాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో 13వ తేదీ పోలింగ్ కూడా ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే జరుగుతుందని వివరించారు. ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

రష్యా విమర్శలను తోసిపుచ్చిన అమెరికా

వాషింగ్టన్ : భారత సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో అమెరికా జోక్యం చేసుకుంటుందన్న రష్యా విమర్శలను అమెరికా గురువారం తోసిపుచ్చింది. తాము భారత దేశ లోక్‌సభ ఎన్నికల్లో జోక్యం చేసుకోవడం లేదని అమెరికాస్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. ప్రపంచంలోని ఏ ఎన్నికల్లో తాము జోక్యం చేసుకోనట్లే.. భారత్ ఎన్నికల్లోనూ జోక్యం చేసుకోవడం లేదని అన్నారు. భారత దేశ ప్రజలు తీసుకోవాల్సిన నిర్ణయమని రోజువారీ మీడియా కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో ప్రచురితమైన వార్తాకథనం పూర్తిగా ఆరోపణలతో నిండి ఉందని అన్నారు. జ్యూరీ నిర్ధారించేంతవరకు అవి ఆరోపణలేనని అన్నారు. వాటిపై మాట్లాడనని, చట్టపరమైన వ్యవహారం కొనసాగుతుందని అన్నారు. భారత ఆంతరంగిక వ్యవహారాల్లో, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో అమెరికా జోక్యం చేసుకుంటోందని రష్యా విమర్శించిన సంగతి తెలిసిందే.


వీరంతా గెలిచేనా...!?



- ఓడిన ఎమ్మెల్యేలు లోక్‌సభ బరిలో
- ఈటల, ఆర్ఎస్, రఘునందన్, : బాజీరెడ్డిపై చర్చోపచర్చలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని అందరూ అంటుంటారు. అందులోనూ గెలుపోటములు సహజమేనని సెలవిస్తుంటారు. ఇదంతా ఒక పార్శ్వమైతే, మరో పార్శ్వం కూడా ఉంది. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కొంత మంది మాజీ ఎమ్మెల్యేలు తమ అదృష్టాన్ని, అవకాశాన్ని మరోసారి పరీక్షించుకునే పనిలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు నేతలు మళ్లీ లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు టికెట్లు దక్కక ఉసూరుమంటున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే భారత ఎన్నికల సంఘం ఏర్పాటన్నీ చేసింది. రాజకీయ పార్టీలు సైతం ఢీ అంటే ఢీ అంటున్నాయి. పోటాపోటీగా ఎన్నికల ప్రచారానికి దిగాయి. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు, చిన్నా చితకా పార్టీలు ఎన్నికల బరిలో ఉన్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీల నుంచి ఓడిపోయిన వారంతా లోక్‌సభ ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని మరోసారి తేల్చుకోనున్నారు. బీజేపీకి చెందిన ఈటల రాజేందర్ హుజురాబాద్‌తోపాటు కామారెడ్డిలోనూ ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన్ను సెటిలర్ల ఓట్లు ఎక్కువగా ఉన్న మల్కాజ్‌గిరి నుంచి బీజేపీ బరిలోకి దింపింది. అలాగే దుబ్బాకలో గెలవలేకపోయిన రఘునందన్‌రావును ఆ పార్టీ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయిస్తున్నది. అలాగే బీఆర్ఎస్ నుంచి సైతం పలువురు అదే వరుసలో బరిలోకి దింపింది. ధర్మపురి నుంచి విజయం సాధించలేకపోయిన కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కేసీఆర్ పోటీకి పెట్టారు. అలాగే నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ స్థానం నుంచి ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ లోక్‌సభకు నిలబెట్టారు. అలాగే ఆపార్టీ నేత ఆత్రం సక్కుకు అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ నిరాకరించారు. అదే కేసీఆర్ అభ్యర్థుల కొరత నేపథ్యంలో ఆత్రం సక్కును ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పోటీచేయిస్తున్నారు. ఇదిలావుండగా సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బీఎస్పీ టికెట్‌పై పోటీచేసి ఓడిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని నాగర్‌కర్నూల్ స్థానం కేటాయించారు. ఇలా చాలా మంది మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ టికెట్ల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. కొందరికి అవకాశం రాగా, మరికొందరికి విధి వెక్కిరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వీరంతా, పార్లమెంటుకు గెలుస్తారా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ తరహా పోటీలపై దుబ్బాక ప్రచారం సందర్భంగా 'అసెంబ్లీలో చెల్లని రూపాయి..మెదక్ పార్లమెంటు'లో చెల్లుదా ? అంటూ మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలు రఘునందన్‌రావును ఉద్దేశించి చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎక్కువ స్థానాల్లో పోటీపెట్టింది మాత్రం బీఆర్ఎస్ పార్టీనే కావడం గమనార్హం.






నేటినుంచి మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు 25

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో ఉచిత విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఉంటాయని వివరించారు. మొదటి విడత ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 25వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. పూర్తి షెడ్యూల్‌తోపాటు సమాచారం కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రిశాంక్‌కు బెయిల్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఉస్మానియా విశ్వవిద్యాలయం మెస్‌ల మూసివేతపై దుష్ప్రచారం చేసిన కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం విచారణ చేపట్టిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలు, రెండు షూరిటీలు సమర్పించాలని, ప్రతిరోజూ పోలీసుల ముందు హాజరుకావాలని క్రిశాంక్‌ను కోర్టు ఆదేశించింది.



కుటుంబం అంటే ప్రేమా, ఆప్యాయత, అనురాగం, బాధ్యత అన్నీ కలగలిపి ఉండాలి. కేవలం డబ్బు, అవసరాలు తీర్చుకోవడం అనుకుంటే అది కుటుంబమే కాదు. వ్యాపారమవుతుంది. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు యంత్రాల్లా తయారవుతారు. ప్రేమ, అనురాగం, అనుబంధాలు అంటే ఏమిటో తెలియకుండానే పెరిగిపెద్దవుతారు. తర్వాత కాలంలో ఎలాంటి ఫీలింగ్స్ లేని వారిగా తయారవుతారు. మరీ ముఖ్యంగా భార్యాభర్తల సంబంధమంటే అనురాగానికి మారుపేరుగా ఉండాలి. కానీ డబ్బే కీలకమనుకుంటే ఎన్నో సమస్యలకు దారి తీస్తుంది. ఆ బంధమే విచ్ఛినమయ్యే పరిస్థితి వస్తుంది. అలాంటి సమస్యతోనే ఐద్వా అదాలత్‌కు వచ్చింది స్వరూప.

పిల్లలకు ప్రేమను పంచండి

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

స్వరూపకు 40 ఏండ్లు ఉంటాయి. ఎంబీఏ పూర్తి చేసింది. పెండ్లయి పదిహేనేండ్లు అవుతుంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. భర్త విజయ్ చదివింది డిగ్రీనే. అయితే సొంత ట్రెనింగ్ సెంటర్ ఉంది. నెలకు లక్షల్లో సంపాదిస్తాడు. ఆమె ట్రైనింగ్‌కి వెళ్ళినప్పుడే విజయ్ పరిచయమయ్యాడు. అలా ఇద్దరి మధ్య ప్రేమ చిగురించి పెండ్లి చేసుకున్నారు. అయితే వీరి పెండ్లి నాటికే విజయ్‌కు అతని తల్లిదండ్రులు వేరే అమ్మాయితో నిశ్చితార్థం చేశారు. ఆమెను కాదని స్వరూపను పెండ్లి చేసుకున్నాడు. అత్తమామలకు ఇష్టం లేకపోయినా ఏమీ చేయలేని పరిస్థితుల్లో స్వరూపను అంగీకరించారు.

అటు స్వరూప తల్లిదండ్రులు కూడా వీరి పెండ్లిని అంగీకరించలేదు. అప్పటి నుండి వాళ్ళతో ఆమెకు పెద్దగా సంబంధాలు ఏమీ లేవు. అప్పుడప్పుడు తల్లి వచ్చిపోతూ ఉంటుంది. లక్షల్లో సంపాదించే భర్త, దేనికీ లోటు లేకుండా గడిచిపోయేది స్వరూపకు. భర్త సంపాదించి మొత్తం ఆమె చేతికే ఇచ్చేవాడు. నగలు, చీరలు ఏం కావాలన్నా కొనుక్కునేది. స్థలాలు కూడా బాగానే కొన్నారు. విజయ్ తమ్ముడు పెండ్లి కాక ముందు వీరి వద్దనే ఉండేవాడు. అయితే అతను పనేమీ చేయడు. పెండ్లి తర్వాత కూడా పెద్దగా ఆదాయం లేదు. సొంత మరదలినే పెండ్లి చేసుకున్నాడు. చిన్న కొడుకు జీవితం ఎక్కడ నాశనం అవుతుందో అని తల్లిదండ్రులు విజయ్‌తో అప్పుడప్పుడు చిన్న కొడుక్కి డబ్బులు ఇప్పించేవారు. ఇదంతా స్వరూపకు నచ్చేది కాదు.

భర్త బిజినెస్ పని మీద ఎప్పుడూ ఇతర ప్రాంతాలకు వెళుతుండేవాడు. అప్పుడు అత్తమామల బాగోగులన్నీ ఆమే చూసుకునేది. అప్పుడప్పుడు గొడవలు వచ్చినా మామగారితో మాత్రం బాగానే ఉండేది. కానీ అత్తకు, ఈమెకు మాత్రం మాటల్లేవు. కరోనా సమయంలో స్వరూప తన పిల్లల్ని తీసుకొని ఆరు నెలలు పుట్టింట్లో ఉండి వచ్చింది. అప్పటి నుండి ఇంట్లో పరిస్థితి మొత్తం మారిపోయింది. ఇంటి పెత్తనం మొత్తం అత్త చేతికి వెళ్ళిపోయింది. భర్త డబ్బులు కూడా స్వరూప చేతికి ఇవ్వడం ఆపేశాడు. మొత్తం ఆయనే చూసుకుంటున్నాడు. ఇదంతా ఆమె భరించలేకపోయింది. పైగా విజయ్ ఎవరితోనే గంటల కొద్దీ ఫోన్లో మాట్లాడేవాడు. మెసేజ్లు చేసేవాడు. లక్షలు లక్షలు డబ్బులు పంపేవాడు. ఎవరని ఆరా తీస్తే అతని ఆఫీసులో పని చేసే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసినప్పటి నుండి భార్యాభర్తల మధ్య ఒకటే గొడవలు. పెద్ద పాప ఇప్పుడు పదోతరగతి చదువుతోంది. చిన్న పాప ఆరో తరగతి. ఆ ఇంట్లో ఎప్పుడూ గొడవలే.



కరోనా సమయంలో స్వరూప తన పిల్లల్ని తీసుకొని ఆరు నెలలు పుట్టింట్లో ఉండి వచ్చింది. అప్పటి నుండి ఇంట్లో పరిస్థితి మొత్తం మారిపోయింది. ఇంటి పెత్తనం మొత్తం అత్త చేతికి వెళ్ళిపోయింది. భర్త డబ్బులు కూడా స్వరూప చేతికి ఇవ్వడం ఆపేశాడు. మొత్తం ఆయనే చూసుకుంటు న్నాడు. ఇదంతా ఆమె భరించలేకపోయింది.

ఈ మధ్య విజయ్ తన బిజినెస్‌ను హైదరాబాద్ నుండి వైజాగ్‌కు మార్చుకుంటానని, ఇక అక్కడే ఉంటాననడం మొదలుపెట్టాడు. భార్యా, పిల్లల్ని ఇక్కడే ఉండమంటాడు. ఇది స్వరూపకు ఇష్టం లేదు. అక్కడికి వెళితే ఉన్న ఆస్థి, డబ్బు మొత్తం తమ్ముడికి ఇచ్చేస్తాడని ఆమె భయం. పైగా విజయ్ లేకుండా ఇద్దరు పిల్లల్ని నేను చూసుకోలేను అంటుంది. అయినా విజయ్ ఇవేవీ పట్టించుకోకుండా వెళ్ళాల్సిందే అని పట్టుబట్టాడు. దాంతో ఏం చేయాలో తోచక తెలిసిన వారు చెబితే సలహా కోసం స్వరూప ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.



విజయ్ తన బిజినెస్‌ను హైదరాబాద్ నుండి వైజాగ్‌కు మార్చుకుంటానని, ఇక అక్కడే ఉంటాననడం మొదలుపెట్టాడు. భార్యా, పిల్లల్ని ఇక్కడే ఉండమంటాడు. ఇది స్వరూపకు ఇష్టం లేదు. అక్కడికి వెళితే ఉన్న ఆస్థి, డబ్బు మొత్తం తమ్ముడికి ఇచ్చేస్తాడని ఆమె భయం.

విజయ్‌ని పిలిచి మాట్లాడితే 'స్వరూపకు అసలు మాట్లాడడం రాదు. నోరు తెరిస్తే గొడవలే. బూతులు తిడుతుంది. పిల్లల్ని పట్టించుకోదు. టైంకి లేచి స్కూల్‌కి రెడీ చెయ్యదు. ఫైనాన్స్ బిజినెస్ చేస్తుంటుంది. నా దగ్గర, మా నాన్న దగ్గర కూడా డబ్బులు తీసుకుంది. ఇరవై నాలుగ్గంటలూ ఎవరితోనో ఫోన్లు మాట్లాడుతూనే ఉంటుంది. ఆమె ప్రవర్తన నాకు నచ్చడం లేదు. ఇక్కడ ఆమెకు రకరకాల రిలేషన్స్ ఉన్నాయి. వద్దని అంటే నా మాట పట్టించుకోదు. వీటన్నింటికీ దూరంగా ఉండాలనుకుంటున్నాను. పైగా ఇక్కడ ఉంటే నా బిజినెస్‌కు చాలా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అదే వైజాగ్‌లో అయితే హెల్ప్ చేసే ఫ్రెండ్స్ ఉన్నారు. నేను నా పిల్లల కోసమే వెళుతున్నాను. వారం వారం వీళ్ళదగ్గరకు వస్తాను' అన్నాడు.

పిల్లల్ని అడిగితే 'మాకు మమ్మీ అయినా డాడీ అయినా ఒకటే. వాళ్ళు ఉన్నా లేకున్నా మాకు పెద్ద తేడా ఏమీ ఉండదు. ఎందుకంటే ఇంట్లో అందరం ఉన్నా ఎవరి పని వాళ్ళు చేసుకుంటాం. ఒకరి గురించి ఒకరం పట్టించుకోము. సరదాగా మాట్లాడుకోవడం, బయటకు వెళ్ళడం లాంటివి ఏమీ ఉండవు. మమ్మీ, డాడీ ఇద్దరూ బిజీ. ఇక నాయనమ్మ, తాతయ్య ఎప్పుడూ కోపంగా ఉంటారు. వాళ్ళతో మాట్లాడాలంటేనే భయం' అంది పెద్దమ్మాయి.

అంతా విన్న తర్వాత ఇద్దరినీ కూర్చోబెట్టి 'విజయ్, ముందు మీరు వైజాగ్ వెళ్ళడం వాయిదా వేయండి. ఇక్కడి నుండే మీ పని చేసుకోండి. మీ పెద్దమ్మాయి పదో తరగతి చదువుతోంది. ఇలాంటి సమయంలో మీరు ఎక్కడో వెళ్ళి ఉండటం మంచిది కాదు. సమస్యల నుండి దూరంగా పారిపోవాలనుకుంటున్నారు. ఇది అస్సలు మంచిది కాదు. పిల్లలకు పంచాల్సిన ప్రేమ పంచకుండా డబ్బు సంపాదిస్తా అంటే ఆ డబ్బు వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఈ వయసులో పిల్లల్ని ఇలా వదిలేస్తే తర్వాత వాళ్ళు మీకు దక్కరు. ముందు కుటుంబంతో సంతోషంగా గడపండి. ఉన్నదాంట్లో సంతోషంగా ఉండడం అలవాటు చేసుకోండి' అని చెప్పి...

స్వరూపతో 'మీరు కూడా చాలా మారాలి. ఫైనాన్స్ బిజినెస్‌లో పడి పిల్లల గురించి సరిగ్గా పట్టించుకోవడం లేదు. కేవలం వాళ్ళ అవసరాలు తీర్చడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు, వారికి మీ ప్రేమను పంచాలి. మీరు వారికి తోడుగా ఉన్నారనే భరోసా ఇవ్వాలి. పిల్లలు మాకు ఎవరున్నా ఒకటే అంటున్నారంటే మీతో వారికి ఎలాంటి రిలేషన్ ఉందో అర్థమవుతుంది. కాబట్టి మీరిద్దరూ ఒకరిపై ఒకరు గొడవ పడడం మానేసి ముందు పిల్లల గురించి ఆలోచించండి. భార్యాభర్తలుగా కాకుండా తల్లిదండ్రులుగా ఆలోచించండి. ఇద్దరూ చదువుకున్న వారే అర్థం చేసుకోండి. మీ అహాన్ని కాస్త పక్కన పెడితే చాలు. మీ కుటుంబం సంతోషంగా ఉంటుంది' అని చెప్పాము.

దానికి ఇద్దరూ అంగీకరించారు. విజయ్ వైజాగ్ వెళ్ళడం వాయిదా వేసుకున్నాడు. పిల్లలతో సరదాగా గడుపుతామని, కుటుంబం మొత్తం కలిసి వారం రోజులు టూర్‌కి వెళ్ళి వస్తామని చెప్పి పిల్లల్ని తీసుకొని సంతోషంగా వెళ్ళిపోయారు.

- సలీమ

మండే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు...

మండే ఎండలో ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టడమంటే ప్రమాదాన్ని ఆహ్వానించినట్టే. రోజు వారీ కూలీలు, ఉద్యోగస్తులు వేసవిలో ఎంత కష్టమైనా బయటికి వెళ్లాల్సిందే. కానీ ఎండలో బయటికి వెళ్లాక ఆరోగ్య సమస్యలు



తలెత్తుతుంటాయి. మండుతున్న ఎండలో వడదెబ్బ సమస్య ఎక్కువగా ఉంటుంది. నిరంతరం చెమటలు బాగా పడతాయి. వేసవిలో వేయించిన ఆహారాలు, కారంతో కూడిన ఆహారాన్ని తింటే అజీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎలాంటి ఆహారాలు తినాలో ఇక్కడ తెలుసుకుందాం..

ఎండలో బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా తమతోపాటు ఒక నీళ్ల బాటిల్ తీసుకెళ్లాలి. బస్సులో ఉన్నా, కాలినడకన వెళ్తున్నా తప్పకుండా నీళ్ల బాటిల్ తీసుకెళ్లాలి. దాహంగా లేకున్నా అప్పుడప్పుడు నీరు తాగాలి. అలాగే పెరుగు, తాజా పండ్ల రసం వంటి శీతల పానీయాలు కూడా ఈ సీజన్‌లో చాలా ఆరోగ్యకరమైనవి.

ముదురు రంగు దుస్తులను వేసుకోవడం మానుకోవాలి. లేత రంగు దుస్తులు ధరించాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. అలాగే, ఎండ నుంచి ముఖాన్ని రక్షించుకోవడానికి టోపీలు, సన్ గ్లాసెస్, గొడుగులను ఉపయోగించవచ్చు. ఎండ వేడి నుంచి రక్షణ పొందడానికి కాటన్ స్కార్ఫ్‌తో తల, ముఖాన్ని కవర్ చేసుకోవాలి.

వేసవిలో టీ, కాఫీలకు దూరంగా ఉండాలి. ఇందులోని కెఫిన్ శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. ఇది శరీర ఉష్ణోగ్రతనూ పెంచుతుంది. శీతల పానీయాలకు కూడా దూరంగా ఉండాలి. వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి సీజనల్ ఫ్రూట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

వేసవిలో బయట దొరికే నూనె-మసాలా ఆహారాన్ని తీసుకోవడం నివారించాలి. ఇంట్లో వండిన భోజనం తినాలి. తేలికపాటి భోజనం తినడం ఇంకా మంచిది. ఈ వేసవిలో ప్రొటీన్లు, ప్రాసెస్డ్ ఫుడ్ తినకపోవడమే మంచిది. అవసరమైతే పెరుగు, పెరుగు అన్నం, పప్పు వంటి ఆహారాలు తినాలి. ఆహారంలో ఎక్కువ ద్రవం ఉండేలా చూసుకోవాలి. ■

మేం పంపిన డబ్బులు అక్రమార్కుల జేబుల్లోకి..

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం బీజేపీ జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. కులాలు, మతాల పేరిట కాంగ్రెస్ పార్టీ దేశాన్ని విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. వినాశకరమైన మతమార్పిడులు, మత రిజర్వేషన్లతో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ తీసుకొచ్చిన సామాజిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ మూలవాసులైన హిందువులను వదిలి ముస్లిం మైనార్టీలపై ప్రేమ ఒలకబోస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

అమలుకు వీలుకాని అనేక వాగ్దానాలు ఇచ్చి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ వంచనకు గురిచేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి బీజేపీ ఎంపీలను గెలిపించాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణ, తుంగభద్ర వంటి జీవనదులున్నా నేటికీ భూములకు సాగునీరు అందడం లేదన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ రుణమాఫీ ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ మాజీ అధ్యక్షులు ఎన్నికలకు ముందు ప్రేమ దుకాణాలు ప్రారంభించి.. ఆ తర్వాత మూసేస్తారని వ్యాఖ్యానించారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ నేతలు భారీ ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్నారని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సైతం అదే పని చేస్తుందని వ్యాఖ్యానించారు.దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాల ముందు తల ఎత్తుకునేలా పరిపాలన చేస్తున్నామని చెప్పారు. పేదలకు ఇల్లు, యువతకు ఉపాధి, భవిష్యత్‌కు గ్యారంటీ ఇదే మోడీ ఇస్తున్న హామీ అన్నారు. సభలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డికె.అరుణ, నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్ ప్రసాద్, నాయకులు నాగురావు, నామాజీ, బ్రహ్మచారి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు ఈసీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మెన్ జీ నిరంజన్‌కు కూడా సమాచార నిమిత్తం నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావును అసభ్య పదజాలంతో, అభ్యంతరకరమైన భాషతో వ్యక్తిగతంగా దూషిస్తున్నారనీ, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అని పేర్కొంటూ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎమ్ శ్రీనివాసరెడ్డి ఎన్నికల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు.

బీఆర్ఎస్‌కు క్రిష్టియన్ల మద్దతు

తెలంగాణ క్యాథలిక్ అసోసియేషన్, క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్టు క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, క్యాథలిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం. సోలోమోనురాజు, డేవిడ్, దయాకర్, లియో లెవిస్, జూడే రవి, డేవిడ్ శాంతరాజు, క్షైవియర్, రాజేశ్, అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పార్టీ క్రిష్టియన్ల గురించి ఎంతో ఆలోచించిందని తెలిపారు. క్రిస్మస్ పండుగను గతంలో కాంగ్రెస్ పట్టించుకునేది కాదని పేర్కొన్నారు. కనీసం అధికారికంగా వేడకలు జరిపేందుకు కూడా సంకోచించారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం క్రిస్మస్ పండుగను అధికారిక పండుగగా గుర్తించి, రెండు రోజులపాటు సెలవులు ప్రకటించిందని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను కేవలం 50 మంది మత పెద్దలు, నాయకులతో నామమాత్రంగా నిర్వహించిందని తెలిపారు. సెక్యులర్ అనే దానికి బీఆర్ఎస్ పర్యాయపదంగా నిలిచిందని పేర్కొన్నారు.

అంబానీ,అదానీలకే మోడీ నజరానాలు

మోడీయే. ఇక్కడి గోదావరి నీళ్లు ఎత్తుకుపోయే కుట్రకు తెరలేపిండు. ఇప్పటికే గోదావరి జలాలు లేక పక్కనే ఉన్న సజీవ జలధార మానేరు ఎండిపోయింది. మరోవైపు అడ్డగోలు హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఫ్రీ బస్సు తప్ప ఏమీ అమలు చేయలేదు. చేనేతలకు పని కల్పించడం లేదు' అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగించారు. అనంతరం సిద్దిపేటలో జరిగిన సభతో కేసీఆర్ బస్సు యాత్ర ముగిసింది.

లోక్‌సభ ఎన్నికల్లో మూడు పార్టీలు రంగంలో ఉన్నాయని, ఏ పార్టీ ఏం చేసిందో తమందరికీ బాగా తెలుసునని అన్నారు. దేశం, ధర్మం అంటూ మాట్లాడే ప్రధాని మోడీ, హిందూ హిందూ అని మాట్లాడే బండి సంజయ్ మొన్న వేములవాడకు వచ్చి రూపాయి కూడా రాజన్నకు ఇవ్వలేదని విమర్శించారు. కనీసం వేములవాడ దేవస్థానాన్ని బాగు చేస్తామని కూడా చెప్పలేదన్నారు. 'బండి సంజయ్ రూపాయి అడగలేదు.. మోడీ ఇవ్వలేదు' అని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎజెండాలో కార్మికులు, పేదలు, ఆటోరిక్షావాళ్లు.. ఇలా ఎవరూ ఉండరని, ఉండేదల్లా అంబానీ, అదానీ లాంటి పెద్దపెద్ద గద్దలే అని విమర్శించారు. అలాంటి లక్షల కోట్ల శ్రీమంతులకు కార్పొరేట్ ట్యాక్స్‌లు రద్దు చేస్తరు కానీ పేదల కోసం ఏమీ చేయరని అన్నారు. విదేశాల్లో నల్లధనం తీసుకొచ్చి ప్రతి పేదోడి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి మోసం చేసిన మోడీని మళ్లీ ఎలా నమ్మేదని ప్రశ్నించారు.

చేనేతలను ఉపాధికి దూరం చేసిన కాంగ్రెస్

తాము అధికారంలో ఉన్నన్ని రోజులు బతుకమ్మ చీరలు, స్కూల్‌డ్రెస్సులు, క్రిస్మస్, రంజాన్ కానుకలను సిరిసిల్ల చేనేతలకు ఆర్డర్లు ఇచ్చి ప్రతి కార్మికునికీ నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల ఉపాధి కల్పించామని కేసీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు కాదుకదా.. పాత బకాయిలూ చెల్లించకుండా చేనేతలకు ఉపాధిని దూరం చేసిందని వివరించారు. ఇదే విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తే 'నిరోధ్‌లు, పాపడలు' అమ్ముకోండని కాంగ్రెస్ నేతలు అంటే కోపం వచ్చి తాను ఒక మాట అన్నానని తనపై 48 గంటల నిషేధం పెట్టారని గుర్తు చేశారు. సిరిసిల్లకు ఒక టెక్స్‌టైల్ పార్కు కావాలంటే ప్రధాని మోడీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీగా ఉన్న సంజయ్ ఇక్కడి ప్రజలకు ఏం చేయాలో సోయి లేదని విమర్శించారు. బండి సంజయ్‌కి, వినోద్‌కుమార్‌కి ఏమైనా పోలిక ఉందా.. బండి సంజయ్ మాట్లాడేది ఏ భాషో కూడా అర్థం కాదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పి.. కమ్యూనిస్టు ఉద్యమ నేత, పార్లమెంట్‌లో గళం విప్పే వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి తెలంగాణ పౌరుషాన్ని చూపాలని పిలుపునిచ్చారు. గోదావరి జలాలను కాపాడుకోవాలన్నా.. మన నేత కార్మికుల బతుకులు బాగుపడాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ రోడ్‌షోలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య సహా పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ పెట్టుబడిదారుల పార్టీ

రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఆలోచించి ఓటు వేయాలి : కేసీఆర్

నవతెలంగాణ- సిద్దిపేట

బీజేపీ పెట్టుబడిదారుల పార్టీ.. అది పేదల అవస్థలు, రైతులు, బడుగు బలహీన వర్గాల, నేతన్నలను పట్టించుకోదు.. అని కేసీఆర్ అన్నారు. సిద్దిపేటలో జరిగిన రోడ్‌షోలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించే పార్టీ బీజేపీ అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మన మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి చదువుకున్న వ్యక్తి అని, ప్రజలకు సేవ చేసేందుకు పార్లమెంట్ ఎన్నికల పోటీలో ఉన్నారని అన్నారు. ఆయనను సిద్దిపేట నుంచి లక్ష మెజార్టీ ఇచ్చి గెలిపించుకుందామని కోరారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట పేరును చరిత్ర పుటల్లో నిలిపిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. వెంకట్రామిరెడ్డిని ఓటుతో దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

చూపుతుందని తెలిపారు. దీనికి స్పందించిన జస్టిస్ ఖన్నా "అది (.అమృత్ పాల్ సింగ్ కేసు) భిన్నమైనది" అని అన్నారు. అభ్యర్థి కానప్పుడు ప్రచారానికి ఒక వ్యక్తిని విడుదల చేసినందుకు ఎటువంటి పూర్వా పరాలు లేవని ఎస్జీ అన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా "మేము జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర ఉపశమనం ఇస్తూ ఆర్డర్‌ను పాస్ చేస్తున్నాం. సాయంత్రంలోగా ఆర్డర్‌ను అప్‌లోడ్ చేస్తాం" అని అన్నారు. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తుది వాదనలు వచ్చే వారంలో ముగిసే ప్రయత్నం చేస్తామని జస్టిస్ ఖన్నా పేర్కొన్నారు.అయితే, లిక్కర్ కేసు గురించి ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ మాట్లాడొద్దని ఈడీ తరపు న్యాయవాది కోర్టును కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. మీరు కూడా అంతకంటే గట్టిగా కౌంటర్ ఇవ్వాలని సూచించింది. 21 రోజులు కేజ్రీవాల్ జైల్లో ఉన్నా బయట ఉన్నా పెద్ద తేడా ఉండదని పేర్కొన్నారు. కాగా, కేజ్రీవాల్‌కు జూన్ 4 వరకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోరగా.. ఆ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జూన్ 2న తిరిగి లొంగిపోవాల్సిందేనని స్పష్టం చేసింది. కాగా కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈడీ గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. శుక్రవారం సాయంత్రం తీహార్ జైలు నుంచి కేజ్రీవాల్ విడదలయ్యాక..అక్కడి వచ్చిన పార్టీ శ్రేణులు,నాయకులకు అభివాదం చేశారు.

మళ్లీ బీజేపీ వస్తే.. వందేండ్లు వెనక్కే..

(మొదటిపేజీ తరువాయి)

చెందాలంటే వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించా లని మక్తల్ సభలో పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా ఉందన్నారు. తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో ఎంపీలను గెలిపించుకుని రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవాలంటే ఇండియా కూటమి కేంద్రం లో అధికారంలోకి రావాలని షాద్‌నగర్ సభలో రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో సీఎం మాట్లాడుతూ.. మోడీ పాలమూరు జిల్లాకు వచ్చి.. వారు ఏమి చేశారో చెప్పకుండా డీకే.అరుణను గెలిపించాలని కోరడం విచిత్రంగా ఉందన్నారు. అరుణను గెలిపిస్తే బంగ్లాకే పరిమితం అవుతారని, వంశీ చందర్‌రెడ్డిని ఢిల్లీకి పంపిస్తే మనకోసం సైనికుల్లా పోరాడి మన ప్రాంత అభివృద్ధికి పాటుపడతాడని అన్నారు. బీజేపీ హైదరాబాద్‌లో మత కల్లోలాలు సృష్టించి శాంతి భద్రతలను భగ్నం చేసే కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జేపీ దర్గా సాక్షిగా.. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల సాక్షిగా ఆగస్టు 15వ తేదీ లోపు రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. కేసీఆర్ కారు షెడ్డుకుపోయిందని భ్రమలో ఉన్నారని, నిజానికి కారు తూకానికే పోయిందని ఎద్దేవా చేశారు. అందుకే కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేశారని విమర్శించారు. షాద్‌నగర్ నియోజక వర్గ అభివృద్ధికి తాను అండగా ఉంటానని, రోడ్లు, కాలేజీలు, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని, షాద్‌నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకట్ రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంక, నాయకులు కాశినాథ్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, మామిడి శ్యామ్ సుందర్‌రెడ్డి, విశ్వం, బాబర్ ఖాన్, రఘు, జమ్రుత్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఖదీర్, అందే మోహన్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజు, ఈశ్వర్ నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

12 మంది మావోయిస్టులు హతం

(మొదటిపేజీ తరువాయి)

విష్ణుదేవ్ సాయ్ ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. భద్రతాబలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో జవాన్లు, సీనియర్ పోలీసు అధికారులు భారీ విజయాన్ని సాధించారని, వారిని అభినందిస్తున్నామని ఆయన తెలిపారు. కాల్పులు జరిగిన ప్రాంతంలో ఇప్పటి వరకు 12 మందిమావోయిస్టుల మృతదేహాలను గుర్తించామని ఆయన పేర్కొన్నారు.

900 మంది చుట్టిముట్టి కాల్పుల మోత

గంగలూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో గురు, శుక్రవారాల్లో భద్రతా బలగాలు పెద్ద ఎత్తున మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే కూంబింగ్ చేపడుతున్న భద్రతా దళాలకు మావోయిస్టులు ఎదురుపడటం వల్ల కాల్పులు మొదలైనట్లు సంబంధిత అధికారులు చెప్పారు. పిడియా అడవిలో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా బలగాలకు సమాచారం అందడంతో దంతెవాడ, బీజాపూర్ జిల్లాలోని సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. సుమారు 900 మందికిపైగా సైనికులు, మావోయిస్టులను చుట్టుముట్టినట్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో మావోయిస్టు అగ్రనేతలు లింగా, పాపారావు కూడా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇటీవల ఏప్రిల్ 30న నారాయణ్‌పుర్, కాంకేర్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో 10 మంది మరణించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నాటి ఘటనతో బస్తర్ ప్రాంతంలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 103 మంది మావోయిస్టులు చనిపోయారు. అయితే భద్రతా బలగాలు చెబుతున్నట్టుగా ఇవేమీ ఎదురుకాల్పులు కావని, వేటాడి చంపేస్తున్న ప్రభుత్వ హత్యలని పౌర సంఘాల నాయకులు, మానవ హక్కుల నేతలు ఆరోపిస్తున్నారు.

మటన్, మంగళసూత్రాలే మీ ప్రచారాస్త్రాలా?

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందన్న విషయాన్ని ప్రధాని గుర్తించాలని ఆయన కోరారు. దేశాభివృద్ధిని మోడీ గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతీ పేద మహిళకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తామని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రావడంతోనే రైతుల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రంలో మిగతా పథకాలన్నింటినీ అమలు చేస్తామని వాగ్దానం చేశారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోపై మాట్లాడాలని సవాల్ విసిరారు. ఇందిరాగాంధీ భూ సంస్కరణలు చేపట్టారనీ, బ్యాంకులను జాతీయం చేశారని తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసి, తదనుగుణంగా రిజర్వేషన్లను నిర్ణయిస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్,ఐఎఫ్ఎస్‌ల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు చాలా తక్కువగా ఉన్నారంటూ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం హైదారాబాద్‌ను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. హైదారాబాద్, బెంగళూరు, ముంబాయికి రావాల్సిన పెట్టుబడిదారులను బెదిరించి గుజరాత్ రాష్ట్రానికి తరలించారని ఈ సందర్భంగా ఖర్గే ఆరోపించారు. 'పువ్వులు పొద్దున పూస్తాయి. సాయంత్రం అవి (బీజేపీ గుర్తు కమలం పువ్వు) వాడిపోతాయి. చెయ్యి ఎప్పుడు మీతోనే ఉంటుంది. మోడీ చెప్పే అబద్ధాలను నమ్మి ఓట్లు వేస్తే మోసపోతారు' అని హెచ్చరించారు. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై కర్నాటక ప్రభుత్వం సిట్ బృందాన్ని ఏర్పాటు చేసిందనీ ఆ నివేదిక రాగానే ఆయనపై చర్యలు తీసుకుంటుందని వివరించారు. తన అల్లుడిపై వచ్చిన రూ. 500 కోట్ల ఆరోపణలపై స్పందిస్తూ విచారణ జరిపించి దోషిగా తేలితే శిక్ష వేయాలని సూచించారు.

వాళ్లు గెలిస్తే దేశం నాశనమే

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. పెట్ట రాములు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి, నాయకులు జి.శ్రీనివాసచారి, డోడ యాదిరెడ్డి, దొంతగాని పెద్దులు, తుమ్మల నర్సిరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు మర్రి వసంత, ఖమ్మం జిల్లా నాయకులు సత్యనారాయణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రాపర్తి వెంకటేష్, సింగిల్ విండో డైరెక్టర్ కేసిరెడ్డి యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ దొంగ మాటలు నమ్మొద్దు

సీఎం రేవంత్ రెడ్డివి జూటా మాటలు

- వినోదన్నను గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తే గొంతుకవుతాడు
- తెలంగాణను ఆంధ్రాలో కలిపే కుట్ర చేస్తున్న చంద్రబాబు, రేవంత్ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మార్పు తెస్తామంటే ప్రజలు నమ్మి ఆగమయ్యారని, మరోసారి బీజేపీ, కాంగ్రెస్‌ల దొంగ మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెడుతోంద న్నారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి బంద్ అయ్యాయని, ఇస్తామన్న తులం బంగారం ఏమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల కరెంటు వచ్చేదని, కాంగ్రెస్ వచ్చాక కరెంటు కోతలతో మోటార్లు కాలుతున్నాయని ఆరోపించారు. ఊర్లలో సాగు, తాగునీటికి కష్టాలు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో సిమెంట్, స్టీల్‌తో పాటు నిత్యావసర ధరలూ పెరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ వంద రూపాయల బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని, ఇప్పుడు మళ్లీ సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసుడు మొదలుపెట్టాడని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. నూట యాభై రోజులైనా అమలు చేయకుండా చేతులెత్తేసిందని విమర్శించారు. డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ మాట మార్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడగటానికి వస్తే.. మహాలక్ష్మి కింద ఇస్తామన్న రూ.2500, రూ. 4000 పెన్షన్ ఇచ్చాకనే ఓట్లు అడగటానికి రావాలని చెప్పాలని ప్రజలకు సూచించారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తోందన్నారు. తప్పిపోయి మళ్లీ కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే దొంగలకు సద్దికట్టినట్టవుతుందన్నారు. ఆంధ్రాలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి కలిసి మళ్లీ తెలంగాణను ఆంధ్రాలో కలిపే కుట్ర చేస్తున్నారన్నారు. నదుల అనుసంధానం పేరుతో కేంద్రం ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్ని వర్గాలను మోసం చేశాయని, వినోదన్నను గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తే గొంతుకవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత, పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు గంగం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మెన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి తెర.. ప్రలోభాలకు ఎర..

నేటితో ముగియనున్న పార్టీల క్యాంపెయిన్

- మూగబోనున్న మైకులు
- మొదలుకానున్న ప్రలోభాలు
- రాష్ట్రాన్ని చుట్టేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ
- భువనగిరిలో తనదైన శైలిలో సీపీఐ (ఎం) ప్రచారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో మండుటెండల్లో కొనసాగిన రాజకీయ పార్టీల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడనుంది. దీంతో ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి గత 20 రోజులుగా హోరెత్తిన మైకులు మూగబోనున్నాయి. ఇక ఓటర్లకు తాయిలాలు, ప్రలోభాల ప్రహసనం షురూ కానుంది. ఇంటింటి ప్రచారం పేరిట ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ధనిక పార్టీలన్నీ... తమ తమ 'సాధనాలను' సిద్ధం చేసుకున్నాయి. విచ్చలవిడిగా డబ్బు, మద్యాన్ని పంపిణీ చేసేందుకు ఆయా పార్టీలు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈసీ ఆదేశాల మేరకు రెండు రోజులపాటు మద్యం షాపులు మూతపడనున్న నేపథ్యంలో ఇప్పటికే తగినంత స్టాక్‌ను పార్టీల నేతలు నిల్వ చేసుకున్నట్టు సమాచారం. ప్రచారం పరిసమాప్తమైన తర్వాతి రోజైన ఆదివారం ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించకూడదనీ, న్యూస్ ఛానళ్లలో మాట్లాడకూడదనీ, ప్రకటనలు జారీ చేయకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆ మరుసటి రోజైన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది.

ఎన్నికల ప్రచారంతో ఇన్ని రోజులపాటు రాష్ట్రం హోరెత్తింది. క్యాంపెయిన్ నిమిత్తం బీజేపీ తరపున ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాష్ట్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక తెలంగాణలో పర్యటించారు. ఇక సీఎం రేవంత్... కాంగ్రెస్‌కు అన్నీ తానై ప్రచారాన్ని ముందుండి నడిపించారు. బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు ప్రచార బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. సీపీఐ (ఎం) తాను పోటీ చేస్తున్న భువనగిరిలో కేంద్ర ప్రభుత్వ విధానాలను, బీజేపీ మతోన్మాద చర్యలను ప్రజలకు విడమరిచి చెప్పింది. కాషాయ పార్టీ మూడోసారి



అధికారంలోకొస్తే దేశానికి రాబోయే పెను ప్రమాదాలను వివరిస్తూ ముందుకు సాగింది. పేదల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే బీజేపీని ఓడించటమొక్కటే మార్గమని సూచించింది. అందువల్ల కమలం పార్టీని ఓడించాలంటూ సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. ఆ పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్... బూర్జువా పార్టీలకు భిన్నంగా తనదైన శైలిలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.

రాష్ట్రాన్ని చుట్టేసిన రేవంత్...

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు దీటుగా ప్రచార సభలు నిర్వహించారు. పార్టీ ప్రచారాన్ని మొత్తం తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో జరిగిన జనజాతర సభతో తన ఎన్నికల క్యాంపెయిన్‌ను మొదలు పెట్టి, మొత్తం 27 రోజుల్లో 57 సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలతో ఆయన ప్రచారాన్ని హోరెత్తించారు. కొన్నిసార్లు రోజుకు నాలుగైదు సభలకు హాజరయ్యారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రచారం చేయాలంటూ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించటంతో కర్నాటక, కేరళలో సైతం ఆయన క్యాంపెయిన్ నిర్వహించారు. అక్కడి బహిరంగ సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీ నామినేషన్ కార్యక్రమానికి సైతం హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో సైతం కాంగ్రెస్‌కు ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ రేవంత్ ప్రచారాన్ని పదునెక్కించారు. బీజేపీ మూడోసారి అధికారంలో కొస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీనిపై మోడీ, అమిత్ షా సైతం వివరణలు ఇవ్వాల్సి వచ్చింది.

బాస్ యాత్రతో బీఆర్ఎస్‌లో జోష్...

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో డీలా పడ్డ బీఆర్ఎస్‌కు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర... మాంచి ఊపునిచ్చింది. ఏప్రిల్ 24 నుంచి శుక్రవారం వరకూ మొత్తం 17 రోజులపాటు ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో కరెంట్, నీటి కష్టాలు మొదలయ్యాయంటూ అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తూ తనదైన శైలిలో ఓటర్లను ఆకర్షించేందుకు ఆయన ప్రయత్నించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా పలు నియోజకవర్గాల్లో క్యాంపెయిన్ నిర్వహించి, క్యాడర్‌లో జోష్ నింపారు.

మరోసారి మతవాదమే...

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఎక్కువ సీట్లు గెలిచేందుకు పావులు కదుపుతున్న బీజేపీ... అందుకనుగుణంగా మరోసారి హిందూవాదాన్ని ఎత్తుకుంది. ఆ వాదాన్ని ఎక్కించేందుకు ఆ పార్టీ జాతీయ నేతలు కాలికి బలపం కట్టుకుని రాష్ట్రంలో కలియదిరిగారు. వీరిలో మోడీ అయితే తెలంగాణలో సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. ఆయన దాదాపు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటించారు.

బీజేపీ పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను పావులుగా మార్చారు : మంత్రి ఉత్తమ్ విమర్శ
- మీడియా సంస్థలనూ బెదిరించారని వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పదేండ్లుగా ఎంపీలకు నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్ర వారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నిర్వహించిన మీట్ ది ప్రెస్‌కు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధారాలు, చార్జిషీట్, విచారణ లేకుండానే ప్రతిపక్ష నేతలు జైల్లో పెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులు, మంత్రుల స్థాయి పరిస్థితే ఇలా ఉంటే, సామాన్యులకు దిక్కెవరని ప్రశ్నించారు. విపక్షాలనే కాకుండా మీడియా సంస్థలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, నిలదీసినా ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను ఉసిగొల్పి బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రెస్‌మీట్ పెట్టి పరిస్థితి ఎలా ఉందో వివరించారని తెలిపారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, వాక్‌స్వాతంత్ర్యం దెబ్బతిన్నాయని చెప్పారు. ఆర్థిక విధానాల్లోనూ మోడీ సర్కారు విఫలమైంద న్నారు. 70 ఏండ్లల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 40 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారనీ, కానీ వారు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా నల్లసాగు చట్టాలు తెచ్చారని అభిప్రాయపడ్డారు. కొన్ని నెలలపాటు రైతులు తీవ్ర ఆందోళన చేయడమేగాక, అనేక మంది రైతులు తమ ప్రాణాలను బలిదానం చేశాకే వాటిని రద్దు చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా, భర్తీ చేయకుండా బీజేపీ నిరుద్యోగులకు అన్యాయం చేసిందని తెలిపారు. అగ్నివీర్ పథకం దేశ రక్షణకు ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. గతంలో ఏ ప్రధాని కూడా మోదీలా దిగజారి మాట్లాడలేదని అభిప్రాయపడ్డారు. పదేండ్లల్లో ఏం చేశారో చెప్పడం లేదనీ, మళ్లీ గెలిస్తే ఏం చేస్తారో కూడా చెప్పకుండా ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. మోడీ రాష్ట్రాలకు ఇచ్చిందేమీ లేదన్నారు. తెలంగాణ, ఏపీ మధ్య బుల్లెట్ రైలు ఉండాలని కేంద్రాన్ని ఎన్నోసార్లు కోరినా మోడీ సర్కారు పట్టించుకోలేదని తెలిపారు. బీజేపీ నేతలకు తెలంగాణలో ఓట్లు అడిగే అర్హత కూడా లేదని వ్యాఖ్యానించారు.

నవచిత్రం

సరికొత్త లవ్‌స్టోరీ


మాధవ్, సిమ్రాన్ శర్మ

రవితేజ వారసుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని జేజేఆర్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. 'పెళ్లి సందడి' చిత్రంతో హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను రవితేజ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. 'ధృవ ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్‌లో చదివే సత్య (హీరోయిన్ సిమ్రాన్ శర్మ) కాలేజ్ టాపర్. హీరో (మాధవ్). సత్యను 'న' గుణింతంతో పిలుస్తూ సరదాగా టీజ్ చేస్తుంటాడు. హీరోయిన్‌ను హీరో 'న' గుణింతంతో ఎందుకు పిలుస్తున్నాడు? అల్లరిగా సాగే వీరి స్నేహం ప్రేమగా ఎలా మారింది ? అనేది టీజర్‌లో ఇంట్రెస్టింగ్‌గా చూపించారు. మాధవ్ రవితేజలా ఎనర్జిటిక్‌గా కనిపించాడు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.


ఆడపిల్ల విలువ తెలిపే సినిమా

భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బ్యానర్ పై భాస్కర్ యాదవ్ దాసరి దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం 'చిట్టి పొట్టి'. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అన్నా చెల్లెళ్ళ అనుబంధంతో నడిచే ఈ సినిమాలో తెలుగుదనం, భావోద్వేగాలు, ఆప్యాయతలు, అనురాగాలు ఉంటాయి. మూడు తరాలలో చెల్లెలుగా, మేనత్తలుగా, బామ్మగా ఒక అడబిడ్డకి పుట్టింటి పైన ఉన్న ప్రేమ, మమకారంను తెలిపే చిత్రం. ప్రతి ఇంట్లో ఉండే ఆడపిల్ల విలువ తెలియజేసే సినిమా ఇది. టైటిల్, మోషన్ పోస్టర్‌కు చక్కటి ఆదరణ లభించింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉన్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని దర్శక, నిర్మాత భాస్కర్ యాదవ్ దాసరి తెలిపారు.

ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, నిర్మాత: భాస్కర్ యాదవ్ దాసరి, సంగీతం: శ్రీ వెంకట్, ఎడిటర్: బాలకృష్ణ బోయ, కెమెరా: మల్హర్భట్ జోషి.


పవిత్ర, రామ్ మిట్టకంటి

లంకల రత్న విశ్వరూపం


విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ నటిస్తున్న మరో విభిన్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణ చైతన్య దర్శకుడు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే, ఈ చిత్రం నుండి విడుదలైన 'సుట్టంలా సూసి' పాట యూట్యూబ్‌లో 50 మిలియన్లకు పైగా వీక్షణలతో సంచలనం సృష్టించింది. అలాగే 'మోత' మాస్‌ని ఉర్రూతలూగిస్తోంది. ఆ చార్ట్‌బస్టర్ల తర్వాత మేకర్స్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' నుంచి 'బ్యాడ్' థీమ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ గీతం చిత్రంలోని చీకటి ప్రపంచాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ సాగింది. 'లంకల రత్న'గా విశ్వక్‌సేన్ పాత్ర తీరుని తెలియజేస్తూ సాగిన ఈ గీతంలోని సాహిత్యం అద్భుతంగా ఉంది.

బలమైన పదాలతో, లోతైన భావాలను పలికిస్తూ కళ్యాణ్ చక్రవర్తి అందించిన సాహిత్యం కట్టిపడేసింది. ముఖ్యంగా రచయిత-దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలం నుంచి జాలువారిన సాకి.. ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమాకి వెంకట్ ఉప్పుటూరి, గోపీ చంద్ ఇన్నమూరి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

నేహా శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈనెల 31న భిన్న కథ, కథనంతో రాబోతున్న ఈ సినిమా విజయం ఖాయమని మేకర్స్ దీమా వ్యక్తం చేస్తున్నారు.



యాక్షన్ సైంటిఫిక్ థ్రిల్లర్ మాత్రు

సుగి విజయ్, రూపాలిభూషణ్ హీరో, హీరోయిన్స్‌గా, శ్రీకాంత్ (శ్రీరామ్) ప్రధాన పాత్రలో జాన్ జక్కీ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ సైంటిఫిక్ థ్రిల్లర్ 'మాత్రు'. శ్రీపద్మినీ సినిమాస్ బ్యానర్ పై బి.శివప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని రైటర్ విజయేంద్ర ప్రసాద్ లాంచ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి ప్రసాద్ పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమౌతోంది. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు.

రవి కాలే, పృథ్వీ రాజ్, అలీ, దేవి ప్రసాద్, ఆమని, నందిని రాయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: జాన్ జక్కీ, నిర్మాత: బి.శివప్రసాద్, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: రాహుల్ శ్రీవాస్తవ్, ఎడిటర్: సత్యనారాయణ, ఫైట్స్: నందు మాస్టర్.



ఆటలు

ఐపీఎల్‌లో నేడు
కోల్‌కత X ముంబయి
వేదిక : కోల్‌కత , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

గిల్, సాయి శతకాలు

గుజరాత్ టైటాన్స్ 231/3



నవతెలంగాణ-అహ్మదాబాద్

గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు వీరంగం చేశారు. చెన్నై సూపర్‌కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104, 55 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (103, 51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. ఓపెనర్లు ఇద్దరూ తొలి వికెట్‌కు 210 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో శుక్రవారం మొతెరాలో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తొలుత 20 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూపర్‌కింగ్స్ పేసర్ తుషార్ దేశ్‌పాండే (2/33) రెండు వికెట్లతో రాణించాడు.

శతక మోత : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్‌కు ఓపెనర్లు పవర్‌ప్లేలో ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. ఆరు ఓవర్లలో టైటాన్స్ 58 పరుగులే చేసింది. ఓపెనర్లు ఇద్దరూ క్రీజులో నిలిచినా.. టైటాన్స్ ఆశించిన వేగం అందుకోలేదు. కానీ ఒక్కసారి క్రీజులో కుదురుకున్నాక ఓపెనర్లు ఇద్దరూ చెలరేగారు. సాయి సుదర్శన్ ఓ ఫోర్, మూడు సిక్సర్లతో 32 బంతుల్లో అర్ధ సెంచరీ బాదగా.. గిల్ ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 25 బంతుల్లోనే ఆ ఘనత అందుకున్నాడు. గిల్ 50 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్లతో సెంచరీ నమోదు చేయగా.. సాయి సుదర్శన్ సైతం 50 బంతుల్లోనే ఐదు ఫోర్లు, ఏడు సిక్సర్లతో శతకం సాధించాడు. ఆఖర్లో గిల్, సాయి నిష్క్రమించినా టైటాన్స్ అప్పటికే భారీ స్కోరు ఖాయం చేసుకుంది. డెవిడ్ మిల్లర్ (16 నాటౌట్) రాణించాడు. షారుక్ ఖాన్ (2) ఆఖరు బంతికి రనౌట్‌గా నిష్క్రమించాడు.

ద్రవిడ్‌కు పొడగింపు లేదు!

- త్వరలో కొత్త కోచ్‌కు నోటిఫికేషన్



ముంబయి : భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ షాక్ ఇచ్చింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆతిథ్య భారత్‌ను ఫైనల్స్‌కు చేర్చినా.. టైటిల్‌కు అడుగు దూరంలోనే ఆగిపోయారు. పదేండ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు తెరదించేందుకు రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్టును బీసీసీఐ ఈ ఏడాది జూన్ వరకు పొడిగించింది. ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ఫలితంతో సంబంధం లేకుండానే చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా ఓ స్పష్టత ఇచ్చారు. 'రానున్న కొన్ని రోజుల్లోనే చీఫ్ కోచ్ పదవికి బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించనుంది. రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం జూన్‌లో ముగియనుంది. చీఫ్ కోచ్‌గా కొనసాగాలని అనుకుంటే రాహుల్ ద్రవిడ్ కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పర్యాయం దీర్ఘకాలిక కోచ్ కోసం ఎదురుచూస్తున్నాం. కాంట్రాక్టు వ్యవధి మూడేండ్లు. ఫార్మాట్‌కు ఓ కోచ్‌ను నియమించే ఆలోచన లేదు. భారత జట్టులో ఆల్ ఫార్మాట్ క్రికెటర్లు సైతం ఎక్కువగా ఉన్నారు. క్రికెట్ సలహా సంఘం (సీఏసీ) ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటుంది. సీఏసీ విదేశీ కోచ్‌ను ఎంపిక చేస్తే బోర్డు జోక్యం చేసుకోదు. సీఏసీ నిర్ణయాన్ని అమలు చేయటమే బోర్డు బాధ్యత' అని జై షా అన్నారు. 2021 నవంబర్‌లో రాహుల్ ద్రవిడ్ భారత జట్టు చీఫ్ కోచ్ బాధ్యతలు చేపట్టారు.

ఎప్పుడూ నిరాకరించలేదు

శాంపిల్‌పై బజరంగ్ పూనియా



న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్‌లో మరో వివాదం తెరపైకి వచ్చింది. అగ్రశ్రేణి మల్లయోధుడు బజరంగ్ పూనియాపై నాడా (నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ) నిషేధం విధించగా.. ఆ తర్వాత యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ) సైతం అదే బాటలో నడిచింది. ఒలింపిక్ క్వాలిఫయర్స్ సమయంలో నాడా అధికారులకు మూత్ర నమూనాలు అందించేందుకు బజరంగ్ పూనియా నిరాకరించినట్టు ప్రధాన ఆరోపణ. నాడా నిబంధనల ప్రకారం శాంపిల్స్ నిరాకరిస్తే నిషేధం విధిస్తారు. తాజాగా ఈ అంశంపై బజరంగ్ పూనియా స్పందించారు. శాంపిల్ ఇవ్వడానికి ఎన్నడూ నిరాకరించలేదని సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. నాడా అధికారులే ప్రోటోకాల్ పాటించకుండా, ప్రామాణిక కిట్లు లేకుండా శాంపిల్ కోసం ఇబ్బంది పెట్టారని బజరంగ్ పూనియా ఆరోపించాడు. 'నేను ఏ దశలోనూ శాంపిల్ ఇచ్చేందుకు నిరాకరించలేదు. మార్చి 10, 2024న నాడా అధికారులు నా దగ్గరకు వచ్చారు. గతంలో ఓసారి ఎక్స్‌పైరీ కిట్‌తో పరీక్ష చేశారు. దీంతో ఈసారి శాంపిల్ సేకరణకు ప్రామాణిక కిట్లు ఉన్నాయా లేదా అని వాకబు చేశాను. రూల్స్ ప్రకారం మూడు కిట్లు ఉండాలి. కానీ ఒక్క కిట్ తీసుకొచ్చి శాంపిల్ ఇవ్వమని అడిగారు. దీనిపై నేను నాడా అధికారులకు ఫిర్యాదు చేశాను. నాడా నుంచి వివరణ సైతం కోరాను. నాకు ఎటువంటి సమాచారం, వివరణ ఇవ్వకుండా.. నేరుగా సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. క్వాలిఫయర్స్‌లో సెమీఫైనల్ బౌట్ తర్వాత సైతం నేను అక్కడే ఉన్నాను. 3, 4వ స్థానం కోసం జరిగే బౌట్ కోసం ఎదురుచూశాను. కానీ నాడా అధికారులు అప్పుడే వెళ్లిపోయారు. నా బౌట్ ముగిసిన గంట తర్వాత కూడా నేను వేదిక వద్దే ఉన్నాను. శాంపిల్ ఇవ్వడానికి నిరాకరించినట్టు ఎటువంటి ఆధారాలు లేవు' బజరంగ్ పూనియా తెలిపారు. ఏప్రిల్ 23న బజరంగ్‌పై నాడా వేటు వేయగా.. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు బజరంగ్‌పై నిషేధం వేసింది. బజరంగ్ పూనియా తరఫున కౌన్సిల్ మంగళవారం నాడా నోటీసుకు సమాధానం ఇచ్చారు. దీనిపై నాడా విచారణ చేపట్టనుంది. ఆ తర్వాత నాడా క్రమశిక్షణ సంఘం విచారణ జరుగుతుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886